ఆగస్టు 2020

172

సంపుటి : 15 సంచిక : 3

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

తీవ్రమవుతున్న వైరుధ్యాలు
మన భాషల చరిత్ర
పేదరికాన్ని పెంచుతున్న ప్రయివేటు వైద్యం
కోవిడ్19 కలకలం-పెట్టుబడిదారీ కల్లోలం
బహుళజాతి సంస్థలతో ఆత్మనిర్భర్ భారత్
చైనా వ్యతిరేకత వల్ల అభివృద్ధికి విఘాతం
విద్యా రుణం కోసం
ఇంటి నుండి పని: మహిళల సమస్యలు
ఉత్తరప్రదేశ్‌లో ఆటవిక పాలన
సుర్మా లోయలో రైతాంగ పోరాటాలు



epaper.prajasakti.com

# సుర్మా లోయలో రైతాంగ పోరాటాలు

మన దేశ విభజనకు ముందు అస్సాంలో ప్రాంతీయ భాషల ప్రాతిపదికగా రెండు కిసాన్‌సభలు ఉండేవి. సుర్మాలోయలోని రెండు జిల్లాలలో (కచార్, సిల్హెట్) బెంగాలీ భాష మాట్లాడేవారు ఎక్కువగా ఉండేవారు. మిగతా జిల్లాలలో అస్సామీ భాష మాట్లాడేవారు ఉండేవారు. బెంగాలీ భాష మాట్లాడే ప్రాంతంలో 1936లో కిసాన్‌సభ ఏర్పడితే మిగతా ప్రాంతంలో 1946లో ఏర్పడింది. కానీ అస్సాం అంతటా కిసాన్‌సభ కార్యకలాపాలు జరగడం ప్రారంభమయింది.

అస్సాంలో జమిందారీ విధానం అమలవుతున్న ప్రాంతాలలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు భూమిపై ఏ విధమైన హక్కులూ– నివసించే హక్కుగాని, సాగుచేసుకునే హక్కుగాని– ఉండేవి కాదు. జమిందారులకి నచ్చి చేసుకోమంటే సాగుచేసుకోవాలి, వదిలిపొమ్మంటే కిమ్మనకుండా తొలగిపోవాలి. ఆఖరికి ఆ భూమిలో ఉండేందుకు, ఓ పక్కా ఇల్లు నిర్మించుకునేందుకు కూడా హక్కులేదు. నీటి కోసం ఓ కుంట తవ్వుకునేందుకు వీలులేదు. కనీసం ఓ చెట్టునయినా కొట్టే హక్కు లేదు. కౌలుకు తీసుకున్న రైతులు చెప్పులుగాని, బూట్లుగాని తొడుగుకునేందుకు వీలులేదు. భూస్వామి దగ్గరకు వెళ్ళేటప్పుడు గొడుగు వేసుకోకూడదు. నగదు రూపంలోగాని, వస్తురూపంలో గాని సాధారణంగా ఇచ్చే కౌలుకు అదనంగా తమ ఇళ్లలో జరిగే పండుగలకు, పబ్బాలకు 'అబివబ్', లేదా 'నజరానా' లు భూస్వాములు వసూలు చేసేవారు. ఇవి క్రమక్రమంగా భూస్వాముల హక్కులుగా మారిపోయాయి. సామాజిక అణచివేత, ఆర్థిక దోపిడీ ఎంతగా పెరిగిపోయాయంటే ఇవి రైతులకు తలకు మించిన భారంగా తయారయ్యాయి.

1936లో సుర్మాలోయలో జరిగిన కిసాన్‌సభ కౌలు రైతుల డిమాండ్లను లేవనెత్తింది: 12 సంవత్సరాలకంటే ఎక్కువ రోజులు సాగుచేసుకుంటున్న రైతులకు భూమిపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేసింది. (అంటే వారిని భూమి నుంచి వెళ్లగొట్టే హక్కు భూస్వామికి ఉండదు) రైతులకు నీటి కోసం కుంటలు తవ్వుకునే హక్కు పక్కా ఇల్లు కట్టుకునే హక్కు ఉండాలి. భూస్వాములు అన్యాయంగా చేసే



సుర్మా లోయ పోరాట నేత
లామ్యాన్బా హిజామ్ ఇరబొట్

వసూళ్లన్నీ నిలిపివేయాలి, భూస్వాముల ఇళ్లలో, భూములలో ఉచితంగా పనిచేసే నాంకేర్ విధానం (అర్ధ బానిస విధానం) రద్దువేయాలి. భూస్వాముల పొలాలలో, ఇళ్లలో పరిహారం లేకుండా చేస్తున్న పనిని నిలిపివేస్తూ కౌలుదారీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సాగుచేస్తున్న భూమిపై రైతులకు హక్కు కల్పించాలి. అలాగే టీ తోటలను పెంచుతున్న రైతులకు వాటిపై స్థిరమైన హక్కు కల్పించాలి. రైతులపై జరుగుతున్న అన్నిరకాల దాడులు నిలిపివేయాలి. వారిని అగౌరవపరిచే అన్ని పద్ధతులు ఆగిపోవాలి.

పై డిమాండ్లను ప్రచారం చేస్తూ సిల్హెట్ జిల్లాలో అనేక వందల సమావేశాలు ఏర్పాటు చేయబడ్డాయి. జమిందారీ విధానం అమలవుతున్న ప్రాంతమంతటిలో ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. వీటన్నిటినీ వ్యతిరేకిస్తూ భూస్వాములు ప్రదర్శనలలో పాల్గన్న వారిని బెదిరించారు, గాయపరిచారు. జమీందారులు తమ తాబేదారులుగా ఉన్న 'నాంకేర్' ల చేత హక్కులు కోరుతున్న కౌలుదారుల ప్రదర్శనలపై దాడులు చేయించేవారు. ఇవన్నీ అప్పటివరకు ఉద్యమంలో ఉన్న బలహీనతలను ఎత్తిచూపాయి, ఎందుకంటే కిసాన్‌సభ నాంకేర్ల డిమాండ్లకన్నా కవులు రైతుల డిమాండ్లకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేది. అందుకని తదనంతర కాలంలో ఈ తప్పును సరిచేసుకోవడం జరిగింది.

'నాంకేర్'లు, వారి కుటుంబసభ్యులు స్వంతంగా సాగుచేసుకునేందుకో లేదా కాసిన్ని తిండిగింజలను పండించుకునేందుకో భూస్వాముల దగ్గరి నుండి భూమి తీసుకున్నందుకు బదులుగా భూస్వాముల పొలాలలో ఏ పరిహారం లేకుండా పనిచేసి పెట్టవలసి వచ్చేది. వీరు తమ పిల్లలను బడికి పంపను వీలులేదు. కనీసం వారికి మంచి పేర్లుకూడా పెట్టుకునే వీలు లేదు. వారి భార్యలను పిల్లలను భూస్వాముల కామవాంఛ నుండి కాపాడుకునే వీలులేదు, సంప్రదాయంగా అలవాటు పడిన ఏ బానిససేవలకు భంగం కలిగినా భూస్వాములు రైతులను పశువుల కన్నా హీనంగా హింసించడం సర్వ సాధారణం. ఈ పరిస్థితులలో 'నాంకేర్'ల డిమాండ్లను విస్తృతంగా ప్రచారం చేశారు. పలితంగా అనేకమంది ఉద్యమంలో భాగస్వాములయ్యారు.

1938లో షిల్లాంగులో అంతకు మునుపు ఎన్నడూ జరగనంత పెద్ద ప్రదర్శన జరిగింది. వందలాది మంది 'నాంకేర్'లు, రైతులు 86 కిలోమీటర్ల దూరం నుండి వచ్చి ప్రదర్శనలో పాల్గన్నారు. దారిలో అడ్డొచ్చిన కొండలను సహితం ఎక్కి ముందుకుసాగారు. 'నాంకేర్'ల విధానాన్ని రద్దు చేయమని కోరుతూ వారు ఉద్యమంలో చేరారు.

'నాంకేర్' ఉద్యమం కౌల రైతుల ఉద్యమంలో ఒక భాగమే అయినా 'నాంకేర్' ఉద్యమ ప్రత్యేకతలు దానికున్నాయి. రెండు ఉద్యమాలకు చాలా దగ్గరి సంబంధం ఉన్న మాట వాస్తవం. మత బేధాలను పక్కన పెట్టి హిందు, ముస్లిం 'నాంకేర్'లు ఉద్యమంలో భుజం భుజం కలిపి పనిచేసారు. ఇది ఉద్యమానికి కొత్త బలాన్నిచ్చింది. దీనితో భూస్వాములు, ప్రభుత్వం కూడా కోపంతో రగిలిపోయారు. నాంకేర్లను, రైతులను అరెస్టులు చేసి నిర్దాక్షిణ్యంగా కొట్టారు, వారిపై కేసులు బనాయించారు.

భూస్వాములతో కుమ్మక్కయిన ప్రభుత్వ ఉద్యోగులు రైతుల ఇళ్ళు కూల్చడానికి ఏనుగులను ఉపయోగించారు. సైన్యాన్ని రంగంలోకి దించారు. పోరాటాన్ని

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. సుర్మాలోయలో రైతాంగ పోరాటాలు ............ 2
2. తీవ్రమవుతున్న వైరుధ్యాలు
   ప్రకాశ్ కరత్ ............. 4
3. మన భాషల చరిత్ర
   ఎంవిఎస్ శర్మ ........... 8
4. పేదరికాన్ని పెంచుతున్న ప్రయివేటు వైద్యం
   ప్రీతమ్ దత్తాని, చేతన చౌదరివ .......... 10
5. కోవిడ్19 కలకలం- పెట్టుబడిదారీ కల్లోలం
   ఎస్ వెంకట్రావు ........ 12
6. బహుళజాతి సంస్థలతో ఆత్మనిర్భర్ భారత్
   సర్వేశ్ మాథుర్ ......... 19
7. చైనా వ్యతిరేకత వల్ల అభివృద్ధికి విఘాతం
   వి. శ్రీధర్ ............. 22
8. విద్యా రుణం కోసం
   గిరరీష్ ఖోండే........ 27
9. ఇంటి నుండి పని: మహిళల సమస్యలు
   అశ్విని దేశ్‌పాండే .... 29
10. ఉత్తరప్రదేశ్‌లో ఆటవిక పాలన
   ఎ కోటిరెడ్డి............ 32



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్:కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# సోషలిజం విశిష్టత

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఇది మనుషులకే కాదు, దేశాలకూ వర్తిస్తుంది. ప్రపంచంలో మహామహా ఆర్థిక వ్యవస్థలుగా చెప్పుకునేవన్నీ కరోనా మహమ్మారి ముందు కళు తేలవేస్తే ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న సోషలిస్టు దేశాలు మాత్రం ఆర్థిక వ్యవస్థల పరిమాణంతో నిమిత్తం లేకుండా ప్రజారోగ్యాన్ని, జీవనభృక్తినీ రక్షించడంలో ముందుపీఠిన నిలవడం నేటి ప్రపంచంలో మనకళ్లకు కడుతున్న సత్యం.

కరోనా మహమ్మారి పుట్టిన ఏడు మాసాలకే ప్రపంచంలోని 213 దేశాలకు వ్యాపించింది. 2 కోట్ల మందికి పైగా ప్రజలకు సోకింది. ఏడున్నర లక్షల మందిని బలితీసుకుంది. అగ్రరాజ్యమైన అమెరికా తన ప్రజలను కరోనా నుండి కాపాడ్డంలో ఎంతగా విఫలమైందో ఆ దేశంలోని కరోనా కేసులు, మరణాలే తెలుపుతున్నాయి. ప్రంచంలో అత్యధిక కేసులు, మరణాలు అమెరికాలోనే కొనసాగుతున్నాయి. యాక్టివ్ కేసుల సంఖ్యలోనూ దానిదే అగ్రస్థానం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అయిదో స్థానంలో ఉన్న భారత దేశం కరోనా కేసుల్లో మూడో స్థానంలో కొనసాగుతోంది. అగ్రస్థాయి అర్థిక వ్యవస్థలు కలిగిన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ వగైరా దేశాలన్నిటా లక్షల సంఖ్యలో కేసులు, వేలల్లో మరణాలు సంభవించాయి. కొన్ని దేశాల్లో మందగించినా కరోనా విలయం ఇంకా కొనసాగుతూనే ఉంది.

దీనికి భిన్నమైన దృశ్యం మనకు సోషలిస్టు దేశాల్లో కనిపిస్తుంది. కరోనా తొలుత వ్యాపించిన చైనా దాన్ని కట్టడి చేయడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. చైనా ప్రభుత్వం, కమ్యూనిస్టు పార్టీలు కరోనాపై యుద్ధం ప్రకటించి దేశ ప్రజలందరి సహకారంతో, అసాధారణమైన సమిష్టి కృషితో మూడు మాసాల్లో దానిపై విజయం సాధించాయి. 85 వేల కేసులు, నాలుగున్నర వేల మరణాల దగ్గర కరోనాను చైనా కట్టడి చేయగలిగింది. అక్కడ నేడు కేవలం 800 యాక్టివ్ కేసులు మాత్రమే ఉన్నాయి. చైనాతో 1200 కిలోమీటర్లకు పైగా సరిహద్దు ఉన్నప్పటికీ, నిత్యం దానితో వ్యాపార, వాణిజ్య కార్యకాలాపాలు సాగిస్తున్నప్పటికీ సోషలిస్టు వియత్నాం కోవిడ్ నుండి ప్రజలను కాపాడుకోగలిగింది. అక్కడ నేడు 500 లోపు యాక్టివ్ కేసులు మాత్రమే ఉన్నాయి. చైనా, వియత్నాంలు రెండూ కోవిడ్‌ను కట్టడి చేసి ఆర్థిక కార్యకలాపాలు ప్రారంభించాయి. పెట్టుబడిదారీ ప్రపంచమంతా ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే ఈ రెండు దేశాలు సానుకూల అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నాయి.

చైనాతో సరిహద్దుగల లావోస్, ఉత్తర కొరియా కూడా కరోనా నుండి తమ ప్రజల ప్రాణాలను, ఆరోగ్యాన్ని రక్షించకోగలిగాయి. అమెరికాకు కేవలం 90 మైళ్ల దూరంలో ఉన్న సోషలిస్టు క్యూబాలో ప్రస్తుతం 400 యాక్టివ్ కేసులు మాత్రమే ఉన్నాయి. క్యూబా ప్రభుత్వం కరోనా నుండి తన ప్రజలను రక్షించడమే కాదు వ్యాధిబారిన పడిన వారికి సేవచేసేందుకు అనేక దేశాలకు వైద్య బృందాలను పంపి ప్రపంచ వ్యాపితంగా జేజేలందుకున్నది. సోషలిస్టు దేశాల్లోనే కాదు మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఉన్న కేరళ కూడా కరోనాను సమర్థవంతంగా కట్టడి చేయగలిగింది.

నయాఉదారవాదం ఆరోగ్యాన్ని లాభాలు గడించే వ్యాపారంగా చూస్తుంది, సోషలిజం ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వ బాధ్యతగా చూస్తుంది. ఈ రోజు ప్రపంచ వ్యాపితంగా సోషలిస్టు దేశాల్లో కరోనాను కట్టడిచేసి ప్రజల ప్రాణాలను రక్షించగలగడానికీ, అమెరికా, భారత్ వంటి దేశాల్లో ప్రజలను కరోనా మహమ్మారికి వదిలిపెట్టడానికీ తేడా అదే. కరోనా నుండి ప్రజలనూ, ఆర్థిక వ్యవస్థలనూ రక్షించుకోవడం ద్వారా చైనా, వియత్నాం వంటి దేశాలు సోషలిజం విశిష్టతను లోకానికి చాటుతున్నాయి.


**చందా వివరాలు**

విడిప్రతిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.


**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**




epaper.prajasakti.com

ఫ్రెడరిక్ ఏంగెల్స్ ద్విశతజయంతి స్మారకోపన్యాసం

# తీవ్రమవుతున్న వైరుధ్యాలు



ప్రకాశ్ కరత్

**మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఫ్రెడరిక్ ఏంగెల్స్ ద్విశతజయంతి సందర్భంగా సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ఉపన్యాసాన్ని కింద ఇస్తున్నాం. సిపిఐ(ఎం) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 9వ తేదీన జరిగిన ఈ ఆన్‌లైన్ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. మధు అధ్యక్షత వహించారు... సంపాదకుడు**

కామ్రేడ్స్

ముందుగా ఇటీవల మృతి చెందిన మన నాయకులు సున్నం రాజయ్య, షడ్రక్‌లకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నాను.

మహా విప్లవ కారుడు ఏంగెల్స్ కారల్ మార్క్స్‌కు స్నేహితుడు, సహచరుడు, భాగస్వామి. వారిద్దరూ కలిసి శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని రూపొందించారు. ఏంగెల్స్‌కు మార్క్స్‌కు సహాయకుడు మాత్రమే అని చాలా మంది భావిస్తుంటారు. కాని అది నిజం కాదు. ఫ్రెడరిక్ ఏంగెల్స్ తాను స్వయంగా కార్మికోద్యమ సిద్ధాంతం, ఆచరణకు, శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయడానికీ ఎంతగానో తోడ్పడ్డారు. ఆయన తొలి రచన ఇంగ్లండ్‌లోని కార్మికవర్గ పరిస్థితులపై 1844లో రాశారు. ఇంగ్లండ్‌లోని కార్మికవర్గం పరిస్థితులను అధ్యయనం చేసిన ఏంగెల్స్, మార్క్స్‌కన్నా ముందుగానే కార్మిక వర్గ కేంద్ర పాత్ర గురించి వివరించారు. మార్క్స్‌తో కలిసి ఆయన 1848లో కమ్యూనిస్టు ప్రణాళిక రచించారు. ఆయన స్వయంగా 'వ్యక్తిగత ఆస్తి, కుటుంబం, రాజ్యాంగాల పుట్టక', 'యాంటీ డూరింగ్', 'డయలెక్టిక్స్ ఆఫ్ నేచర్' వంటి గ్రంథాలు రాశారు. ఏంగెల్స్‌కు విజ్ఞాన శాస్త్రాలంటే చాలా ఆసక్తి. తన కాలంలో ఉన్న అన్ని రకాల విజ్ఞాన శాస్త్రాలనూ ఆయన అధ్యయనం చేశారు. మార్క్స్, ఆయనా కలిసి మానవ విజ్ఞానాన్ని, కార్మికవర్గ సిద్ధాంతాన్ని మరింత ఉన్నత స్థానానికి తీసుకు వెళ్లారు. ఈ రోజు కూడా మార్క్సిజం అని మనం అంటున్నాం అంటే అది మార్క్స్, ఏంగెల్స్ ప్రతిపాదించిన సిద్ధాంతమే. అందువల్లనే ఆ మహనీయుడు ఏంగెల్స్‌కు 200వ జయంతి సందర్భంగా మనందరం నివాళులర్పిస్తున్నాం. మనందరం ఈ శాస్త్రీయ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోవడం, కార్మిక వర్గానికి ఈ శాస్త్రీయ సిద్ధాంతం ఆయుధాన్ని అందించడమే మనం ఆయనకు నేడు ఇచ్చే ఘనమైన నివాళి.

ఈ రోజు మనం ప్రపంచంలో ఒక అసాధారణ పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. ఈ రోజున కరోనా మహమ్మారి ప్రపంచాన్ని ఆవహించింది. భారత దేశంలో కూడా అది ప్రబలింది. మన దేశంలో 20 లక్షల మందికి పైగా ప్రజలు కరోనా బారిన పడ్డారు. 40 వేల మందికి పైగా మృతి చెందారు. ఈ మహమ్మారి పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలను బహిర్గతం చేసింది. సమాజంలోని సంఘర్షణ సరిహద్దులను మనముందుంచింది. ప్రతి మహమ్మారిని కూడా ఆయా చారిత్రక, రాజకీయ, ఆర్థిక సందర్భంలో పరిశీలించాలి. ఈ రోజునున్న సందర్భం ఏమిటి?

ప్రపంచ వ్యాపితంగా నయాఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉంది. మన పార్టీ మహాసభ దీన్ని వ్యవస్థాగత సంక్షోభం అంది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలేవీ నేటికీ 2008 ముందునాటి స్థితికి కోలుకోలేకపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో నేడు ప్రపంచాన్ని కరోనా మహమ్మారి ఆవహించింది. ప్రపంచంలో ఆరోగ్య ఎమర్జెన్సీ ఏర్పడింది. పెట్టుబడిదారీ దేశాలన్నిటా ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. ఉత్పత్తి పడిపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించినతరువాత ఎన్నడూ ఎరుగనంతటి స్థాయిలో ఆర్థిక మాంద్యం ఏర్పడింది. ఉత్పత్తి భారీగా పడిపోయింది. ఆదాయాలు పడిపోయాయి. కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు పోయాయి. ఇదంతాకూడా ప్రపంచంలో వందలాది కోట్ల మంది ప్రజల జీవనాన్ని దిగజార్చింది.

పెద్ద బ్యాంకులకూ, బడా ఫైనాన్స్ కంపెనీలకూ, కార్పొరేట్లకూ బెయిలవుట్లు ఇవ్వడం ద్వారా ఈ సంక్షోభం నుండి బయటపడడానికి నయా-ఉదారవాద ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. అదే సమయంలో సామాన్య ప్రజలు, శ్రామిక ప్రజల ఉపాధిని, జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి. కోట్లాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. మహమ్మారి సద్దుమణిగాక ఈ ప్రభుత్వాలు ప్రజలమీద పొదుపు చర్యలను రుద్దుతాయి. 2008 సంక్షోభం తరువాత మనం దీన్ని చూశాం. పొదుపు చర్యల పేరుతో ఉద్యోగాలు కత్తిరిస్తాయి, జీతాలకు కోతపెడతాయి, పెన్షన్లు తగ్గిస్తాయి. సాంఘిక సంక్షేమ సదుపాయాలను కుదిస్తాయి. ఆ విధంగా కార్మిక ప్రజల ఉపాధిమీద, జీవనం మీద భవిష్యత్తులో పెద్ద ఎత్తున దాడి జరగబోతోంది. ఇది పెట్టుబడికీ, శ్రమకూ మధ్య వైరుధ్యాన్ని తీవ్రతరం చేస్తుంది. ఈ దాడి వల్ల వర్గ పోరాటం తీవ్రమవుతుంది.




epaper.prajasakti.com

**"కోవిడ్ నేపథ్యంలో ప్రపంచంలో నాలుగు ప్రధాన సామాజిక వైరుధ్యాలు మరింత తీవ్రతరమవుతున్నాయి. వీటితోపాటు మరో ప్రధాన వైరుధ్య కూడా తీవ్రమవుతోంది. అది వాతావరణానికీ, పెట్టుబడిదారీ వ్యవస్థకూ మధ్య వైరుధ్యం. నయా-ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో వాతావరణాన్ని రక్షించే అవకాశాలు లేవు గనుక వాతావరణ కాలుష్యం, భూతాపం, అడవులు తరిగిపోవడం, తీవ్రమైన తుపానులు, మరోవైపు దుర్భిక్షాలు ఏర్పడం..వంటివన్నీ జరుగుతున్నాయి."**

రెండవ అంశం, ఈ మహమ్మారికి ముందు నుండే సామ్రాజ్యవాద శిబిరానికి నాయకత్వం వహిస్తున్న అమెరికా ఆధిపత్య ప్రభావం దీర్ఘకాలంగా తగ్గుతూ వస్తోంది. అయితే అది దుందుడుకు విన్యాసాల ద్వారా, సైనిక జోక్యాల ద్వారా, ఆర్థిక ఆంక్షల ద్వారా, బెదిరింపులు, వేధింపుల ద్వారా తన ఆధిపత్యాన్ని కాపాడుకోడానికి ప్రయత్నిస్తోంది. ఈ మహమ్మారి సందర్భంగా కూడా అమెరికా ఎలా ప్రవర్తిస్తున్నదో మనం చూస్తున్నాం. అది తన దేశంలో కరోనాను కట్టడి చేయలేక చైనా మీద దాడి చేస్తోంది. ఎందుకంటే చైనా ఆర్థికంగా ముందుకు పోతున్నందున అమెరికా భయపడుతోంది. చైనా కూడా కరోనా మహమ్మారి వల్ల బాధపడింది. అయితే మూడు మాసాల్లో దాన్ని కట్టడి చేసి ఆర్థికంగా పుంజుకోవడం ప్రారంభించింది. ఈ రోజున చైనాను లక్ష్యం చేసుకుని అమెరికా తన మిత్రులను సమీకరించడానికి ప్రయత్నిస్తున్నది. అమెరికా నేడు చైనాతో ఘర్షణను తీవ్రతరం చేసింది. రానున్న రోజుల్లో సామ్రాజ్యవాదానికీ, సోషలిజానికీ మధ్య వైరుధ్యం తీవ్రతరమవుతుందని ఈ పరిణామాలు తెలియజేస్తున్నాయి.

మూడవ అంశం, సోషలిస్టు దేశాలు వాటి ఆర్థిక స్థాయి, ఆదాయాల స్థితితో సంబంధం లేకుండా మహమ్మారిని కట్టడి చేయడంలో జయప్రదం అయ్యాయి. చైనా, వియత్నాం, క్యూబా తదితర సోషలిస్టు దేశాల్లో పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థ ఉండడం, ప్రజలను సమీకరించడం వల్ల అవి మహమ్మారిని అదుపు చేయగలిగాయి. మరోవైపు అమెరికా నేడు కరోనాకు కేంద్రంగా మారిపోయింది. ప్రపంచంలో అత్యధిక కేసులు అక్కడే ఉన్నాయి. అత్యధిక ప్రజలు అక్కడే మరణించారు. రోజురోజుకూ అమెరికాలో కరోనాబారిన పడే వారి సంఖ్య పెరిగిపోతోంది. అక్కడ ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా ప్రయివేటీకరించబడింది గనుకనే ఈ దుస్థితి ఏర్పడింది. అక్కడ పెద్దపెద్ద ఆసుపత్రులు, సదుపాయాలు ఉన్నాయి. కానీ అవి కొనగలిగే వారికి మాత్రమే దక్కుతాయి. మహమ్మారిని ఎదుర్కోవడంలో పెట్టుబడిదారీ వ్యవస్థకూ, సోషలిజానికీ మధ్య తేడా ఏమిటో తెలిసిపోతున్నది. ఇది సోషలిజం ఔన్నత్యాన్ని, దాని శక్తిని తెలియజేస్తున్నది.

ఇక అంతర్జాతీయ పరిస్థితుల్లో చివరి విషయం ఏమంటే, పెట్టుబడిదారీ దేశాల మధ్య, సామ్రాజ్యవాద దేశాల మధ్య, అమెరికాకూ ఇతర దేశాలకూ మధ్య విభేదాలు



మార్క్సిస్టు మహోపాధ్యాయుడు
ఫ్రెడరిక్ ఏంగెల్స్

పెరుగుతున్నాయి. తన ఆదేశాలను రుద్దడం ద్వారా అమెరికా తన నాయకత్వ పాత్రను కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఉదాహరణకు వాతావరణ మార్పుల ఒప్పందం విషయంలో అమెరికాకూ ఐరోపా దేశాలకూ మధ్య విభేదాలు తలెత్తాయి. అమెరికా ఈ ఒప్పందం నుండి ఎలా తప్పుకున్నదో మనం చూశాం. గతంలో అమెరికా ఐరోపా దేశాలు ఇరాన్‌తో అణు ఒప్పందం చేసుకున్నాయి. కానీ అమెరికా ఈ ఒప్పందం నుండి ఏకపక్షంగా బయటకు వచ్చేసింది. అయితే జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్‌లు దానితో ఏకీభవించలేదు. ఆ విధంగాసామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు తీవ్రమవుతున్నాయి.

అందువల్ల ఈ నాడు ప్రపంచంలో నాలుగు ప్రధాన సామాజిక వైరుధ్యాలు తీవ్రతరమవుతున్నాయి. వీటితోపాటు మరో ప్రధాన వైరుధ్య కూడా తీవ్రమవుతోంది. అది వాతావరణానికీ, పెట్టుబడిదారీ వ్యవస్థకూ మధ్య వైరుధ్యం. నయా-ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో వాతావరణాన్ని రక్షించే అవకాశాలు లేవు గనుక వాతావరణ కాలుష్యం, భూతాపం, అడవులు తరిగిపోవడం, తీవ్రమైన తుపానులు, మరోవైపు దుర్భిక్షాలు, హిమనదులు కరిగిపోవడం, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడం..వంటివన్నీ జరుగుతున్నాయి.

ఈ పూర్వరంగంలో మనం మన దేశంలో ఏం జరుగుతున్నదో పరిశీలించాలి. దేశంలో ఇప్పటికీ కరోనా మహమ్మారి తీవ్రంగా పెరుగుతూనే ఉంది. కరోనా కేసుల విషయంలో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. రోజువారీ మరణాల విషయంలో మొదటి స్థానానికి చేరుకుంది. మన దేశంలో సరైన ప్రభుత్వారోగ్య వ్యవస్థ లేదన్న విషయం అందరికీ తెలుసు. భారత దేశం ప్రజారోగ్యం కోసం స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 1 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నది. ఇది ప్రపంచంలోనే అతి తక్కువ. మన పాలకులు నయా-ఉదారవాద పంథా చేపట్టారు గనుక మనకీ దుస్థితి వచ్చింది. ఈ విధానాల ప్రకారం ప్రభుత్వం ఆరోగ్యం, విద్య, ఇతర ప్రజావసరాల కోసం ఖర్చు చేయకూడదు. అందువల్లనే మనకు సరైన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ లేకుండా పోయింది. ఫలితంగా మన దేశంలో, ఆంధ్ర ప్రదేశ్‌తో సహా మహమ్మారి విజృంభించింది. దీనికి కేరళ మాత్రమే మినహాయింపు. ఎందుకంటే అక్కడ వరుసగా వామపక్ష ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొంతమేరకు పటిష్టమైన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను నిర్మించడం జరిగింది. అక్కడ ప్రజాస్వామిక పనివిధానం, అధికార వికేంద్రీకరణ, పటిష్టమైన స్థానిక సంస్థలు, ఇతర స్వయంసహాయ సంస్థలు ఇవన్నీ ఉన్నాయి. ఇవి ఆరోగ్య రక్షణ కోసం ప్రజలను సమీకరించగలిగాయి. అందుకే మనం దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే కేరళ మహమ్మారిని సమర్థవంతగా ఎదుర్కోవడం చూశాం.

లాక్‌డౌన్ సమయంలో మనం మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, అమానుష లక్షణాన్ని చూశాం. కోట్లాదిమంది వలస కార్మికులు వందలాది మైళ్లు నడుచుకుంటూ తమ


epaper.prajasakti.com

"వాస్తవానికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఒక ప్రయివేటు ట్రస్ట్ రామ మందిరాన్ని నిర్మించాలి. కానీ ప్రధాన మంత్రి, ఉత్తర ప్రదేశ్ గవర్నర్, ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గన్నారు. దాన్ని ఒక ప్రభుత్వ కార్యక్రమంగా మార్చారు. మోడీ ప్రభుత్వం కింద భారత దేశంలో లౌకిక తత్వం ఈ స్థితికి దిగజార్చబడింది. మనది పేరుకు మాత్రమే లౌకిక గణతంత్ర రాజ్యం. ఆచరణలో హిందూత్వ రాజ్యంగా మారిపోయింది."

గ్రామాలకు వెళ్లాల్సి వచ్చిందో చూశాం. ఈ క్రమంలో వందలాది మంది చనిపోయారు. గత నాలుగు మాసాల లాక్‌డౌన్, మహమ్మారి కాలంలో ప్రభుత్వం ప్రకటించిన బెయిలవుట్ ప్యాకేజీలో ఉద్యోగాలు, జీవనోపాధి, ఆదాయాలు కోల్పోయిన ప్రజలకు కనీస ఉపశమనం కూడా కల్పించలేదు. ప్రజలకు నేరుగా సహాయం చేయడం కోసం జిడిపిలో కనీసం ఒక్క శాతం కూడా ఖర్చు చేయలేదు. అమెరికాతో సహా ఇతర పెట్టుబడిదారీ దేశాలు ఎంతో కొంత ప్రజలకు సహాయం చేశాయి. కానీ భారత దేశంలో ప్యాకేజీ మాత్రం బడా పెట్టుబడిదారులకూ, బడా ఫైనాన్స్ సంస్థలకు మాత్రమే ఉద్దేశించి ఇచ్చారు. లాక్‌డౌన్ సందర్భంగా ఆర్థిక ప్యాకేజీలు రూపొందించి, ప్రకటించిన తీరులోనే మనకు ఈ ప్రభుత్వ వర్గ లక్షణం కనిపిస్తుంది. ఈ ప్యాకేజీ ప్రజలకు సహాయం కల్పించకపోగా ప్రయివేటీకరణను ఊపుగా అమలు చేసింది. ప్రభుత్వ రంగం సంస్థలతోపాటు సమాజంలోని అన్ని రంగాల్లో ప్రయివేటీకరణకు ద్వారాలు తెరిచింది. రైల్వేల్లో 131 రైలు మార్గాలను ప్రయివేటు వారికి అప్పజెప్పేస్తున్నది. బొగ్గుతో సహా గనుల తవ్వకాలను ప్రయివేటీకరించింది. రక్షణ రంగంలోకి మరింత విదేశీ పెట్టుబడులకు ఆహ్వానించింది, మరింత ప్రయివేటీకరించింది. లాక్‌డౌన్‌ను ఉపయోగించుకుని మన దేశంలోని అన్ని రంగాల్లో ప్రయివేటీకరణ ప్రణాళికలు అమలు చేసింది. దీని వల్ల మన ప్రభుత్వ రంగం నాశనమవుతుంది.

దీంతోపాటు కార్మిక వర్గంపై దాడులకు దిగింది. 13 రాష్ట్రాలు కార్మిక చట్టాలను సస్పెండ్ చేయడమో, పలుచబరచడమో చేశాయి. మోడీ ప్రభుత్వ సూచనలతో 8 గంటల పనిదినం 12 గంటలకు పెంచబడింది. ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్‌లలో కార్మిక చట్టాలన్నిటినీ మూడేళ్లపాటు సస్పెండ్ చేశారు. ఆ విధంగా లాక్‌డౌన్ రోజుల నుండి మోడీ ప్రభుత్వం ఒకవైపు ధనికులకూ, కార్పొరేట్‌లకూ ప్యాకేజీలు ఇస్తూ మరోవైపు కార్మికవర్గంపై దాడికి పాల్పడుతోంది. వీరిలో కూడా వలస కార్మికుల పరిస్థితిని మరింత దుర్భరం చేసింది. ఇదంతా ఆర్థిక రంగంలో మోడీ కరోనా కాలంలో ప్రజలపై చేస్తున్న దాడులు.

మోడీప్రభుత్వ రెండవ దాడి హిందూత్వ ఎజెండా అమలు రూపంలో జరుగుతోంది. మహమ్మారి రాక ముందే జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాన్ని రద్దు చేశారు. 370 అధికరణ ద్వారా రాష్ట్రానికి లభించే ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేశారు. రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ముక్కలు చేశారు. మన దేశంలో జమ్మూ-కాశ్మీర్ మాత్రమే ముస్లిం మెజారిటీ రాష్ట్రంగా ఉంది గనుక వారు ఈ పనిచేశారు. ఆ రాష్ట్ర ప్రజలను ఈ నాటికి కూడా, రాష్ట్రాన్ని ముక్కలు చేసిన ఏడాదితరువాత కూడా శిక్షిస్తూనే ఉన్నారు. మొదట వారిపై నిషేధాలు పెట్టారు, తరువాత లాక్‌డౌన్ పెట్టారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా జమ్మూ-కాశ్మీర్ ప్రజలకు నేటికీ 4జి కమ్యూనికేషన్ లేదు. 4జి మొబైల్ ఫోన్‌లు లేవు. ఇప్పటికీ అనేక మంది రాజకీయ నాయకులను నిర్బంధంలో ఉంచారు. కొన్ని సార్లు వారిని విడుదల చేసినా వెంటనే గృహ నిర్బంధంలో ఉంచుతున్నారు.

ప్రధానమంత్రి అయోధ్య వెళ్లి రామ మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం మనకు తెలుసు. వాస్తవానికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఒక ప్రయివేటు ట్రస్ట్ రామ మందిరాన్ని నిర్మించాలి. కానీ ప్రధాన మంత్రి, ఉత్తర ప్రదేశ్ గవర్నర్, ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గన్నారు. దాన్ని ఒక ప్రభుత్వ కార్యక్రమంగా మార్చారు. మోడీ ప్రభుత్వం కింద భారత దేశంలో లౌకిక తత్వం ఈ స్థితికి దిగజార్చబడింది. మనది పేరుకు మాత్రమే లౌకిక గణతంత్ర రాజ్యం. ఆచరణలో హిందూత్వ రాజ్యంగా మారిపోయింది.

మెజారిటీ మతస్తుల రాజ్యంగా, హిందూ రాష్ట్రగా మార్చాలన్న సిద్ధాంతాన్నికి అనుగుణంగా ఆచరిస్తున్నారు. కరోనా మహమ్మారి కాలంలో కూడా ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో ముస్లింలను కరోనా కారియర్స్‌గా అభివర్ణిస్తూ ఎలా ప్రచారం గావించారో చూశాం. ఢిల్లీలో తబ్లిగి జమాత్ సమావేశం తరువాత ముస్లింలే దేశంలో కరోనా వైరస్‌ను వ్యాపింప జేస్తున్నారన్న ప్రచారాన్ని పనిగట్టుకుని చేశారు. ముస్లింలను బహిష్కరించాలి, వారి షాపుల్లో వస్తువులు కొనకూడదు, ముస్లిం వీధి వ్యాపారులను తరిమేయాలి అంటూ అనేక ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఆ విధంగా హిందూత్వ దాడి ఈ కాలంలో తీవ్రమైంది. ఢిల్లీలో గత మూడు మాసాలుగా సిఎఎ-ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన వారిని పెద్ద ఎత్తున అరెస్టులు చేశారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు వాయవ్య ఢిల్లీలో సృష్టించిన మతఘర్షణలకు ముస్లింలే కారణమంటూ వారిని అరెస్టులు చేశారు. ఢిల్లీలో సిఎఎ-ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా నిరసన తెలియజేసిన వారినందరిపై మత ఘర్షణలకు కుట్రపన్నారంటూ ముద్రవేస్తున్నారు. యుఎపిఎ చట్టం కింద అనేక మందిని అరెస్టు చేశారు. జామియా మిలియా విశ్వవిద్యాలయం, జెఎన్‌యు విద్యార్థులను, ఉపాధ్యాయులను, రిటైర్డ్ స్కాలర్స్‌ను అరెస్టు చేశారు. ఇతర సామాజిక కార్యకర్తలను వెంటాడి వేధిస్తున్నారు. మహమ్మారి సమయంలో కోర్టులు పనిచేయకపోవడం వల్ల అరెస్టయిన వారిలో చాలా మందికి బెయిల్‌కోసం దరఖాస్తు చేసుకోడానికి కూడా అవకాశం ఉండడం లేదు. మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో ఇటువంటి పరిస్థితిని సృష్టించింది.

మూడవ విషయం, ప్రజాతంత్ర హక్కులపైనా, ప్రజా తంత్ర సంస్థలపైనా మోడీ ప్రభుత్వం దాడులకు పాల్పడుతోంది. యుఎపిఎ చట్టం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా, వారి కార్యకలాపాలు అరికట్టడానికి అమలు చేయాలి. కానీ దాన్ని నేడు ప్రతిపక్షాల కార్యకర్తలపైనా, సామాజిక, ప్రజా కార్యకర్తలపైనా ప్రయోగిస్తున్నారు. దేశ ద్రోహం కేసులు పెడుతున్నారు. మరోవైపు కరోనా మహమ్మారి కాలంలోనే ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాను అస్థిరపరచడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మహమ్మారి ప్రారంభంలోనే మధ్య ప్రదేశ్ ప్రభుత్వాన్ని పడదోశారు. ఇప్పుడు రాజస్థాన్ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విధంగా ప్రజాస్వామ్యం పైనా, ప్రజాతంత్ర హక్కులపైనా దాడులు చేయడం, నిరంకుశ



epaper.prajasakti.com

చట్టాలు ఉపయోగించడం మహమ్మారి కాలంలో పెరిగింది.

నాల్గవ అంశం, మహమ్మారిని ఉపయోగించుకుని వారు అధికారంపై తమ నియంతృత్వ పట్టును పెంచుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజాతంత్ర సంస్థలన్నీ నిర్వీర్యం చేయబడుతున్నాయి.

అయిదవ విషయం, అమెరికా సామ్రాజ్యవాదంతో బంధాలను మరింత పెంచుకుంటున్నది. లడక్ సరిహద్దుల్లో చైనాతో ఘర్షణల తరువాత మోడీ ప్రభుత్వం అమెరికాతో వ్యూహాత్మకంగా, సైనికంగా మరింత సన్నిహితం అయింది. ఈ నాడు అమెరికాతో వ్యూహాత్మకంగా జతకట్టడమే కాదు, మొత్తం ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో భారత్‌ను అమెరికా అనుచర దేశంగా మార్చేస్తోంది.

మహమ్మారి కాలంలో నెలకొన్న పరిస్థితులివి. ఈ మహమ్మారి ఇప్పుడిప్పుడే పోయేట్లు లేదు. మరికొన్ని మాసాలుంటుంది. ఈ పరిస్థితుల్లో మనం జాగ్రత్తలు తీసుకుంటూనే, భౌతిక దూరం పాటిస్తూనే, మాస్కులు ధరిస్తూనే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రజాస్వామ్యంపై దాడులను ఎదుర్కోవాలి. గత రెండు మాసాలుగా మనం తక్షణం చేపట్టాల్సిన లక్ష్యాలగురించి చర్చిస్తున్నాం. అంతర్జాతీయ చమురు ధరలు తగ్గుతున్న సమయంలో ప్రభుత్వం వరుసగా 16 రోజులపాటు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచింది. దీన్ని ఎలా ప్రతిఘటించాలి? నిత్యావసరాల ధరలు ఇప్పుడు పెరిగిపోతున్నాయి. వ్యవసాయ దారుల సంక్షోభం ఉండనే ఉంది. కార్మిక వర్గం దాడులకు గురవుతోంది. ఈ సమస్యన్నిటిపైనా మనం మెట్టుమెట్టుగా ప్రజలను కదిలించాలి. ఆందోళనలు చేయాలి. పోరాటాలు అభివృద్ధి చేయాలి. కరోనా ఉన్న కాలంలో దీన్నిమనం ఎలా చేయగలం?

దీనికి మార్గం ఏమంటే, మొదటి మెట్టుగా మనం స్థానిక సమస్యలను చేపట్టాలి. ఈ మహమ్మారి స్థానిక ప్రజల జీవనాన్ని, ఉపాధిని ఎలా దెబ్బతీసిందో పరిశీలించాలి, వారికి ఆహారం కావాలి. రేషన్స్ కావాలి. వారికి ప్రభుత్వం నుండి రావలసిన అనేక సదుపాయాల రావాలి. ఈ అన్ని సమస్యలను మనం కింది స్థాయి నుండి చేపట్టాలి. మెట్టుమెట్టుగా ప్రజలను సమీకరించాలి. ఆ ప్రాంతంలోని పరిస్థితిని బట్టి, కరోనా పరిస్థితి మెరుగుపడే దాన్ని బట్టి మరింత విస్తృత స్థాయిలో సమీకరణ చేపట్టాలి.

**" పార్టీ నిర్మాణ పరంగా చూస్తే కరోనా మహమ్మారి వల్ల మనం సాధారణ పద్ధతిలో పార్టీ పనిచేయడం సాధ్యం కాదు. ముందుగా మనం మన పార్టీ సభ్యులతో సంబంధంలో ఉండాలి. మన పార్టీ శాఖలు చురుకుగా పని చేసేట్లు చూడాలి. పార్టీ కమిటీలు అవసరమైతే ఆన్‌లైన్‌లో నిర్వహించుకోవాలి. కానీ ఉన్న పరిస్థితుల్లో గరిష్ట స్థాయిలో పని జరిగే పద్ధతులు అవలంభించాలి. "**




బొగ్గు గనుల ప్రయివేటీకరణకు నిరసనగా సమ్మె చేస్తున్న కార్మికులు

పార్టీ నిర్మాణ పరంగా చూస్తే కరోనా మహమ్మారి వల్ల మనం సాధారణ పద్ధతిలో పార్టీ పనిచేయడం సాధ్యం కాదు. ముందుగా మనం మన పార్టీ సభ్యులతో సంబంధంలో ఉండాలి. మన పార్టీ శాఖలు చురుకుగా పని చేసేట్లు చూడాలి. పార్టీ కమిటీలు అవసరమైతే ఆన్‌లైన్‌లో నిర్వహించుకోవాలి. కానీ ఉన్న పరిస్థితుల్లో గరిష్ట స్థాయిలో పని జరిగే పద్ధతులు అవలంభించాలి.

మరోవిషయం ఏమంటే అనేక చోట్ల కార్మికవర్గం పోరాటాల్లోకి వస్తున్నారు. బొగ్గు గనుల్లో కార్మికులు మూడు రోజులు సమ్మె చేసిన సంగతి మనకు తెలుసు. బొగ్గు బ్లాకులను ప్రయివేటు వారికి వేలానికి నిరసనగా అయిదు బొగ్గు గని కార్మిక సమాఖ్యలు ఇచ్చిన ఐక్య పోరాటంలో 5.3 లక్షల మంది కార్మికులు పాల్గన్నారు. దేశ వ్యాపితంగా ప్రతి బొగ్గు గని ప్రాంతంలోనూ కార్మికులు మూడు రోజుల సమ్మెలో పాల్గన్నారు. దీనికి పెద్ద ఎత్తున కార్మికులను ఒక చోట సమీకరించాల్సిన అవసరం లేదు. ఈ సమ్మె జయప్రదం కావడంతో ఆగస్టులో వాస్తవ వేలం జరిగే టప్పుడు ఒక రోజు సమ్మె చేయాలని నిర్ణయించారు. స్కీమ్ వర్కర్లు సమ్మెకు వెళు తున్నారు. ఇలా సెక్షన్ తరువాత సెక్షన్ కార్మికులు పోరాటంలోకి వస్తున్నారు. ఇటువంటి పోరాటాలు ముందుముందు మరిన్ని వస్తాయి.

మనం ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ వాటిలో చురుకుగా పాల్గనడానికి, నాయకత్వం వహించడానికి చొరవ చూపాలి.


అదే సమయంలో మనం ప్రజల్లో డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించుకుని సోషల్ మీడియాలో రాజకీయ క్యాంపెయిన్ నిర్వహించాలి. ఈ క్యాంపెయన్స్‌లో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను ఎండగట్టాలి. మన ప్రత్యామ్నాయ వేదికలను ప్రచారం చేయాలి. మనం డిజిటల్ టెక్నాలజీని, మనకున్న వనరులను ఉపయోగించుకుని ఈ క్యాంపెయిన్లన్నిటినీ నిర్వహించాలి. డిజిటల్ టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకోవాలి. నైపుణ్యంగా ఉపయోగించుకోవాలి.

రాన్ను రోజుల్లో మహమ్మారి తెచ్చే రాజకీయ మార్పులను కూడా మనం గమనించాలి. బిజెపి ఈ మహమ్మారిని అడ్డుపెట్టుకుని తన రాజకీయ పట్టును మరింత పెంచుకోడానికి ప్రయత్నిస్తుంది. ప్రతిపక్షాలను చూస్తే, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ సంక్షోభంలో ఉంది. ఆ పార్టీలో అంతర్గత కలహాలను, మధ్య ప్రదేశ్, రాజస్థాన్‌లో బిజెపి ఎలా ఉపయోగించుకున్నదో చూశాం. కాశ్మీర్ వంటి అనేక సమస్యలపై కాంగ్రెస్ ఒక నిర్దిష్టమైన వైఖరి తీసుకోలేకపోతున్నది. చివరికి రామ్ మందిరం విషయంలో కూడా అంతే. మేము

(మిగతా 21వ పేజీలో)



epaper.prajasakti.com



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

# మన భాషల చరిత్ర

ఎంవిఎస్ శర్మ

మన దేశంలో బహు భాషలు ఉన్నాయి. మాతృభాష చుట్టూ మన మనోభావాలు బలంగా అల్లుకుని ఉంటాయి. ఈ భాషల చుట్టూ చాలా రాజకీయ వివాదాలు కూడా గతంలో నడిచాయి, ఇప్పుడూ నడుస్తున్నాయి. అందుచేత మన దేశ చరిత్రను తెలుసుకోవడ మంటే మన దేశ భాషల చరిత్రను కూడా తెలుసుకోవడమే.

ఇంతకూ అసలు మానవులు మాట్లాడడం ఎప్పటినుంచీ మొదలైంది? మనిషే కాదు, జంతువులూ మాట్లాడతాయి అని కాశీమజిలీ కథలను ఉదహరించేవారికైతే మనం ఏమీ చెప్పలేం. నోటితో రకరకాలుగా శబ్దాలు చేయడం అన్ని జంతువులూ చేస్తాయి. కోపం, భయం, ఆనందం, జతగూడాలనే కోరిక, ప్రమాదం దాపురించిందనే సంకేతం - ఇటువంటివి చాలా రకాల జంతువులు తమ నోటివెంట శబ్దాలతో తెలియజేస్తాయి. దీనినే భాష అని అనలేము. కొన్ని పదాలను రూపొందించి వాటిని ఒక వాక్య రూపంలో తెలియజేయగలిగితే అప్పుడు అది భాష అవుతుంది.

ఇరవై లక్షల సంవత్సరాల క్రితం మానవుడికి పూర్వీకులుగా పరిగణింపబడే హోమో హేబిలిస్ అనే నరవానరాలు తమ మెదడులో జరిగిన అభివృద్ధి పర్యవసానంగా మాటలాడడం ప్రారంభించాయి. ఐతే అవి ప్రధానంగా అరుపులు, రకరకాల శబ్దాలు, చేతులతో, ఇతర అవయవాలతో రకరకాల భంగిమలను అభినయించడం (ఇప్పుడు కూడా మనం మాట్లాడేటప్పుడు చేతులను, తలను, కళ్ళను రకరకాలుగా ఆడిస్తాం) గర్జించడం వంటి చర్యలకే పరిమితం అయాయి. అంతకు మించి పదాలను ఉచ్చరించడం సాధ్యం కాలేదు. వెన్నుపూస ఇంకా పూర్తిగా నిటారుగా లేనందున, స్వరపేటిక తగినంతగా అభివృద్ధి చెందనందున, తగినంత పరిమాణంలో గాలిని పీల్చి ఆ స్వరపేటిక ద్వారా శబ్దం వచ్చేవిధంగా వదలడం వీలుకాలేదు.

సుమారు ఒక లక్ష సంవత్సరాల క్రితం శరీర నిర్మాణ రీత్యా ఆధునిక మానవుడు అనదగిన మన పూర్వీకులు రంగంమీదకు వచ్చారు. అప్పటికి మాట్లాడగలిగే సామర్థ్యం సంతరించుకున్నాడు. వెన్నాముక నిటారుగా అయింది. స్వరపేటిక పరిమాణం తగినంతగా పెరిగింది. మెదడులో "బ్రోకాస్ ఏరియా" అన్నది అప్పటికే అభివృద్ధి చెందింది. ఇదంతా కలిసి పదాలను రూపొందించడానికి, వాటిని వాక్యరూపంలో అమర్చడానికి, ఉచ్చరించడానికి తగిన సామర్థ్యాన్ని కలిగించింది. ప్రపంచంలో మానవులు మాట్లాడే అన్ని భాషలూ ఈ తీరుగానే రూపొందాయి.

సమాజం ఎంత ప్రాచీనం అయితే అన్ని ఎక్కువ భాషలు ఉండేవి. కొత్త రాతి యుగం రాక ముందు ఎన్ని భాషలు ఉండేవో లెక్క కట్టలేం. ఉదాహరణకు- పపువా లో 20 లక్షలమంది ప్రాచీన కాలపు తెగలకు చెందిన ప్రజలు ఉన్నారు. వారందరూ మొత్తంగా మాట్లాడే భాషల సంఖ్య 750. ఇవి సుమారు 60 భాషా కుటుంబాలకు చెందినవి. మన రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లాలో సుమారు 5 లక్షల మంది గిరిజనులున్నారు. వీరు మాట్లాడే భాషలు సుమారు 30 ఉన్నాయి.

సమాజంలో ఉత్పత్తి స్థాయి పెరుగుతున్నకొద్దీ మానవ సమూహాల మధ్య సంబంధాలు పెరుగుతాయి. వ్యాపార సంబంధాలు విస్తరిస్తాయి. అంతకంతకూ మరింత విస్తారమైన ప్రాంతం ఒక్కో రాజ్యం గా ఏర్పడుతూ వుంటుంది. ఒక రాజ్యం అంతటా ఒకే భాషను ఉపయోగించడం జరుగుతుంది. తక్కువమంది మాట్లాడే భాషలు క్రమంగా అదృశ్యమౌతాయి. ఇతర ప్రాంతాలనుండి వలస వచ్చిన ప్రజానీకం ఆ సమాజంలో గనుక పైచేయి సాధిస్తే వారి భాషే నిలదొక్కుకుంటుంది. పాలక వర్గాలు తాము ఉపయోగించే భాషనే ప్రజలంతా ఉపయోగించాలని బలవంతంగా తమ భాషను రుద్దుతాయి. ఈ క్రమంలో మానవులు ఉపయోగించిన భాషల్లో చాలా మేరకు అంతరించిపోయాయి.

సజీవంగా కొనసాగుతున్న భాషలు కూడా నిరంతరం మార్పులకు లోనవుతూ ఉంటాయి. మన తెలుగు భాషను చూస్తే ఒక్కో శతాబ్దం గడుస్తున్న కొద్దీ అది వేగంగా మారిపోయింది. ఇతర భాషలతో ఏర్పడిన సంపర్కం వలన కొన్ని కొత్త పదాలను స్వీకరిస్తే, ఉత్పత్తి విధానంలో వచ్చిన మార్పులు కొన్ని కొత్త పదాలను భాషకు అదనంగా చేర్చుతాయి. అదే సమయంలో కొన్ని పదాలు వాడకంలోంచి అదృశ్యం అయిపోతూ వుంటాయి. ఐతే ఒక భాష తన మూలాలను కూడా కొనసాగిస్తూవుంటుంది. మన తెలుగు భాషలో ఉన్న మాండలికాలు దీనికి ఒక ఉదాహరణ. ఇటువంటి మూలాలను బట్టి ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న భాష పుట్టుక ఎక్కడినుంచి జరిగిందో, అదెలా మారుతూ వచ్చిందో, ఏయే ఇతర భాషలతో సంపర్కం పెట్టుకుందో ఆ చరిత్రనంతా చెప్పవచ్చు.

ఇలా ఒక భాష యొక్క చరిత్రను అధ్యయనం చేయడాన్ని ఫిలాలజీ అంటారు. పురాతన కాలంనుండీ ఉపయోగిస్తూవున్న నాగలి, గుడిశ, తల్లి, తండ్రి, గుర్రం, ఆవు, దేవుడు, దెయ్యం వంటి పదాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. ఈ పదాలను ఇదే అర్థంలో ఉపయోగించే ఇతర భాషలు కూడా ఉంటాయి. అంటే ప్రస్తుతం వేర్వేరు భాషలుగా ఉన్నప్పటికీ, ఒకప్పుడు ఈ ప్రజలు కలిసిజీవించేవుండాలి, కాలక్రమంలో వేర్వేరు భాషలుగా విడిపోయివుండాలి. ఇలా పరస్పర సంబంధాలను, తేడాలను గుర్తించడం, అవెలా వచ్చాయో పరిశీలించడం, ఆ క్రమంలో ఒకానొక భాష చరిత్రను రూపొందించడం ఫిలాలజిస్టులు చేస్తారు. ఇది చరిత్ర అధ్యయనంలో ఒక ముఖ్యభాగం అయిపోయింది. ఉదాహరణకు గుర్రాన్ని సంస్కృతంలో అశ్వం అంటారు. అదే అవేస్త భాషలో అస్పం అంటారు. దీనిని బట్టి అవేస్త, సంస్కృతం భాషలు రెండింటికీ ఒక ఉమ్మడి మూల భాష ఉండిఉండాలి అని నిర్ధారించవచ్చు. ఇలా పదాల చరిత్రను అధ్యయనం చేయడాన్ని ఎటిమాలజీ అంటారు. ఉమ్మడిగా ఉన్న పదాలలో ఇతర భాషలనుండి ఎరువు తెచ్చుకున్నవి కూడా ఉంటాయి.

అందుచేత ఒక భాషకు మూల



epaper.prajasakti.com

పదాలేమిటో, ఎరువు తెచ్చుకున్న పదాలేమిటో విడదీయగలగాలి. ఒక భాష చరిత్రను ఇలా చారిత్రిక క్రమంలో విశ్లేషించడాన్ని గ్లోటోక్రోనాలజీ పద్ధతి అంటారు. దాని ప్రకారం సంస్కృతానికి, లాటిన్ భాషకు. పర్షియన్ భాషకు మూలం అయిన ప్రోటో ఇండో యూరపియన్ భాష నేటికి 7000 సంవత్సరాలక్రితం నాటిదని, సంస్కృతం, లాటిన్ భాషలు నేటికి 5300 సంవత్సరాల క్రితం విడిపోయాయని నిర్ధారించారు.

**" ఇదంతా మనం ఎందుకు తెలుసుకోవాలంటే ప్రస్తుతం మన పాలకులు ప్రపంచంలో అన్ని భాషలకూ మూలం సంస్కృతమేనని, మన దేశంలోని అన్ని భాషలూ సంస్కృతం నుండే పుట్టాయని ప్రకటించేసి అందరిమీదా సంస్కృత భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. చరిత్రను వారు ఎంతగా వక్రీకరిస్తున్నారో పైన తెలిపిన వివరాలను బట్టి మనకు అర్థం ఔతుంది. "**

ఇదంతా మనం ఎందుకు తెలుసుకోవాలంటే ప్రస్తుతం మన పాలకులు ప్రపంచంలో అన్ని భాషలకూ మూలం సంస్కృతమేనని, మన దేశంలోని అన్ని భాషలూ సంస్కృతం నుండే పుట్టాయని ప్రకటించేసి అందరిమీదా సంస్కృత భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. చరిత్రను వారు ఎంతగా వక్రీకరిస్తున్నారో పైన తెలిపిన వివరాలను బట్టి మనకు అర్థం ఔతుంది.

ప్రస్తుతం మన దేశంలో భారత రాజ్యాంగం గుర్తించిన 22 భాషలే గాక ఇంకా చాలా భాషలున్నాయి. మన దేశంలో చిన్న, పెద్ద జన సమూహాలు మాట్లాడే భాషలను ప్రధానంగా నాలుగు భాషా కుటుంబాలుగా వర్గీకరించారు ఆధునిక చరిత్రకారులు.

అవి-1సైనో- టిబెటన్ --టిబెటో-బర్మీస్ శాఖ 2. ఆస్ట్రో-ఏషియాటిక్ --ముండా మరియు మన్-ఖ్మేర్ శాఖలు 3. ద్రవిడియన్ --దక్షిణ, మధ్య, దక్షిణమధ్య, ఉత్తర శాఖలు 4. ఇండో-యూరపియన్ --ఇండో-ఆర్యన్ లేదా ఇండిక్, దార్డిక్, ఇరానిక్, నురిస్తానీ శాఖలు

సైనో టిబెటన్ కుటుంబానికి చెందిన టిబెటో-బర్మీస్ శాఖ కు సంబంధించిన భాషలను మాట్లాడేవారు ప్రధానంగా ఈశాన్య భారత దేశంలో ఉంటారు. ఇక్కడే గాక ఈ భాషలను టిబెట్ ప్రాంతానికి చెందిన చైనాలో, భూటాన్‌లో, మయన్మార్ (బర్మా) లో కూడా మాట్లాడతారు. ఒక్క పశ్చిమ మేఘాలయ లో మాత్రం గారో అనే భాష మాట్లాడతారు. ఇది ఇండో-ఆర్యన్ కుటుంబానికి చెందిన భాష. బహుశా ఈశాన్య ప్రాంతంలోకి ఈ భాష మాట్లాడేవారు టిబెటో-బర్మీస్ భాషలను మాట్లాడేవారికన్నా కొంత ఆలస్యంగా వలస వచ్చి వుండవచ్చు.

ఆస్ట్రో-ఏషియాటిక్ కుటుంబానికి చెందిన ముండా, మన్-ఖ్మేర్ శాఖల భాషలను బీహార్, ఒడిశా, జార్ఖండ్, ఉత్తరాంధ్ర, మహా రాష్ట్ర-మధ్యప్రదేశ్ పశ్చిమ సరిహద్దు ప్రాంతాల్లో మాట్లాడతారు. ముండారి, సంతాలి, సవర భాషలు ఈ కుటుంబానికి చెందినవి. ఇక మన్-ఖ్మేర్ శాఖకు చెందిన భాషలు మాట్లాడేవారు తూర్పు మేఘాలయ (ఖాసీ) నుంచీ దిగువకు ఉన్నారు. ఐతే ఈ మన్-ఖ్మేర్ శాఖల భాషలు ఆగ్నేయ ఆసియా దేశాలనుండి వన దేశానికి వ్యాపించాయని చెప్పాలి. ఈ తరహా భాషలు వియత్నాం, మయన్మార్, కాంబోడియా, థాయ్‌లాండ్ దేశాలలో ఎక్కువగా మాట్లాడతారు. బహుశా వరి పంట పండించడం తెలిసిన ప్రజాసమూహాలు అందుకనుకూలంగా ఉండే భూములను వెతుక్కుంటూ అటువైపునుండి ఇక్కడికి వచ్చి స్థానికులతో కలిసిపోయివుండాలి. వారివద్ద నున్న వరిసాగు పరిజ్ఞానం స్వీకరించే క్రమంలో వారి భాషలను కూడా స్థానికులు స్వీకరించి వుండాలి. ఈ క్రమం క్రీ.పూ. 5000 సంవత్సరాలనాడు మొదలై, తూర్పు, మధ్య భారతంలోకి వారు వచ్చి ఇక్కడి స్థానికులతో కలిసిపోయేనాటికి క్రీ.పూ. 3000 అయివుం టుందని కొలిన్ రెన్‌ఫ్ర్యూ వంటి చరిత్ర పరిశోధకులు భావిస్తున్నారు.

ఇండో-ఆర్యన్ భాషల సమూహం తర్వాత అతి ఎక్కువ సంఖ్యలో మన దేశంలో మాట్లాడే భాషలు ద్రవిడ కుటుంబానికి చెందినవి. తమిళ, మలయాళ, కన్నడ భాషలు దక్షిణాది ప్రాంతానికి చెందినవైతే, తెలుగు, గోండి (మధ్యప్రదేశ్) భాషలు దక్షిణ మధ్య భారత దేశంలోను, కొలామి (మహారాష్ట్ర), కురుఖ్ (జార్ఖండ్, చత్తిస్‌ఘర్, నేపాల్) భాషలు మధ్య భారత్ లోను, బ్రహుయి (బలూచిస్థాన్) ఉత్తర ప్రాంతంలోను మాట్లాడుతున్నారు. ఈ ప్రధాన భాషలకు తోడు ఉపశాఖలు ఇంకా చాలా చిన్న చిన్న భాషలుగా కొనసాగుతు న్నాయి. ద్రవిడ భాషలు కేవలం దక్షిణాదికే చెందినవి అని భావించడం తప్పు అని ఈ వివరాలను బట్టి గ్రహించవచ్చు.

ఎక్కువ సంఖ్యలో ఉన్న ఈ ద్రవిడ భాషలకు మూలం అయిన ప్రోటో ద్రవిడభాష కు ప్రత్యేక లక్షణాలేమిటన్నది నిర్ధారించడానికి ఈ భాషలన్నింటిలోనూ ఉమ్మడిగా ఉండే ళ, ఱ,ణ వంటి అక్షరాలతో పలికే మాటలను కొలబద్దగా తీసుకున్నారు. నాలుకను పైకి మడతపెట్టి పై అంగుటితో ఆ నాలుకను స్పృశించితేగాని ఈ అక్షరాలను ఉచ్చరించలేము. వీటిని తాళవ్యములు అని అంటారు. ఇటువంటి అక్షరాలతో కూడిన పదాలు ఆస్ట్రో- ఏషియాటిక్ కుటుంబంలో గాని, ఇండో-ఆర్యన్ కుటుంబంలో గాని లేవు. మన దేశంలో వాడే ద్రవిడేతర భాషలు ఆ తర్వాత కాలక్రమంలో ద్రవిడ భాషనుంచి ఈ తరహా పదాలను స్వీకరించివుండాలి. ఋగ్వేదంలో ఇటువంటి తాళవ్యములు కొన్ని ఉన్నాయి . దానితోబాటే వచ్చిన అవేస్త లో ఈ తాళవ్యములు లేవు. అంటే ఋగ్వేద కాల ప్రజలు భారత ఉపఖండంలోకి వచ్చిన తర్వాత ద్రవిడ భాషలనుండి వీటిని స్వీకరించివుండాలి. బెలూచిస్థాన్ లో ఇప్పటికీ ద్రవిడ భాషాకుటుం బానికి చెందిన బ్రహుయి భాషను మాట్లాడే వారున్నారు. ఈ ప్రాంతం పంజాబ్ కు దగ్గరలో ఉంటుంది. అందుచేత పంజాబీ భాషలో కూడా కొన్ని ద్రవిడ మూలాలు కలిసిపోయి వుండాలి. ద్రవిడ భాషల శాఖలు తూర్పు యూరప్ లోని ఊరల్ పర్వత ప్రాంతాలకు, సైబీరియా వరకు విస్తరించాయి.

మనం ఇంతకు ముందు వ్యాసాలలో సింధు లిపి గురించి చర్చించుకున్నప్పుడు ఆ ప్రజలు వాడిన భాషకు ద్రవిడ భాషలతో దగ్గర సంబంధం ఉండివుండొచ్చన్న విషయాన్ని కూడా ప్రస్తావించుకున్నాం. రాగి లోహం వాడకంతోపాటు, వ్యవసాయ విస్తరణ తోబాటు ద్రవిడ భాష విస్తరించి క్రూ.పూ. 2000 నాటికి దక్షిణాది లో ఉండే అసంఖ్యాకమైన స్థానిక, సంచార జాతుల భాషలతో సంపర్కం చెందివుండాలని ఒక సిద్ధాంతం ప్రతిపాదన ఉన్నది. ఐతే దీనిని ఔనని గాని, కాదని గాని ఇంకా ఇదమిత్థంగా తేల్చలేదు.

దేశంలో అత్యధికులు మాట్లాడే ఇండో-ఆర్యన్ కుటుంబానికి చెందిన భాషల గురించి వచ్చే సంచికలో ముచ్చటించుకుందాం. ❃



epaper.prajasakti.com

కల్పన వెనుకపట్టు పట్టింది. జనాభా ప్రాతిపదికన తగినన్ని వైద్యశాలలు లేకపోవటం, ఉన్నవాటిలో తగినంత సిబ్బంది లేకపోవటం కనిపించింది. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రతి వెయ్యి మంది ప్రజానీకానికి అందుబాటులో ఉన్న పడకల సంఖ్య కేవలం 0.5. ప్రభుత్వ రంగానికి సమాంతరంగా ప్రైవేటు రంగం దేశమంతా విస్తరించింది. అయితే ప్రభుత్వ వైద్యశాలల యొక్క సేవల అందుబాటు అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉన్నా, కేవలం 42 శాతం మందికి మాత్రమే వైద్యశాలల్లో చికిత్స (ఇన్ పేషెంట్) అందుతోంది. అదే ప్రైవేటు వైద్యశాలలలో (వ్యాపార) 55 శాతం మంది ఇన్‌పేషెంట్స్‌గా సేవలు అందుకుంటున్నారు. అలాగే ప్రైవేటు ఛారిటీ వైద్యశాలలలో ఇది 3 శాతం ఉంది. పట్టణ ప్రాంతాలలో ప్రైవేటు వైద్యశాలలలో ఇన్‌పేషెంట్‌గా సేవలు అందుకుంటున్న వారి శాతం 61గా ఉంటే, ప్రభుత్వ వైద్యశాలలలో కేవలం 35 శాతం మాత్రమే ఈ సేవలు అందుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా సగానికి పైగా (52 శాతం మంది) ప్రైవేటు వైద్యశాలలో ఇన్‌పేషెంట్ సేవలు అందుకుంటున్నారు. కేవలం చికిత్స (అవుట్ పేషెంట్) కోసం మాత్రమే వచ్చే వారిలో 69 శాతం ప్రైవేటు వైద్యశాలలలోనూ, మిగిలిన వారు (31 శాతం) ప్రభుత్వ వైద్యశాలలలో సేవలు పొందుతున్నారు. ఇన్సూరెన్స్ (బీమా) సౌకర్యం అనేది కేవలం ఇన్ పేషెంట్స్‌కే ఎక్కువగా వర్తిస్తుంది కాబట్టి మా చర్చ ఎక్కువ దానిమీదే జరిగింది.

భారతదేశంలోని ఆరోగ్య రంగంలో ప్రైవేటు వైద్యసేవలు గణనీయంగా ముఖ్యపాత్ర పోషిస్తున్నాయనేది అక్షర సత్యం. కాని మన అనుభవంలో గమనిస్తే, ఆరోగ్య సేవల మార్కెట్ తరచూ ఒడిదుడుకులకు లోనవుతూ ఉంటుంది. విస్తృత సేవలు అందిస్తున్నామనే నెపంతో ప్రతి సేవకీ ధరలు నిర్ణయించి, లాభాలను ప్రతి సేవలో చొప్పించే ప్రయత్నం చేయడం ద్వారా ప్రైవేటు వైద్యశాలలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఒకేరకమైన వ్యాధుల చికిత్సలో కూడా ప్రభుత్వరంగం కన్నా చాలా ఎక్కువ మోతాదులో ప్రైవేటు రంగం డబ్బులు వసూలు చేయడం కనిపిస్తుంది. ప్రభుత్వ రంగంలో ఆరోగ్య సేవలు పొందుతున్న (ఇన్ పేషెంట్) వారి ఖర్చు కన్నా, ప్రైవేటు రంగంలో అవే సేవలు పొందుతున్న వారి ఖర్చులు సగటున 4.5 నుండి 5.7 రెట్లు అధికంగా ఉంటున్నాయని తేలింది. ప్రభుత్వ వైద్యశాలలలో వైద్య చికిత్స ఖర్చులు మొత్తం వైద్యానికి అయ్యే ఖర్చులో 74గా శాతంగా ఉంటే, అదే ప్రైవేటు

" ప్రభుత్వ రంగంలో ఆరోగ్య సేవలు పొందుతున్న (ఇన్ పేషెంట్) వారి ఖర్చు కన్నా, ప్రైవేటు రంగంలో అవే సేవలు పొందుతున్న వారి ఖర్చులు సగటున 4.5 నుండి 5.7 రెట్లు అధికంగా ఉంటున్నాయని తేలింది. ప్రభుత్వ వైద్యశాలలలో వైద్య చికిత్స ఖర్చులు మొత్తం వైద్యానికి అయ్యే ఖర్చులో 74గా శాతంగా ఉంటే, అదే ప్రైవేటు రంగంలో 89 నుండి 92 శాతం వరకు ఉంది. "




రంగంలో 89 నుండి 92 శాతం వరకు ఉంది. ఒక వ్యాధి చికిత్సకు సరాసరి ఖర్చు ప్రభుత్వ వైద్యశాలలలో (ఇన్ పేషెంట్) 4,452 రూ॥లుగా ఉంటే, అదే చికిత్స ఛారిటీ వైద్యశాలలలో 24,452 రూ॥లుగా, ప్రైవేటు వైద్యశాలలలో 31,845 రూ॥లుఅవుతోంది. అంటే ప్రభుత్వ రంగం కన్నా ఛారిటీ రంగంలో 5.5 రెట్లు, ప్రైవేటు రంగంలో 7.2 రెట్లు అధికంగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

ఇక వైద్యశాలలలో అయ్యే ఖర్చులను పరిశీలన చేద్దాం. చికిత్స ప్యాకేజిలు అనేవి నేడు ప్రైవేటు వైద్యశాలలలో సర్వసాధారణమయ్యాయి. ఇందులో ముఖ్యమైన వైద్య విధాన పద్ధతులు, (సర్జికల్ మరియు నాన్ సర్జికల్), ఆపరేషన్ థియేటర్ ఛార్జీలు, థియేటర్‌లో కావాల్సిన వినియమ వస్తువులు, మందులు, డాక్టరు ఫీజులు, బెడ్స్ ఛార్జీలు మొదలగునవి. మొత్తం ప్రైవేటు వైద్యశాలలలో అయ్యే ఖర్చులో అత్యధిక శాతం ఈ ప్యాకేజి చికిత్సకు పోగా, మిగిలింది మందులకు, వ్యాధి సంబంధిత పరీక్షలకు అవుతున్నాయి. అదే ప్రభుత్వ వైద్యరంగంలో ఎక్కువ శాతం -67 శాతం- మందులకు, పరీక్షలకు అవుతున్నాయి. మిగతాది చికిత్సకి అవుతున్నది. కన్సల్టేషన్ ఫీజులో ప్రభుత్వ వైద్యంలో కేవలం 4 శాతం ఉంటే, ప్రైవేటు రంగంలో 15 నుండి 18 శాతం ఉంటుంది. బెడ్ ఛార్జీలు మరియు కన్సల్టేషన్ ఫీజులు ప్రైవేటు రంగం చికిత్సలో ఎక్కువ భాగాన్ని ఆక్రమిస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులు చికిత్స అందించే ప్రతి భాగంలో సేవల ధరలు అత్యధికంగా ఉన్నాయి. మందులలో 3.2 రెట్లు, పరీక్షలలో 3.8 రెట్లు కనీసంగా వసూలు చేసే ప్రైవేటు ఆసుపత్రులలో ఎక్కువగా ఉండగా, అత్యంత ఎక్కువగా వసూలు చేసే వాటిలో కన్సల్టేషన్ ఫీజులు 31.8 రెట్లు, బెడ్ ఛార్జీలు 28.9 రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి.

బీమా పథకాల పరిధి మన దేశంలో చాలా తక్కువ. వాడకమూ తక్కువగా ఉంది. చెల్లింపులు తక్కువగా ఉన్నాయి. ప్రైవేటు వైద్యశాలలలో ఇన్ పేషెంట్ వైద్య సేవలలో బీమా చెల్లింపులు కేవలం 6.58 శాతం మాత్రమే. పేద, బడుగు వర్గాల కోసం అందిస్తున్న సామాజిక బీమా పథకాల ద్వారా కేవలం 2.45 శాతం ఇన్ పేషెంట్ సేవలకే ప్రైవేటు వారికి చెల్లింపులు జరుగుతున్నాయి.

భారత ప్రజానీకానికి ఆరోగ్య సేవలందించటంలో ప్రైవేటురంగం పెద్ద ఎత్తున విస్తరిస్తోందని నేషనల్ శాంపిల్ సర్వేలో వెల్లడైంది. ప్రభుత్వ రంగంలో కేవలం 42 శాతం మంది మాత్రమే సేవలు అందుకొంటుండగా, ప్రైవేటు రంగం ప్రధాన పాత్ర పోషిస్తోంది. అలాగే సగటు చికిత్స ఖరీదు కూడా 5 లేక 6 రెట్లు అధికంగా వసూలు చేస్తోంది.

ఆరోగ్య సేవలలో ప్రతి విభాగాన్ని పరిశీలించినా, మందులు, పరీక్షలు అన్నింటిలోనూ ప్రైవేటు వైద్యశాలలు 4 రెట్లు

(మిగతా 28వ పేజీలో)



epaper.prajasakti.com

వైద్యం

# పేదరికాన్ని పెంచుతున్న ప్రయివేటు వైద్యం

ప్రీతమ్ దత్తాని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్& పాలసీ, న్యూఢిల్లీ
చేతన చౌదరి పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా



చేతన చౌదరి

భారతదేశంలో ప్రజలకు వైద్యం అందించటంలో ఎక్కువ శాతం కీలకంగా మారిన ప్రైవేటు రంగం, ప్రజల కుటుంబ ఖర్చులలో సింహభాగంగా అలాగే ప్రభుత్వ ఆరోగ్య కేటాయింపులలో అధిక మొత్తం ఇన్సూరెన్స్ మార్గంలో కేటాయించే విధంగా ఒత్తిడికి గురిచేస్తున్నది. 75వ నేషనల్ శాంపిల్ సర్వే పరిశీలనలో ప్రైవేటు వైద్యశాలలు మరియు ప్రైవేటు ఛారిటబుల్ వైద్యశాలలలో చికిత్స ఖర్చులు, ప్రభుత్వ రంగ వైద్యశాలల కన్నా చాలా ఎక్కువ మోతాదులో ఉన్నాయని తెలిసింది.

వైద్య, ఆరోగ్య రంగంలో ప్రైవేటురంగం కీలక పాత్ర పోషిస్తుందని, పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యం(పిపిపి) పేరుతో జిల్లా కేంద్రాలలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలను, ప్రైవేటు వైద్య కళాశాలలను, వాటికి అనుసంధానం చేస్తామని 2020-21 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. రెండవ మరియు మూడవ శ్రేణి పట్టణాలలో నిర్మించనున్న ఈ వైద్యశాలలు (పిపిపి పద్ధతిలో) ప్రధానమంత్రి జాతీయ ఆరోగ్య యోజన పథకం అమలుకు వినియోగిస్తారు. దీని కోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలను కూడా పక్కన పెట్టేశారు. ఆర్థికరంగంలోనే కాకుండా, ఆరోగ్యరంగంలో కూడా ప్రైవేటు రంగానికి పెద్ద భూమిక ఏర్పాటు చేస్తున్నారు. జి.డి.పిలో అతి తక్కువ శాతం ప్రజల ఆరోగ్యానికి కేటాయిస్తున్న దేశాలలో ఇండియా ఒకటి.

2015-16 నేషనల్ హెల్త్ ఎకౌంట్ రిపోర్టు ప్రకారం మన దేశంలో ఆరోగ్యంపై ఖర్చు చేసే మొత్తం 4.2 నుండి 3.8 శాతానికి తగ్గిపోయింది. ప్రజలు ఆరోగ్యంపై ఖర్చు చేసే మొత్తం దేశంలో ఎప్పుడూ తక్కువగానే ఉంది. (30.6 శాతం). ప్రభుత్వాలు సాలీనా ఒక్కొక్కరికి ఖర్చు పెడుతున్నది 1259 రూ॥లు మాత్రమే. అంటే నెలకు ఒక మనిషికి 105 రూ॥లు, అనగా రోజుకి 3.50 రూ॥లు మాత్రమే. అందువలనే ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడల్లా స్వంతంగా పెద్ద ఎత్తున ఖర్చులు పెట్టుకున్న కోట్లాది కుటుంబాలు పేదరికంలోకి నెట్టివేయబడుతున్నాయి. పరిమితమైన ఆర్థిక వనరులు కలిగి, వనరులకు మించి ఆరోగ్యానికి ఖర్చు చేయడం ద్వారా పేద మరియు బలహీన వర్గాల ప్రజలు మరింత కష్టాలలో కూరుకుపోతున్నారు. 2015లో ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలన్నీ 2030 నాటికి అందరికీ ఆరోగ్యం అందుబాటు అనే అభివృద్ధికర నినాదాన్ని ఒప్పుకొని సంతకాలు చేశాయి. సార్వత్రిక ఆరోగ్య కల్పన విధానం(యూనివర్సల్ హెల్త్ కవరేజి పాలసి) ప్రకారం ఆరోగ్యసేవలు అవసరాలు ఉన్న ప్రతి ఒక్కరికి ఎటువంటి ఆర్థిక ఒత్తిడి లేకుండా సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మన దేశపు 12వ పంచవర్ష ప్రణాళికలో (2012-17) ఈ లక్ష్యాలను పొందుపర్చారు. దీనికి ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ప్రజారోగ్యానికి కేటాయింపులు పెంచేలా ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగానే 2005లో ప్రారంభించిన "నేషనల్ రూరల్ హెల్త్ మిషన్" (NRHM) ఒక కొలమానంగా నిలిచింది. గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటు ధరలలో లభించేలా ప్రయత్నం చేసింది. 2013లో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ఏర్పాటయింది. దీనిని NRHM ఒకే గూటికి తెచ్చి "నేషనల్ హెల్త్ మిషన్" అనే పేరు పెట్టారు. దీని ఉద్దేశం ప్రకారం పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వైద్య, ఆరోగ్య సేవలను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించటం. కాని, క్రమక్రమేణా కేంద్రం మరియు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని విస్మరించి ప్రభత్వ ప్రోత్సాహక ఇన్సూరెన్స్ స్కీమ్‌ల వైపు దారి మళ్ళాయి.

ఆయుష్మాన్ భారత్ (PMJAY) కేంద్ర ప్రభుత్వంచే ప్రారంభించబడిన ఇన్సూరెన్స్ ఆధారిత ఆరోగ్య సేవ. ఈ స్కీమ్ దాదాపు 10 కోట్ల పేద ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. ఒక్కొక్క కుటుంబానికి 5 లక్షల రూ॥ల ఇన్సూరెన్స్ కవరేజి ఆరోగ్యసేవల కొరకు ఉంటుంది. ఏరియా వైద్యశాలలు మరియు జిల్లా వైద్యశాలల రెండవ మరియు తృతీయ శ్రేణి వైద్యశాలల్లో ఈ పాలసీ వర్తిస్తుంది. గత రెండు బడ్జెట్‌లలో ఈ స్కీమ్‌కు ఇచ్చిన ప్రాధాన్యత, రాష్ట్రాలలో అమలవుతున్న NRHM లేదా NURM పథకాలకు ఇవ్వబడలేదు. అంటే వైద్య, ఆరోగ్య సేవల రంగంలో ప్రభుత్వ ఆధారిత సామాజిక రక్షణ పద్ధతి నుండి ఇన్సూరెన్స్ ఆధారిత పద్ధతి వైపు ప్రభుత్వం మరలుతోంది. ప్రభుత్వ రంగంలో బలోపేతమైన, నాణ్యమైన ఆరోగ్య సేవలు లోపించే నేపథ్యంలో ప్రభుత్వ ప్రోత్సాహక ప్రైవేటు సేవల రంగం వృద్ధి చెందటమే కాక, ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి ఆరోగ్య సేవల బడ్జెట్‌లో ఇన్సూరెన్స్ పాలసీల మార్గం ద్వారా ప్రైవేటు వైద్య సేవలకు బడ్జెట్ కేటాయింపులు పెరిగేలా పరిస్థితులు మారిపోయాయి. 2017-18 సంవత్సరానికి జరిగిన నేషనల్ శాంపిల్ సర్వే ఆరోగ్య సేవలు అందించటంలో ప్రైవేటురంగం చేస్తున్న దోపిడీని కళ్ళకు కట్టినట్లుగా చూపించింది.

75వ ఎన్.ఎస్.ఎస్ సర్వేలో (2017-18) ప్రభుత్వ మరియు ప్రైవేటు వైద్యశాలలలో వివిధ రకాల వ్యాధి చికిత్సలలో ఆసుపత్రులలో చేరి వైద్యం పొందిన వారికి చేరకుండా వైద్యం పొందిన వారికి అయిన ఖర్చుల వివరాలు బహిర్గతమయ్యాయి. ఈ దేశ వ్యాప్త సర్వేలో 1,13,822 కుటుంబాలలోని 3,25,883 మంది వ్యక్తులను గ్రామీణ ప్రాంతం నుండి, 2,29,230 మంది వ్యక్తులను పట్టణ ప్రాంతం నుండి సర్వే చేయడం జరిగింది. గ్రామీణ ప్రాంతంలో 8,077, పట్టణ ప్రాంతంలో 6,181 ప్రాంతాలను గంపగుత్తగా ఎంపిక చేసి సర్వే చేయించారు. ఈ సర్వే యొక్క ఉద్దేశం ఏమిటంటే ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలలో కాన్పులు తప్ప ఇతర అన్ని సేవలలో చికిత్స పొందిన వారు పెట్టిన ఖర్చులలో వ్యత్యాసాన్ని గమనించడం.

**ఫలితాలు**


చారిత్రాత్మకంగా ప్రజారోగ్యానికి బడ్జెట్‌లో తగినంత ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించకపోవటం వలన, మౌలిక వసతులు


epaper.prajasakti.com

అంతర్జాతీయం

# కోవిడ్19 కలకలం పెట్టుబడిదారీ కల్లోలం

ఎస్. వెంకట్రావు



రచయిత మార్క్సిస్టు సంపాదకులు

కరోనా అనంతర ప్రపంచం ఎలా ఉండబోతోంది? ఆరుమాసాలుగా ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న కరోఓనా మహమ్మారి ఇంకా అనేక దేశాల్లో రోజురోజూకూ విజృంభిస్తున్నతరుణంలో ఈ ప్రశ్న మరింత ప్రముఖంగా ముందుకొస్తోంది. ఈ మహమ్మారిని శతాబ్దానికి ఒక సారి వచ్చే విలయం అంటున్నారు. గతంలో కలరా, ప్లేగు వంటి అంటు వ్యాధులు ఇదేరకమైన విలయాన్ని సృష్టించాయి. ఆనాడు ప్రపంచం ఇంతగా అనుసంధానమై లేదు. నేడు ప్రపంచీకరణ యుగంలో మహమ్మారి అతి కొద్ది కాలంలోనే ప్రపంచంలోని 200 దేశాలకు విస్తరించింది. ప్రపంచ వ్యాపితంగా 2 కోట్ల మందికి పైగా వ్యాధి సోకింది. సుమారు 8 లక్షల మంది మరణించారు. కోలుకున్న వారు కోలుకోగా ఇంకా 63 లక్షలవ్యాధి గ్రస్తులు (యాక్టివ్ కేసులు) ఉన్నారు. కరోనా కేసులు కొన్ని దేశాల్లో తగ్గుతుంటే మరికొన్ని దేశాల్లో అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతోంది.

కరోనా మహమ్మారి ప్రపంచంలోని అనేక దేశాలను ఆరోగ్య సంక్షోభంలో పడేసింది. ఇప్పటికే సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టేస్తున్నది. రానున్న కాలంలో ఈ సంక్షోభ ప్రభావం ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలనూ, భౌగోళిక రాజకీయాలనూ ఎలాంటి మార్పులకు గురిచేస్తుందన్న చర్చ సర్వేసర్వత్రా సాగుతోంది. వీటి గురించి ఇప్పుడే ఇదమిద్ధంగా చెప్పలేక పోయినప్పటికీ కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కమ్మేసిన ఈ కాలంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే కొన్ని సూచనలను మనం గమనించగలం.

**ఆరోగ్య రంగంలో ప్రత్యామ్నాయం**

ఆగస్టు నెలారంభానికి ప్రపంచ వ్యాపితంగా 1కోటీ 82 లక్షల మంది కరోనా బారిన పడగా అందులో 50 శాతం పైగా కేసులు కేవలం మూడు దేశాల్లోనే నమోదైనాయి. అవి అమెరికా, బ్రెజిల్, ఇండియా. ప్రపంచంలో కరోనా వల్ల మరణించిన వారిలో 42 శాతం మంది ఈ మూడు దేశాల్లోనే ఉన్నారు. కోలుకున్న వారు కోలుకోగా ఇప్పటికీ కరోనాతో బాధపడుతున్న వారిలో (యాక్టివ్ కేసుల్లో) 52 శాతం కూడా ఈ మూడు దేశాల్లోనే కొనసాగుతున్నాయి. రోజుకు లక్షకు పైగా కేసులు ఈ మూడు దేశాలనుండే జమ అవుతున్నాయి. ఆరోగ్య రంగాన్ని పూర్తిగా ప్రయివేటు కార్పొరేట్ శక్తులకు వదిలేయడం, ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి, ప్రయివేటు కార్పొరేట్ రంగం లాభాలను పెంచే పనిలో ప్రభుత్వాలు నిమగ్నమయి ఉండడం ఈ మూడు దేశాల్లో ఒక సామాన్య లక్షణంగా మనకు కనిపిస్తుంది. మూడు దేశాల్లోనూ పచ్చి మితవాద, అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు రాజ్యమేలుతున్నాయి.

ఈ మూడు దేశాలకు రెండు లక్షల కేసులు దాటిన మరో 17 దేశాలను (రష్యా, బ్రిటన్, స్పెయిన్, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్, టర్కీ, దక్షిణాఫ్రికా, చిలీ, మెక్సికో, పెరు, కొలంబియా, అర్జెంటీనా, సౌదీ అరేబియా, ఇరాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లను) జత చేస్తే మొత్తం 20 దేశాల్లో 82 శాతం కరోనా కేసులు, 93 శాతం మరణాలు నమోదయ్యాయి. ప్రపంచంలోని యాక్టివ్ కేసుల్లో 82 శాతం ఈ 20 దేశాల్లోనే ఉన్నాయి. తొలినాళ్లలో కరోనా విలయాన్ని చవిచూసిన ఇటలీ, ఇరాన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు తరువాత కొంతమేరకు కట్టడి చేయగలిగాయి.

పైన చెప్పిన దేశాల్లోని పరిస్థితికి భిన్నమైన దృశ్యం సోషలిస్టు దేశాల్లో మనకు కనిపిస్తుంది. కరోనాను అదుపుచేయడంలో చైనా అనుసరించిన వ్యూహం ప్రపంచ ప్రజల మన్ననలు అందుకుంది. ఈ విషయంలో చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం ప్రజల సహకారంతో కరోనాపై యుద్ధం ప్రకటించి మూడు మాసాల్లో విజయం సాధించాయి. చైనా గడించిన ఆధునిక టెక్నాలజీతో సహా దేశంలోని వనరులన్నిటినీ మహమ్మారిని పారద్రోలడానికి ప్రభుత్వం సమీకరించింది. ‘‘ఒక మహమ్మారిని అరికట్టడానికి ఇంత పెద్ద ఎత్తున, ఇంత నిబద్ధతతో జరిగిన కృషిని నేను ఎన్నడూ చూడలేదు..ఒక అసాధారణ సవాలును ఎదుర్కొనడానికి వారు అసాధారణ చర్యలు తీసుకుంటున్నారు’’ అని ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన ఆరోగ్య అత్యవసర కార్యక్రమాల విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మైఖేల్ ర్యాన్ పేర్కొన్నారు. చైనా తీసుకున్న ఈ అసాధారణ చర్యల ఫలితంగా అక్కడ సుమారు 84 వేల కేసులు, 4600 మరణాల దగ్గర కరోనా వ్యాప్తి దాదాపు కట్టడి చేయబడింది. ఇప్పుడు అక్కడ యాక్టివ్ కేసులు వెయ్యి లోపలే ఉన్నాయి. చైనాతో సరిహద్దులు కల వియత్నాం, లావోస్, ఉత్తర కొరియాలు మహమ్మారిని సమర్థవంతంగా నిలువరించగలిగాయి. చైనా వియత్నాంల మధ్య 1200 కిలోమీటర్లకు పైగా సరిహద్దు ఉంది. వియత్నాంకు చైనా అతిపెద్ద వ్యాపార భాగస్వామి. రెండు దేశాల మధ్య 10,000 కోట్ల డాలర్లకు (7.5 లక్షల కోట్ల రూపాయలకు) పైగా వార్షిక వ్యాపారం జరుగుతుంది. అయినప్పటికీ పొరుగు దేశం నుండి మహమ్మారి వైరస్ తమ దేశంలోకి రాకుండా, వచ్చిన కొద్ది కేసులను సమర్ధంగా అరికట్టడంలో వియత్నాం విజయం సాధించింది. సుమారు పదికోట్ల జనాభా ఉన్న ఆ దేశంలో ప్రభుత్వ చర్యల వల్లకరోనా వ్యాప్తి 841 మందికి మాత్రమే పరిమిత మయింది.13 మంది చనిపోగా 399 మంది కోలుకున్నారు. యాక్టివ్ కేసులు 427 మాత్రమే ఉన్నాయి. చైనాతో సరిహద్దుగల చిన్న దేశం లావోస్‌లో కరోనాతో ఒక్కరు కూడా మృతి చెందకుండా ప్రభుత్వం ప్రజలను కాపాడ గలిగింది. అక్కడ 20 కరోనా కేసులు మాత్రమే నమోదయ్యాయి. ప్రస్తుతం ఒక్క యాక్టివ్ కేసు మాత్రమే ఉంది. చైనా సరిహద్దునే ఉత్తర కొరియా తమ దేశంలోకి ఒక్క కరోనా కేసు కూడా రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. ఇక కరోనా వ్యాప్తిలో అగ్రస్థానంలో ఉన్న అమెరికాకు



epaper.prajasakti.com

90 మైళ్ల దూరంలో ఉన్న మరో సోషలిస్టు దేశం క్యూబాలో 2,953 కేసులు, 88 మరణాలు నమోదు కాగా వారిలో 2451 మంది వ్యాధి నుండి కోలుకున్నారు. ప్రస్తుతం అక్కడ 400 యాక్టివ్ కేసులు మాత్రమే ఉన్నాయి. క్యూబా ప్రభుత్వం కరోనా నుండి తన ప్రజలను రక్షించడమే కాదు వ్యాధిబారిన పడినవారికి సేవచేసేందుకు అనేక దేశాలకు వైద్య బృందాలను పంపి ప్రపంచ వ్యాపితంగా జేజేలందుకున్నది. సోషలిస్టు దేశాల్లోనే కాదు మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఉన్న కేరళ కూడా కరోనాను సమర్ధవంతంగా కట్టడి చేయగలిగింది.

నయా-ఉదారవాదం ఆరోగ్యాన్ని లాభాలు గడించే వ్యాపారంగా చూస్తుంది, సోషలిజం ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వ బాధ్యతగా చూస్తుంది. ఈ రోజు ప్రపంచ వ్యాపితంగా సోషలిస్టు దేశాల్లో కరోనాను కట్టడిచేసి ప్రజల ప్రాణాలను రక్షించగలగడానికి, అమెరికా, భారత్ వంటి దేశాల్లో ప్రజలను కరోనా మహమ్మారికి వదిలిపెట్టడానికీ తేడా అదే. కరోనా నుండి ప్రజలనూ, ఆర్థిక వ్యవస్థలనూ రక్షించుకోవడం ద్వారా చైనా, వియత్నాం వంటి దేశాలు సోషలిజం విశిష్టతను లోకానికి చాటుతున్నాయి. ప్రజారోగ్య రంగంలో ప్రత్యామ్నాయ విధానాల ఆవశ్యకతను చాటి చెబుతున్నాయి.

> **“ నయా-ఉదారవాదం ఆరోగ్యాన్ని లాభాలు గడించే వ్యాపారంగా చూస్తుంది, సోషలిజం ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వ బాధ్యతగా చూస్తుంది. ఈ రోజు ప్రపంచ వ్యాపితంగా సోషలిస్టు దేశాల్లో కరోనాను కట్టడిచేసి ప్రజల ప్రాణాలను రక్షించగలగడానికీ, అమెరికా, భారత్ వంటి దేశాల్లో ప్రజలను కరోనా మహమ్మారికి వదిలిపెట్టడానికీ తేడా అదే. ”**



కరోనా మాస్టర్లు: మోడీ, ట్రంప్, బోల్సెనారో (బ్రెజిల్ అధ్యక్షుడు)

### ఆర్థిక పరిణామాలు

అసలే మాంద్యంతో కొట్టుమిట్టాడు తున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కరోనా మహమ్మారి మరింత సంక్షోభంలోకి నెట్టింది. పారిశ్రామిక ఉత్పత్తి పడిపోయింది. ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలూ మాంద్యం ఎదుర్కొంటున్నాయి. ఈ సంక్షోభం ఇప్పట్లో సమసి పోదనీ, దేశాల ఆర్థిక వ్యవస్థలు తిరిగి పూర్వ స్థితికి రావడానికి నెలలు కాదు సంవత్సరాలు పడుతుందని ఐరోపాలోని అతిపెద్ద పెట్టుబడి సంస్థ అయిన పిఎన్‌బి పరిబాస్ అసెట్ మేనేజ్‌మెంట్ సిఇఓ ఫ్రెడెరిక్ జాన్‌బాన్ పేర్కొన్నారు. ఇప్పుడు ప్రపంచం ఎదుర్కొంటున్నది మాంద్యాలకే మాద్యం (మదర్ ఆర్ రెసెషన్స్) అని ఆయన పేర్కొన్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ తెలిపింది.

సంక్షోభ ప్రభావం అన్ని దేశాలనూ తాకింది. 2020 సంవత్సరంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ -4.5 శాతం కుదించుకు పోతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) జూన్ 24న విడుదల చేసిన సరికొత్త అంచనాల్లో తెలిపింది. గతంలో అనుకున్న దానికన్నా 1.9 శాతం అధికంగా కుదించుకుపోతుందని అది వెల్లడించింది. 2021లో కూడా ఈ పరిస్థితి కొనసాగుతుంది. రెండు సంవత్సరాలు (2020,2021) కలిపి ప్రపంచం 12 లక్షల కోట్ల డాలర్ల (సుమారు 900 లక్షల కోట్ల రూపాయల) సంపద కోల్పోతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. కరోనా మహమ్మారిని అరికట్టేందుకు ప్రపంచ వ్యాపితంగా విధించిన లాకౌట్లు, ఇతర చర్యలవల్ల సంస్థలు ఆర్థిక కార్యకలాపాలు తగ్గించాయి. ఇప్పుడు అన్ని దేశాల్లో వస్తువులకు గిరాకీ తగ్గిపోవడం వల్ల మార్కెట్లు పడిపోయాయి. సరఫారా, గిరాకీ రెండూ తగ్గిపోవడం వల్ల భవిష్యత్తు పెట్టుబడులు కూడా తగ్గిపోతాయి. 2020 మొదటి త్రైమాసికంలోనే ప్రపంచ వ్యాపితంగా 13 కోట్ల ఉద్యోగాలకు సమానమైన పని గంటలు నష్టపోయినట్లు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) అంచనా వేసింది. రెండవ త్రైమాసికంలో ఈ నష్టం మరింత పెరిగి 30 కోట్ల ఉద్యోగాలు పోతాయని పేర్కొంది.

భూగోళం మీద అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి వెనక్కు మళ్లడం ఇదే ప్రథమం అని ఐఎంఎఫ్ పేర్కొంది. అభివృద్ధి చెందిన దేశాల్లో జిడిపి 2020లో -8 శాతం కుదించుకుపోతుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ -8 శాతం, జపాన్ -5.8, బ్రిటన్ -10.2, జర్మనీ -7.8, ఫ్రాన్స్ -12.5, ఇటలీ, స్పెయిన్‌లు -12.8 శాతం చొప్పున ప్రతికూల అభివృద్ధిని నమోదు చేస్తాయని ఐఎంఎఫ్ అంచనావేసింది. కరోనా మళ్లీ సరికొత్తగా వ్యాపించకపోతే 2021లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 4.8 శాతం అభివృద్ధి చెందుతుందనీ, అయినప్పటికీ 2019తో పోలిస్తే ప్రపంచ జిడిపి 4 శాతం తక్కువగానే నమోదవుతుందని వెల్లడించింది.

కొన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థలు 2020 ప్రథమ ఆరుమాసాల్లో కనబరిచిన కుంగుబాటును పరిశీలిస్తే ఐఎంఎఫ్ అంచనాల కంటే ఎక్కువగా జిడిపి దిగజారిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. డెలాయిట్ ఇన్‌సైట్స్ సంస్థ ఆగస్టు 3న విడుదల చేసిన వివరాల ప్రకారం అమెరికా ఆర్థిక వ్యవస్థ 2020 తొలి త్రైమాసికం(జనవరి, ఫిబ్రవరి, మార్చి)లో -5 శాతం పడిపోగా రెండో త్రైమాసికం (ఏప్రిల్, మే,జూన్)లో మరింత భారీగా -32.9 శాతం దిగజారిపోయింది. 27 దేశాల ఐరోపా కూటమిలో మొదటి త్రైమాసికంలో కూడా జిడిపి -12.2 శాతం రెండో త్రైమాసికంలో -39.8 శాతం క్షీణించింది. రెండో త్రైమాసికంలో యూరస్‌లో ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన జర్మనీలో -34.8 శాతం, ఫ్రాన్స్ -44.8 శాతం, ఇటలీలో -41.1 శాతం, స్పెయిన్‌లో -55.9 శాతం చొప్పున జిడిపి క్షీణించింది. యూరప్‌లో 2023 నాటికి గానీ ఆర్థిక వ్యవస్థ సాధారణ స్థితికి రాదని డిలాయిట్ బృందం అంచనా వేసింది.

జపాన్ జిడిపి తొలి త్రైమాసికంలో -3.4, రెండో త్రైమాసికంలో -6.4 పడిపోయింది. సంక్షోభం నుండి బయటపడడానికి ప్రభుత్వం లక్ష కోట్ల డాలర్ల (సుమారు 75 లక్షల కోట్ల రూపాయల) ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించినప్పటికీ


epaper.prajasakti.com

> **“ఈ మొత్తం ఆర్థిక సంక్షోభంలో ఆశాజనకంగా కనిపిస్తున్నది చైనా, వియత్నాం ఆర్థిక వ్యవస్థలు మాత్రమే. అందులోనూ ప్రపంచంలో అమెరికా తరువాత రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా కోవిడ్ తొలి దెబ్బను కాచుకుని త్వరలోనే కోలుకోవడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు శుభసూచకమని నిపుణులు చెబుతున్నారు.”**

జపాన్ ఆర్థిక వ్యవస్థ 2020 రెండో త్రైమాసికంలో -22 క్షీణిస్తుందని అంచనా వేస్తున్నారు.

భారత దేశ ఆర్థిక వ్యవస్థను కూడా కరోనా తీవ్రంగా తాకింది. కరోనా కేసుల్లో భారత్ మూడో స్థానంలో నిలవగా, రోజువారీ కేసుల్లో అగ్రస్థానాన్ని ఆక్రమిస్తోంది. కరోనా కట్టడిలోనూ, ఆర్థిక వ్యవస్థను కాపాడ్డంలోనూ మోడీ ప్రభుత్వం అత్యంత ఘోరంగా విఫలమైంది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 4.2 శాతం అభివృద్ధి నమోదు చేసింది. ఈ ఏడాది (2020-21) -3.2 నుండి -9.5 శాతం వరకు జిడిపి క్షీణించవచ్చునని వివిధ ఆర్థిక సంస్థలు అంచనా వేస్తున్నాయి.

ఈ మొత్తం ఆర్థిక సంక్షోభంలో ఆశాజనకంగా కనిపిస్తున్నది చైనా, వియత్నాం ఆర్థిక వ్యవస్థలు మాత్రమే. అందులోనూ ప్రపంచంలో అమెరికా తరువాత రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా కోవిడ్ తొలి దెబ్బను కాచుకుని త్వరలోనే కోలుకోవడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు శుభసూచకమని నిపుణులు చెబుతున్నారు. చైనా ఆర్థిక వ్యవస్థ 2019లో 6.1 శాతం అభివృద్ధి చెందింది. 2020లో కూడా జిడిపి 6 శాతం పెరుగుతుందనీ, 2021లో చైనా కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల పండగ నాటికి నిర్దేశించిన లక్ష్యాలు చేరుతుందనీ చైనా వేసిన అంచనాలను తల్ల కిందులు చేస్తూ 2020 తొలి త్రైమాసికంలో జిడిపి -6.8 శాతం క్షీణించింది. 1976 తరువాత చైనా ఆర్థికాభివృద్ధి ప్రతికూలంగా మారడం ఇదే ప్రథమం. ఈ మూడు మాసాలు చైనా కరోనాతో తీవ్రంగా పోరాడింది. కానీ త్వరలోనే మహమ్మారినిసమర్థవంతంగా ఎదుర్కోవడం ద్వారా రెండవ త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో తిరిగి 3.2 శాతం పుంజుకుంది. దాంతో ప్రపంచమంతా మాంద్యంలోకి జారుకుంటే చైనా దాన్నుండి తప్పుకుంది. “అమెరికాతో సహా దాదాపు అన్ని దేశాలూ లాక్‌డౌన్ కష్టాలు పడుతుంటే ప్రపంచ రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా కరోనానుండి కోలుకున్న మొట్టమొదటి దేశంగా రికార్డు సాధించింది” అని నిపుణులు పేర్కొన్నట్లు పిటిఐ వార్తా సంస్థ నివేదించింది. “చైనా ఆర్థిక వ్యవస్థ క్రమంగా పుంజుకుంటోందని ఈ అంకెలు తెలుపుతున్నాయి. అయినా వ్యాధి ప్రపంచ వ్యాపితంగా విస్తరిస్తున్నందున బయటి నుండి రిస్కులు, సవాళ్లు ఎదురవుతూనే ఉంటాయి” అని చైనా జాతీయ గణాంక బ్యూరో ప్రతినిధి లియు అయిహువా పేర్కొన్నారు. 2008 ఆర్థిక సంక్షోభం మాదిరిగానే ఇప్పుడు కూడా కరోనా మహమ్మారి నుండి చైనా త్వరగా కోలుకోవడం, రెండో త్రైమాసికంలో అంచనాలకు మించి అభివృద్ధి సాధించడం వల్ల అది ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ఇంజన్‌లా పనిచేయగలదని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. నిజానికి చైనా రెండవ త్రైమాసికంలో ఇంత అభివృద్ధి సాధిస్తుందని ఎవరూ అంచనా వేయలేదు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో చైనా 1 శాతం అభివృద్ధి సాధిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేయగా, పెరుగుదల 2 నుండి 2,5 శాతం వరకు ఉంటుందని ప్రపంచ బ్యాంకు, ఇతర సంస్థలు అంచనా కట్టాయి. “చైనా ఆర్థికాభివృద్ధి మేము జూన్‌లో విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక అంచనాల నివేదికలో పేర్కొన్న దానికన్నా ఎక్కువగా ఉంది. అందువల్ల మేమే దానికనుగుణంగామా అంచాలను కూడా పెంచాం”అని ప్రపంచ బ్యాంకు చైనా విభాగం అధికారి మార్టిన్ రైజర్ చెప్పారు.

చైనా పుంజుకోవడం వల్ల ఆసియా-ఐరోపాల మధ్య ఆర్థిక, వాణిజ్య వారధిని నిర్మించే బెల్ట్ అండ్ రోడ్ (బిఆర్) ప్రాజెక్టుకు ఊతం వస్తుంది. ఈ ప్రాజెక్టు గురించి అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మీడియా ఎంతగా దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ అది ముందుకు పోతూనే ఉంది, అందులోకి కొత్త సభ్యులు వచ్చి చేరుతూనే ఉన్నారు. చైనాకూ ఈ ప్రాజెక్టులోని సభ్య దేశాలకూ మధ్య 6.5 లక్షల కోట్ల డాలర్ల (సుమారు 487 లక్షల కోట్ల రూపాయల) వ్యాపారం జరుగుతోంది. 2020 తొలి నాలుగు మాసాల్లో ఈ వ్యాపారం 3 శాతం పెరిగింది. టర్కీ, నైజీరియా కొత్తగా ఈ ప్రాజెక్టులో వచ్చి చేరాయి. చైనాలోని కున్‌మింగ్ నుండి లావోస్ వరకు నిర్మిస్తున్న రహదారి ప్రాజెక్టు, ఇతర ప్రాజెక్టులు వేగంగా నడుస్తున్నాయి. రానున్న కాలంలో అమెరికా కూటమిలోని ఇతర దేశాలు కూడా ప్రాజెక్టులో చేరే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఆర్థిక పరిణామంలో చిన్నదే అయినప్పటికీ కోవిడ్ సమర్థవంతంగా కట్టడి చేసి, ఆర్థికంగా పుంజుకున్న దేశం సోషలిస్టు వియత్నాం. 2020 తొలి ఆరుమాసాల కాలంలో ఈ దేశ జిడిపి 1.81 శాతం పెరిగింది. ఇది గతంలో వేసిన అంచనాలకన్నా చాలా ఎక్కువనీ, వచ్చే సంవత్సరం ఈ దేశం 7 శాతం పైనే అభివృద్ధి సాధిస్తుందని ప్రపంచ బ్యాంకు మే నెలలో విడుదల చేసిన నివేదికలో తెలిపింది. గత ఏడాది 7.1 శాతం అభివృద్ధి సాధించిన వియత్నాం జిడిపి వృద్ధి ఈ ఏడాది మొత్తంగా చూస్తే 4 నుండి 5 శాతానికి తగ్గ వచ్చునని ఆ దేశ ప్రధాన మంత్రి గుయెన్ సువాన్ ఫుక్ చెప్పారు. అయినా నేటి ప్రపంచ పరిస్థితుల్లో ఇది చాలా ఎక్కువేనని భావిస్తున్నారు. దశాబ్దాల పాటు అమెరికా సైనిక దాడులనూ, విధ్వంసాన్ని ఎదుర్కొన్న వియత్నాం ఇటీవలి కాలంలో ఆర్థికంగా శరవేగంగా దూసుకుపోతూ కింది మధ్యతరగతి ఆదాయ దేశం స్థాయికి ఎదిగింది. 4.5 కోట్ల మంది ప్రజలను పేదరికం నుండి బయటపడేసింది.

**పెరుగుతున్న పోరాటాలు**

కరోనాకు ముందు ప్రపంచ మంతటా పెరుగుతూ వచ్చిన కార్మిక, ప్రజా పోరాటాలు కరోనా కాలంలో కొంత మందగించాయి. అంటువ్యాధి భయం, ప్రజల మధ్య దూరం, ప్రభుత్వాల ఆంక్షలు దీనికి కారణం. అయితే క్రమంగా పోరాటాలు ఊపందుకోవడం ప్రారంభించాయి. అమెరికాలో నల్లజాతిపై వవక్షకు, మానవ హక్కుల అణచివేతకు వ్యతిరేకంగా అన్ని నగరాల్లో ఇటీవల చెలరేగిన ఆందోళనలు నేటికీ కనసాగుతున్నాయి. ముఖ్యంగా కరోనా కల్లోలం మధ్యలో కార్మికులు, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి లాభాల కోసం ఫ్యాక్టరీలు, సంస్థలు తెరవడానికి వ్యతిరేకంగా అమెరికాతో సహా అనేక దేశాల్లో శ్రామిక ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తునానరు. కరోనా మహమ్మారిని సాకుగా చూపించి పెట్టుబడిదారీ దేశాలన్నింటా ప్రయివేటీకరణ ముమ్మరమైంది. లే ఆఫ్‌లు,


epaper.prajasakti.com

తొలగింపు, వేతనాల కోతలు, పనిగంటల పెంపు ప్రయత్నాలు పెరిగాయి. వీటికి వ్యతిరేకంగా యూరప్‌, అమెరికాతో సహా అనేక దేశాల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి.

### భౌగోళిక రాజకీయ పరిణామాలు

కరోనా మహమ్మారికి ముందు నుండే ప్రపంచంపై అమెరికా ఆధిపత్యం క్రమంగా కోల్పోతూ వస్తోంది. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో ఎదుగుతున్న చైనా నుండీ, రష్యా, యూరోపియన్‌ యూనియన్‌, ఇతర ఎదుగుతున్న దేశాల నుండీ దాని ఆధిపత్యానికి అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్‌లో డాలరు తీవ్రమైన అస్థిరత్వానికి లోనవుతోంది. ఫెచ్‌ రేటింగ్‌ కంపెనీ అమెరికా రుణపరపతిని 'స్థిరమైన' స్థితి నుండి 'ప్రతికూల' స్థితికి మార్చడం అమెరికా ఆర్థిక అస్థిరతను తెలియజేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చి పడిన కరోనా మహమ్మారిని కట్టడి చేయడంలో ఘోరంగా విఫలమైన ట్రంప్‌ సర్కారు కరోనా అనంతర ప్రపంచంలో అమెరికా ఆధిపత్యం మరింత దెబ్బతింటుందన్న భయంతో చైనా వ్యతిరేకతను రెచ్చగొడుతోంది. ఒబామా ప్రభుత్వం ప్రారంభించిన 'చైనాను నిలువరించే' (చైనా పైవోట్‌) విధానాన్ని ట్రంప్‌ మరింత దుందుడుకుగా, బాధ్యతా రహితంగా ముందుకు తీసుకుపోతున్నారు. అసలే కరోనా వైరస్‌తో కుంగిపోతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ట్రంప్‌ సర్కార్‌ అనుసరిస్తున్న విధానాలు మరింత హాని కలిగిస్తాయని ఆర్థిక నిపుణులు భయపడుతున్నారు.

ఆర్థికంగా చైనాను దెబ్బతీయడం, సాంకేతికంగా ఎదగకుండా నిలువరించడం, సైనికంగా చుట్టుముట్టడం, చైనా వ్యతిరేక శక్తులను కూడగట్టడం అనే వ్యూహం ద్వారా అమెరికా మరో సారి ప్రపంచం మీద ప్రఛ్ఛన్న యుద్ధాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తోంది. ఇటీవలి కాలంలో ట్రంప్‌ సర్కారు తీసుకుంటున్న నిర్ణయాలన్నీ ఈ దిశగానే సాగుతున్నాయి. ప్రఛ్ఛన్న యుద్ధ కాలంలో సోవియట్‌పైనా, సోవియట్‌ కమ్యూనిస్టు పార్టీ పైనా దాడికి దిగినట్లే నేడు చైనాపైనా, చైనా కమ్యూనిస్టు పార్టీ పైనా అమెరికా దాడి ముమ్మరం చేసింది. ప్రఛ్ఛన్న యుద్ధ కాలంలో సోవియట్‌ యూనియన్‌కు వ్యతిరేకంగా ఉపయోగించిన 'కమ్యూనిస్టు నియంతృత్వం', 'మానవ హక్కులు' వగైరా భాషనే అమెరికా నేడు చైనాకు వ్యతిరేకంగా ఉపయోగిస్తోంది. జులై 23న అమెరికా విదేశాంగ మంత్రి మైక్‌ పాంపియో

> "కరోనా మహమ్మారిని కట్టడి చేయడంలో ఘోరంగా విఫలమైన ట్రంప్‌ సర్కారు కరోనా అనంతర ప్రపంచంలో అమెరికా ఆధిపత్యం మరింత దెబ్బతింటుందన్న భయంతో చైనా వ్యతిరేకతను రెచ్చగొడుతోంది. ఒబామా ప్రభుత్వం ప్రారంభించిన 'చైనాను నిలువరించే' (చైనా పైవోట్‌) విధానాన్ని ట్రంప్‌ మరింత దుందుడుకుగా, బాధ్యతా రహితంగా ముందుకు తీసుకుపోతున్నారు."




అమెరికాలో వర్ణవివక్ష వ్యతిరేక ప్రదర్శన

"కమ్యూనిస్టు చైనా, స్వేచ్ఛా ప్రపంచపు భవిష్యత్తు" అనే అంశంపై చేసిన ప్రసంగం ఖచ్చితంగా అమెరికా విదేశాంగ విధానంలోని మార్పును సూచిస్తోంది. పూర్తిగా కమ్యూనిస్టు వ్యతిరేక విషంతో నిండిన ఈ ప్రసంగంలో ఆయన రానున్న కాలంలో చైనాకు వ్యతిరేకంగా అమెరికా తీసుకోబోతున్న చర్యలను గురించి పేర్కొన్నాడు. "21వ శతాబ్దం మనదిగానే ఉండాలంటే, అధ్యక్షుడు సి జిన్‌పింగ్‌ కలలు కన్నట్లు చైనా శతాబ్దంగా మారకుండా ఉండాలంటే" మనం "కొత్త నియంతృత్వం మీద స్వేచ్ఛా ప్రపంచం విజయం సాధించే విధంగా" మన వ్యూహాన్ని మార్చుకోవాలి అని పాంపియో ప్రకటించారు. కాలిఫోర్నియాలోని రిచర్డ్‌ నిక్సన్‌ నివాసం (ప్రస్తుతం లైబ్రరీ)లో ఆయన ఈ ప్రసంగం చేయడం గమనార్హం. నిక్సన్‌ రాయభారం వల్ల 1979లో అమెరికా, చైనాల మధ్య అధికారిక సంబంధాలు ఏర్పడ్డాయి. గతంలో సోవియట్‌ యూనియన్‌లో చేసినట్లే చైనాలో కూడా జోక్యం చేసుకుని కమ్యూనిస్టు పార్టీని అధికారం నుండి దించడమే లక్ష్యంగా అమెరికా ఇకపై ముందుకు సాగుతుందనీ, దీని కోసం ప్రపంచంలోని ఇతర దేశాలను కూడగడుతుందని పాంపియో పరోక్షంగా ప్రకటించాడు. "చైనా ప్రభుత్వ చర్యలు మన ప్రజలకూ, సౌభాగ్యానికీ ప్రమాద కరం గనుక మనం మరింత సృజనాత్మకంగా, స్థైర్యంగా చైనాలో మార్పులు తీసుకు రావాలి" అని ఆయన పేర్కొన్నారు. ప్రఛ్ఛన్న యుద్ధ కాలంలో "కమ్యూనిస్టు భూతాన్ని" చూపించి సోషలిజానికి, ప్రజా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు తమతమ దేశాల్లోని ప్రజలను రెచ్చగొట్టిన వైనాన్ని పాంపియో ప్రసంగం గుర్తుకు తెచ్చింది. "కమ్యూనిస్టు చైనాను మార్క్సిస్టు-లెనినిస్టు ప్రభుత్వం పాలిస్తున్నది", "ప్రధాన కార్యదర్శి సి జిపింగ్‌ ఈ దివాళాకోరు, నిరంకుశ సిద్ధాంతాన్ని నిజంగా నమ్మే వ్యక్తి" అని పేర్కొంటూ "స్వేచ్ఛా ప్రపంచం"లోని దేశాలన్నీ కమ్యూనిజానికి వ్యతిరేకంగా ఏకం కావాలని పాంపియో కోరారు. "చైనాలో కమ్యూనిస్టు పార్టీ పాలనను కూల దోయడానికి "మనం లోపలి నుండి (చైనా) ప్రజలతో సంబంధాలను పెట్టుకుని, వారిని సన్నద్ధులను చేయాలి" అని అంటూ "మనం ఒక్కళ్లమే ఈ సవాలును ఎదుర్కోలేము, ఐక్య రాజ్య సమితి, నాటో, జి7, జి20 దేశాల ఆర్థిక, సైనిక, దౌత్య శక్తినంతటినీ జోడించి ధైర్యంగా, స్పష్టంగా ముందుకుపోతే తప్పక ఎదుర్కోగలం" అని పాంపియో పేర్కొన్నారు.

రానున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపును దృష్టిలో పెట్టుకుని అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ ఇటీవల చైనాపై ధ్వజమెత్తుతున్నారని



epaper.prajasakti.com

"ప్రస్తుత పరిస్థితుల్లో చైనాపై దుందుడుకుగా వ్యవహరిస్తున్న అమెరికాను అనుసరించడానికి దాని మిత్రదేశాలు కూడా సిద్ధంగా లేవు. ముఖ్యంగా ఐరోపా యూనియన్‌కు నాయకత్వం వహిస్తున్న జర్మనీకి, అమెరికాకూ మధ్య ఈ విషయంలో స్పష్టమైన విభజన కనిపిస్తోంది. జర్మనీ వాణిజ్యం, పెట్టుబడుల కోసం చైనా మీద పెద్దగా ఆధారపడి ఉంది."

అనేక మంది చెబుతున్నారు. అందులో కొంత నిజమున్నప్పటికీ, అధికారంలో ఎవరు ఉన్నా 'చైనాను నిలువరించడం' అనేది అమెరికా విదేశాంగ విధానానికి కేంద్ర బిందువుగా ఉంటుందన్నది వాస్తవం. కరోనా వైరస్‌ను నిలువరించి ప్రజల ప్రాణాలు, దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడ్డంలో పూర్తిగా విఫలమైన ట్రంప్ ప్రభుత్వం చైనాతో యుద్ధానికి కాలు దువ్వడం ద్వారా దేశ ప్రజల దృష్టి మరల్చడానికి ప్రయత్నిస్తున్నది. హూస్టన్‌లోని చైనా దౌత్య కార్యాలయాన్ని మూసివేయడం, అమెరికాలో చదువుతున్న చైనా శాస్త్రవేత్తను అరెస్టు చేయడం, చైనాను రెచ్చగొట్టేందుకు దక్షిణ చైనా సముద్రంలోకి నౌకా దళాలను పంపడం వంటి చర్యలన్నీ ఇందులో భాగమే.

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏర్పడి తీవ్ర సంక్షోభం, దాన్ని కోవిడ్ మహమ్మారి మరింత తీవ్రతరం గావించడం, తగ్గిపోతున్న తన పలుకుబడిని కాపాడుకోడానికి అమెరికా నిస్పృహతో అనుసరిస్తున్న విదేశాంగ విధానం భౌగోళిక రాజకీయాల్లో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. చైనాకు వ్యతిరేకంగా తాను తీసుకుంటున్న చర్యలకు ఐరోపాలోని మిత్ర దేశాలు, ఇతర దేశాలూ తనకు మద్దతుగా నిలవాలని ట్రంప్ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. తన దారికి రావడానికి ఇష్ట పడని దేశాలను బెదిరిస్తున్నది, డాలరు ఆధిపత్యాన్ని ఉపయోగించుకుని ఆయా దేశాల కార్పొరేట్ కంపెనీలను చైనాకు వ్యతిరేకంగా నిలపడానికి ప్రయత్నిస్తున్నది. చైనా టెలికం సంస్థ హువావీని యూరప్‌లో అడ్డుకోడానికి అది ఈ వ్యూహాన్నే అనుసరించింది.

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో చైనాపై దుందుడుకుగా వ్యవహరిస్తున్న అమెరికాను అనుసరించడానికి దాని మిత్రదేశాలు కూడా సిద్ధంగా లేవు. ముఖ్యంగా ఐరోపా యూనియన్‌కు నాయకత్వం వహిస్తున్న జర్మనీకి, అమెరికాకూ మధ్య ఈ విషయంలో స్పష్టమైన విభజన కనిపిస్తోంది. జర్మనీ వాణిజ్యం, పెట్టుబడుల కోసం చైనా మీద పెద్దగా ఆధారపడి ఉంది. అందువల్ల అది 5జి టెక్నాలజీ విషయంలో చైనాకు చెందిన హువావీ కంపెనీపై నిషేధం విధించాలన్న అమెరికా డిమాండ్‌ను ఆమోదించడానికి వెనుకాడుతోంది. దీనిపై అమెరికా నుండి తీవ్రమైన ఒత్తిడి పెరగడంతో రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ విషయాన్ని చర్చిస్తామని జర్మన్ ఛాన్సలర్ మార్కెల్ ప్రస్తుతానికి తప్పుకున్నారు. అదే విధంగా హాంగ్‌కాంగ్‌లో మానవ హక్కులను చైనా కాలరాస్తున్నదని అమెరికా చేస్తున్న ప్రచారంతో గొంతుకలపడానికి కూడా జర్మనీ సిద్ధం కావడం లేదు. హాంగ్‌కాంగ్‌పై చైనా పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని ఖండించడానికి జర్మనీ నిరాకరించడంతో అమెరికా తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేసింది. కొందరు "హాంగ్‌కాంగ్ విషయంలో ఏమీ మాట్లాడకుండా ఉన్నారు. ఎందుకంటే చైనా మార్కెట్‌లో ప్రభుత్వం ఆటంకాలు కల్పిస్తుందేమోనని భయపడు తున్నారు" అని పాంపియో నిక్సన్ ఇంటివద్ద చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు.

అలాగే అమెరికా బెదిరింపులను లెక్క చేయకుండా ఇటలీ, టర్కీలు చైనా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ (బిఆర్) ప్రాజెక్టులో భాగస్వాములు కావడం ఇటీవలి కాలంలో ప్రాధాన్యత సంతరించుకున్న పరిణామం. అమెరికాతో వ్యూహాత్మక రక్షణ భాగస్వాములుగా ఉన్న జపాన్, ఆస్ట్రేలియాల పరిస్థితి ఉక్కిరి బిక్కిరిగా ఉంది. జపాన్ ఒకవైపు అమెరికాతో కలిసి సైనిక విన్యాసాలు నిర్వహిస్తూనే మరోవైపు తనకు అతి పెద్ద వాణిజ్య భాగస్వామి అయిన చైనాతో సంబంధాలను వదులుకోడానికి సిద్ధపడ్డం లేదు. కరోనా మహమ్మారి వల్ల ఇటీవల చైనా అధ్యక్షుని జపాన్ పర్యటన వాయిదా పడింది. జపాన్ కూడా చైనాతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలని అమెరికా తెస్తున్న ఒత్తిడిని పక్కన పెట్టి చైనా అధ్యక్షుని పర్యటనకు త్వరలోనే షెడ్యూల్ ఖరారు చేస్తామని జపాన్ ప్రకటించింది. తూర్పు చైనా సముద్రంలో జపాన్ ప్రయోజనాల రక్షణకోసం తాను కృషి చేస్తున్నట్లు అమెరికా చెబుతుంటే జపాన్ ఇలా మెత్తగా వ్యవహరించడం అమెరికా అధికార వర్గాలకు రుచించడం లేదు. "జపాన్ ఖచ్చితంగా సంధిగ్దంలో ఉంది. జపాన్ ఒకవైపు చైనాతో పోటీ పడుతూనే మరోవైపు దానికి సహకరిస్తోంది. ఈ రెండు ఆటలూ మేం ఒకే సారి ఆడుతున్నాం" అని జపాన్‌కు చెందిన భద్రత, అంతర్జాతీయ అధ్యయన కార్యక్రమ డైరెక్టర్ నరుషిగె మిచిషితా పేర్కొన్నారు. అమెరికాతో పూర్తిగా ముడి వేసుకున్న ఆస్ట్రేలియా కూడా ఇదే స్థితిలో ఉంది. చైనాతో కయ్యం నేపథ్యంలో జులై 28వ తేదీన వాషింగ్టన్‌లో అమెరికా, ఆస్ట్రేలియా మంత్రిత్వ స్థాయి సంప్రదింపుల (ఎయుఎస్‌ఎంఐఎన్) సమావేశాన్ని అమెరికా జరిపింది. ఈ సమావేశానికి అమెరికా, ఆస్ట్రేలియా రక్షణ, విదేశాంగ శాఖల మంత్రులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. అమెరికాలో కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో ఏర్పాటు చేయబడిన ఈ సమావేశం అసాధారణమైనదని దౌత్యవర్గాలు పేర్కొంటున్నాయి. చైనాతో కయ్యంలో ఆస్ట్రేలియాను తన భాగస్వామిగా ప్రకటించడం అమెరికా ఉద్దేశం. అయితే ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి మేరిస్ పైనె తమ దేశ విధానాన్ని గురించి సంయుక్త ప్రత్రికా గోష్టిలో అమెరికా విదేశాంగ మంత్రి ఎదుటనే కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశారు. ఆమె ఈ విధంగా చెప్పారు: "విదేశాంగ మంత్రి (పాంపియో) చైనాపై చేసిన ప్రసంగాలు ఆయన స్వంతం. ఆస్ట్రేలియా విధానాలు మా స్వంతం. మేమిద్దరం ఉమ్మడి విలువలపై కలిసి పనిచేస్తాం. అయితే మా వైపునుండి మేం చెప్పేదేమంటే, మేం మా స్వంత నిర్ణయాలు తీసుకుంటాం. ఆస్ట్రేలియా జాతీయ ప్రయోజనాల రీత్యా, మా దేశ భద్రత, సౌభాగ్యం, విలువలను దృష్టిలో పెట్టుకుని మా నిర్ణయాలు ఉంటాయి. అందువల్ల ఈ విధంగానే మేం చైనాతో వ్యవహరిస్తాం. మా మధ్య గట్టి ఆర్థిక బంధాలున్నాయి, ఇతర బంధాలున్నాయి. అవి రెండు దేశాల ప్రయోజనాలకు అనుగుణమైనవి. దానర్థం మేం ప్రతిదాన్నీ అంగీకరిస్తామని కాదు. మావి రెండు విభిన్న దేశాలు. రెండు విభిన్న వ్యవస్థలు. అంగీకారం కాని విషయాలపై మేము పరిణతితో, సరైన పద్ధతిలో వ్యవహరించి మా ప్రయోజనాలనూ విలువలనూ ముందుకు తీసుకుపోతాం. మా


epaper.prajasakti.com

ప్రధాన మంత్రి ఇటీవల చెప్పినట్లు చైనాతో మాకు ఉన్న సంబంధాలు ముఖ్యమైనవి. వాటికి మేం హాని చేసుకోదలచుకోలేదు. అదే సమయంలో మా ప్రయోజనాలకు విరుద్ధంగా మేం చర్యలు తీసుకోదలచుకోలేదు.”

అమెరికా ఒత్తిడికి లొంగి 5జి ఒప్పందం నుండి బయటకు వచ్చినా, హాంగ్‌కాంగ్ విషయంలో తీవ్రమైన విబేధాలున్నా చైనాతో ఆర్థిక సంబంధాలు తెంచుకోబోమని బ్రిటన్ విదేశాంగ మంత్రి డొమినిక్ రాబ్ జులై 3వ తేదీన పార్లమెంటులో స్పష్టం చేశారు. అమె ఇలా చెప్పారు: “అధ్యక్షా చైనా విషయంలోనూ, ముఖ్యంగా హాంగ్‌కాంగ్ వ్యవహారంలోనూ సరికొత్త పరిణామాలను మీ అనుమతితో సభ దృష్టికి తీసుకురాదలచుకున్నాను. నేను జులై 1వ తేదీన చెప్పినట్లు చైనాతో బ్రిటన్ సానుకూల సంబంధాలు నెరపదలచుకున్నది. ఇటీవలి దశాబ్దాల్లో చైనా అసాధారణమైన పరిణామం సాధించింది. ప్రపంచలోని అతి పురాతన నాగరికతలమీద వెలసిన చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో రెండవ స్థానానికి ఎదగడమే కాదు శాస్త్ర సాంకేతిక రంగంలో గొప్ప అభివృద్ధి సాధించింది. చైనా తన ప్రజలు కోట్లాది మందిని పేదరికం నుండి విముక్తి చేయడంలో సాధించిన అద్భుతమైన విజయాన్ని యుకె ప్రభుత్వం గుర్తిస్తోంది. పునరుత్పాదక ఇంధన సాంకేతిక శాస్త్రంలో చైనా అతి పెద్ద పెట్టుబడులు పెడుతోంది. అందువల్ల ప్రపంచ వాతావరణ మార్పుల సమస్యను పరిష్కరించ డంలో చైనా సరైన భాగస్వామి అవుతుంది. చైనా ప్రజలు టూరిజం కోసం, విద్య, ఉపాధి కోసం ప్రపంచ మంతా పర్యటిస్తూ ఎంతో దోహదం చేస్తున్నారు. అందువల్ల అధ్యక్షా నన్ను ఒక్క మాట చెప్పనీయండి. మనం చైనాతో కలిసి పనిచేయదలచుకున్నాం. సానుకూల, నిర్మాణాత్మక సంబంధాలకు అత్యంత ఎక్కువ అవకాశాలున్నాయి. విస్తరిస్తున్న వాణిజ్యంలో, వాతావరణ మార్పులను పరిష్కరించడంలో, ముఖ్యంగా వచ్చేఏడాది బ్రిటన్‌లో జరిగే కాప్26 సమావేశంలో సహకరించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.”

> “ఒకవైపు అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక సంబంధాలు, మరోవైపు చైనాతో పెరుగుతున్న వాణిజ్య, ఆర్థికసంబంధాలు... ఈ రెంటి మధ్య అనేక ఐరోపా దేశాలూ, ఇతర దేశాలూ ఊగిసలాడుతున్నాయి. ఇవి ఆ దేశాల మధ్య విభజనకు కారణమవుతున్నాయి.”

ఒకవైపు అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక సంబంధాలు, మరోవైపు చైనాతో పెరుగుతున్న వాణిజ్య, ఆర్థికసంబంధాలు... ఈ రెంటి మధ్య అనేక ఐరోపా దేశాలూ, ఇతర దేశాలూ ఊగిసలాడుతున్నాయి. ఇవి ఆ దేశాల మధ్య విభజనకు కారణమవుతున్నాయి. చైనా చేపట్టిన “మేడిన్ చైనా 2025” కార్యక్రమం అమెరికా, ఐరోపా ఇతర దేశాల కార్పొరేట్ శక్తుల భయాలకు కారణమవుతున్నదని అమెరికాకు చెందిన బ్రూక్లిన్ ఇన్‌స్టిట్యూట్



జులై 28న వాషింగ్టన్‌లో సమావేశమైన ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి మేరిస్ పైనె, అమెరికా విదేశాంగ మంత్రి పాంపియో

విశ్లేషకుడు థామస్ రైట్ పేర్కొన్నారు. 2025 నాటికి 5జి టెలికమ్యూనికేషన్స్, ఆధునిక రోబోటిక్స్, కృత్రిమ మేధ వంటి ఆధునిక ఉత్పత్తుల్లో ముందుకు సాగడానికి చైనా ప్రభుత్వం ఈ కార్యక్రమం రూపొందించింది. ఇందులో విజయం సాధిస్తే తమ కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యానికి చైనా సవాలుగా మారుతుందని అమెరికా, ఐరోపాలోని అనేక దేశాలు భావిస్తున్నాయి. అందువల్లనే చైనాను ఆర్థికంగా, సాంకేతికంగా నిలువరించేందుకు అమెరికాతో అవి చేతులు కలుపుతున్నాయి. మరోవైపు చైనాతో రోజురోజుకూ పెరుగుతున్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలు వాటిని అమెరికా యుద్ధ వ్యూహంలోకి వెళ్ల కుండా వెనక్కు లాగుతు న్నాయి. వాతావరణ చర్చలనుండి, ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలనుండి అమెరికా బయటకు రావడం, నాటో విషయం లో అమెరికా తీసుకున్న వైఖరి, ఇరాన్‌తో ఒప్పందం నుండి వైదొలగడం వంటి విషయాల్లో ఐరోపా దేశాలు అమెరికాను వ్యతిరేకిస్తున్నాయి. ఏమైనా చైనా వ్యతిరేక కూటమి కట్టడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇది ప్రపంచ వ్యాపితంగా ఆర్థిక, భౌగోళిక ఉద్రిక్తతలు పెంచుతోంది. కరోనాతో పెట్టుబడిదారీ ప్రపంచంలో సంక్షోభం ముదిరే కొద్దీ ఈ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది.

### భారత్ మార్గం ఏమిటి?

దురదృష్టవేమంటే ఈ ఉద్రిక్తతల సమయంలో భారత దేశం తన ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా అమెరికా వ్యూహంలోకి మరింత ఎక్కువగా జారుకుం టున్నది. గత కొన్ని దశాబ్దాలుగా భారత పాలక వర్గాలు మన స్వతంత్ర విదేశాంగ విధానానికి తిలోదకాలొదులుతూ అమెరికాకు అనుకూలంగా మారుతూ వస్తున్నారు. మన కార్పొరేట్ పెట్టుబడులు అమెరికా పెట్టుబడులతో మరింతగా మిలాఖత్ అవుతున్న కొద్దీ మన దేశం వ్యూహాత్మకంగా అమెరికాకు దగ్గరవుతూ వస్తోంది. 2005 భారత్ అమెరికా ఒప్పందంతో ఈ సాన్నిహిత్యం మరింత పెరిగి అమెరికా వ్యూహంలో మన దేశాన్ని జూనియర్ భాగస్వామిగా మార్చే ప్రయత్నాలు ముమ్మరమైనాయి. లడక్ సరిహద్దుల్లో ఇటీవల భారత్-చైనాల సైనికుల మధ్య జరిగిన దురదృష్టకర ఘర్షణను ఉపయోగించుకుని మోడీ ప్రభుత్వం ఈ ప్రయత్నాలను సమర్థించు కోవడమే కాకుండా మరింత ముమ్మరం చేసింది. మన దేశాన్ని అమెరికా పన్నిన చైనా వ్యతిరేక వ్యూహంలోకి నెట్టడానికి ప్రయత్నిస్తున్నది.

ఉద్రిక్తతలు ఏర్పడినప్పుడు ప్రజల్లో శాంతి వచనాలకన్నా దుడుకుతనం వైపే మొగ్గు కనిపిస్తుంది. కొద్ది రోజులుగా మన కార్పొరేట్ మీడియా చైనా వ్యతిరేకతను పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ ఈ క్రమంలో అమెరికాతో వ్యూహాత్మక బంధాన్ని సమర్థించుకుంటోంది. కానీ ఉద్రిక్తతలు చల్లారి, రెండు పక్షాలు వాస్తవ పరిస్థితులను ఆకళింపు చేసుకున్నప్పుడు సరిహద్దుల్లో శాంతి ప్రాధాన్యత అర్థమవుతుంది. ఒకవైపు ఆర్థిక మాంద్యం, మరోవైపు కరోనా మహమ్మారి పట్టిపీడిస్తున్న తరుణంలో ప్రంచంలోనే జనాభాలో అతిపెద్ద దేశాలైన భారత్-చైనాలు ఉద్రిక్తతలు పెంచుకోవడం రెండు దేశాలకూ నష్టదాయకం. దానివల్ల


epaper.prajasakti.com

> **"చైనాకు వ్యతిరేకంగా అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన చతుష్ట కూటమి (క్వాడ్)లో చేరి మలబార్ సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నందకు సంబరపడుతున్న మోడీ ప్రభుత్వం దీని వల్ల ఇరాన్ తదితర దేశాలతో మన దీర్ఘకాలిక సంబంధాలు దెబ్బతిన్నందున దేశానికి ఎంతగా నష్టం వాటిల్లిందో ఆలోచించడం లేదు. అమెరికా ఒత్తిడికి లంగి భారత దేశం ఇరాన్-పాకిస్థాన్-భారత్ గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు నుండి తప్పకున్నది."**

మొదటిది, ఉన్న వనరులను కరోనాతో పోరాటానికి, ఉపాధి సృష్టికి సమీకరించాల్సిన తరుణంలో సరిహద్దులకు తరలించడం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. రెండవది, 21 శతాబ్దంలో ఆర్థికంగా ఎదిగి వస్తున్న భారత్–చైనాల మధ్య చిచ్చు పెట్టడానికి అమెరికా చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తోంది. దేశాల మధ్య యుద్ధాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం అమెరికాకు కొత్తేమీ కాదు. ఇజ్రాయిల్‌ను ఉపయోగించుకుని పశ్చిమాసి యాను రణరంగంగా మార్చింది. పదేళ్ల పాటు ఇరాక్‌ను ఇరాన్‌పైకి ఎగదోసి, ఎదిగి వస్తున్న రెండు దేశాలను నాశనం చేసింది. తరువాత ఇరాక్‌పై యుద్ధానికి దిగి నేలమట్టం చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌లో సోవియట్‌కు వ్యతిరేకంగా తాలిబాన్లను ఎగదోసింది. తరువాత ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో తాలిబాన్ల పాలనలోని ఆఫ్ఘనిస్థాన్‌పై దాడులకు దిగింది. అందువల్ల అమెరికా చరిత్ర పరిశీలిస్తే దానిది స్నేహ హస్తం కాదు భస్మాసుర హస్తం అని తెలుస్తుంది. మూడవది, అన్నిటికన్నా ముఖ్యమైనది, అమెరికాతో సాంగత్యం వల్ల ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాలు కోల్పోతాం. ఒకప్పుడు ప్రపంచంలోని వర్ధమాన దేశాలతో ఏర్పడిన అలీనోద్యమానికి నాయకత్వం వహించిన భారత్ నేడు ఇరుగుపొరుగు దేశాలను కూడా తన వెనుక సమీకరించుకోలేని స్థితిలోకి నెట్టబడింది.

చైనాకు వ్యతిరేకంగా అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన చతుష్ట కూటమి (క్వాడ్)లో చేరి మలబార్ సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నందకు సంబరపడుతున్న మోడీ ప్రభుత్వం దీని వల్ల ఇరాన్ తదితర దేశాలతో మన దీర్ఘకాలిక సంబంధాలు దెబ్బతిన్నందున దేశానికి ఎంతగా నష్టం వాటిల్లిందో ఆలోచించడం లేదు. అమెరికా ఒత్తిడికి లొంగి భారత దేశం ఇరాన్–పాకిస్థాన్–భారత్ గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు నుండి తప్పుకున్నది. దాంతో ఇరాన్ నుండి చౌకగా భారత్‌కు గ్యాస్ లభించే అవకాశాలను వదులుకోవలసి వచ్చింది. అలాగే ఇరాన్‌లో భారత దేశం నిర్మించ తలపెట్టిన కీలకమైన చబహర్ పోర్టు ప్రాజెక్టు నిర్మించే విషయంలో కూడా కేవలం అమెరికా ఒత్తిడి వల్ల భారత్ వెనక్కు తగ్గింది. దాంతో చబహర్‌నుండి ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులోని జహెదాన్ వరకు రోడ్డు నిర్మాణాన్ని తమ దేశమే చేపడుతుందని ఇరాన్ ప్రకటించింది. ఫలితంగా ఆఫ్ఘనిస్థాన్ నుండి ఇరాన్‌ద్వారా మధ్యాసియా దేశాలకు రవాణా కారిడార్ ఏర్పాటు చేసే అవకాశాన్ని భారత దేశం చేజార్చు కున్నది. "చబహర్‌లో భారత దేశం అవకాశం కోల్పోడానికి అమెరికానే కారణమని ఢిల్లీలో చాలా మంది సహజంగానే ఆరోపిస్తున్నారు" అని మాజీ నౌకాధికారి, నౌకాయాన విధాన సంస్థ అధిపతి అభిజిత్ సింగ్ ఇటీవల ప్రింట్ పత్రికకు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. "అమెరికా ప్రభుత్వం గనుక ఒక పద్ధతి ప్రకారం ఇరాన్‌ను దూరం చేసుకుని ఉండకపోతే భారత్–ఇరాన్ సంబంధాల్లో అపనమ్మకం ఏర్పడి ఉండేది కాదు. అమెరికా ఆంక్షలకు తలగ్గి భారత దేశం ఇరాన్ నుండి చమురు దిగుమతులు తగ్గించి వేయడంతో ఇరాన్‌కు భారత ప్రభుత్వం మీద నమ్మకం పోయింది. ట్రంప్ ప్రభుత్వ దుందుడుకు చర్యల వల్ల భారత దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా ఇరాన్ వ్యవహరించాల్సి వచ్చింది" అని ఆయన పేర్కొన్నారు.

అదే సమయంలో చైనా, ఇరాన్‌తో 40,000 కోట్ల డాలర్ల (సుమారు 30 లక్షల కోట్ల రూపాయల) పెట్టుబడులతో నిర్మించే భారీ ప్రాజెక్టులపై ఒప్పందం కుదుర్చుకుంది. "చైనా–ఇరాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం" పేరుతో కుదిరిన ఈ ఒప్పందం కింద రానున్న 25 సంవత్సరాల్లో చైనా ఇరాన్‌లు సంయుక్తంగా ఇరాన్‌లో పౌర, సైనిక మౌలిక సదుపాయాలు – పోర్టులు, రైల్వేలు, రోడ్డు రవాణా మార్గాలు అభివృద్ధి చేస్తాయి. ఒకవైపు మధ్య ప్రాచ్యంలో అమెరికా, సైదీ అరేబియా, ఇజ్రాయిల్ కూటమితో జతకట్టడం వల్ల భారత్ ఇతర దేశాలకు దూరం అవుతుండగా ఆఫ్ఘనిస్థాన్, పాక్, ఇరాన్ ద్వారా మధ్య ప్రాచ్యం, మధ్య ఆసియా దేశాలతో చైనా సంబధాలు పెంచుకుంటోంది.

కరోనా మహమ్మారి నుండి త్వరగా కోలుకుని ఆర్థికంగా పుంజుకుంటున్న చైనా ఆసియా–ఐరోపాలను కలిపే బెల్ట్ అండ్ రోడ్డు ప్రాజెక్టుకు భారీగా నిధులు సమకూర్చగల స్థితి ఉంది. 130 దేశాలు భాగస్వాములుగా చేరిన, చేరడానికి అంగీకరించిన ఈ ప్రాజెక్టులో భాగంగా అనేక దేశాల్లో రోడ్లు, పోర్టులు, రైల్వేలు, పైప్‌లైన్లు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి మంచి అవకాశాలు ఏర్పడ్డాయి. బిఆర్ ప్రాజెక్టుకు పోటీగా అమెరికా "స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండో–పసిఫిక్ వ్యూహం" (ఎఫ్ఓఐపి) పేరుతో మరో ప్రాజెక్టు ప్రారంభించింది. చైనా చొరవతో ప్రారంభమైన బిఆర్ ప్రాజెక్టులో చేరవద్దని తన మిత్ర పక్షాలపై ఒత్తిడి తెస్తోంది. దాని ఒత్తిడికి కొన్ని దేశాలు లంగినప్పటికీ అనేక దేశాలు అందులో చేరాయి. చివరికి జి–7దేశమైన ఇటలీ కూడా బిఆర్ ప్రాజెక్టులో చేరింది. దాంతో పాటు ఐరోపాలోని రష్యా, గ్రీస్‌కూడా ఇందులో చేరాయి.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాకిస్థాన్‌తో పాటు దక్షిణాసియాలోని నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర అత్యధిక దేశాలతో భారత్ సంబంధాలు దెబ్బతింటూ వస్తున్నాయి. ఒకప్పుడు అలీనోద్యమానికి నాయకత్వం వహించిన భారత దేశం నేడు కనీసం తన పొరుగు దేశాలను కూడా ఒక తాటి మీదకు తీసుకురాలేని అశక్తతలో పడింది. ఒకవైపు రోజురోజుకూ తీవ్రమవుతున్న కరోనా మహమ్మారి, మరోవైపు మరింత తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో అమెరికా యుద్ధవ్యూహంలో చేరి ఇరుగు పొరుగు దేశాలతోనూ, సంప్రదాయంగా సత్సంబంధాలు కలిగిన దేశాలతోనూ సంబంధాలు వదులు కోవడం మన దేశ ప్రజల ప్రయోజనాలకు నష్టదాయకం.

మొత్తంగా చూసినప్పుడు కరోనా మహమ్మారి ప్రపంచంలోని సామాజిక వైరుధ్యాలను మంరింత తీవ్రతరం చస్తోంది. కరోనా అనంతర ప్రపంచంలో ఈ వైరుధ్యాలు మరింత తీవ్రం అవుతాయి. సోషలిస్టు దేశాలు మరింత బలోపేతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే దిగజారుతున్న అమెరికా ఆర్థిక, రాజకీయ పెత్తందారీ అధిపత్యానికి మరిన్ని సవాళ్లు ఎదురవుతాయి.

❋


epaper.prajasakti.com

> ❝ ఈ నాలుగు బడాసంస్థలు తమ కన్సల్టెన్సీలు స్వతంత్రంగా పనిచేస్తాయని, తమ ఆడిట్ సంస్థలతో సంబంధం లేకుండా వాటికి ప్రత్యేకమైన నిబంధనలు ఉన్నాయని వాదిస్తున్నాయి. ఆ విధంగా వాటి మధ్య ఉన్న సంబంధాలను మరుగుపరచటానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ వాదనకు ఏ మాత్రం విలువ లేదు. ఈ సంస్థలన్నింటినీ సమన్వయం చేసే యంత్రాంగం ఒకటిగానే ఉంటుంది. ఈ అంశాన్ని దశాబ్దాల నుండి రెగ్యులేటర్లు పట్టించుకోవటం లేదు. ❞

**పిడబ్ల్యుసి:** పిడబ్ల్యుసి పాల్పడిన అక్రమాల చరిత్రను కొద్దిమాటలలో చెప్పాలని ప్రయత్నించటం సాహసమే అవుతుంది. సత్యం కంపెని కుంభకోణంలో భాగస్వామిగా ఉన్న పిహెచ్‌సికి చెందిన 11 సంస్థలు లిస్టెడ్ కంపెనీల ఎకౌంట్లను ఆడిట్ చేయకుండా జనవరి 10, 2018న సెబి రెండు సంవత్సరాల నిషేధాన్ని విధించింది. దీనితో పాటు పిడబ్ల్యుసి అక్రమంగా సంపాదించిన 26 కోట్ల రూపాయలు వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాలని కూడా ఆదేశించింది. 2019 సెప్టెంబరులో పిడబ్ల్యుసి భారతదేశ విభాగమైన ప్రైస్‌వాటర్ హౌస్‌కూపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పై ఇడి 230 కోట్ల రూపాయల పెనాల్టీ విధించింది. అంతకు వారం రోజుల ముందు ఆ సంస్థ ప్రస్తుత ఛైర్మన్, గతంలో ఛైర్మన్‌లుగా పనిచేసిన ఇద్దరికీ, కొందరు డైరెక్టర్లకు నోటీసులు జారిచేసింది.

ప్రైస్‌వాటర్ హౌస్‌కూపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రైస్‌వాటర్ హౌస్ సర్వీసెస్ బివి, నెదర్లాండ్స్ నుండి 230 కోట్ల రూపాయల పెట్టుబడులను పొందిందని, ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ చట్టం -1999 -ఎఫ్ఇఎంఎ- నుండి తప్పించుకోవటం కోసం దానిని గ్రాంటుగా చూయించిందని ఇడి గమనించింది. ఆ విధంగా విదేశాల నుండి నిధులు పొందాలంటే ముందుగా రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి తీసుకోవాలి. పిడబ్ల్యుసి అంతమొత్తం పెట్టుబడులను విదేశాల నుండి పొందదటానికి చట్టాలు అంగీకరించవు గనుక ఆర్‌బిఐ అనుమతించటం జరగదు. ఈ అంశంపై తన ముందుకు వచ్చిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దర్యాప్తు చేయమని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం మేరకు ఇడి చేపట్టిన విచారణ ఇంకా పూర్తికాలేదు. ప్రస్తుతం వెల్లడైన కేరళ బంగారం స్మగ్లింగ్ కేసులో కూడా పిడబ్ల్యుసి పాత్ర ఉన్నదని వెల్లడౌతున్నది. ఈ కేసులో కీలకవ్యక్తి అయిన స్వప్న సురేశ్ కేరళ రాష్ట్ర ఐటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌లో ఆపరేషనల్ మేనేజర్‌గా పనిచేస్తున్నది. ఒక ఎయిర్ ఇండియా అధికారికి వ్యతిరేకంగా తప్పుడు రిపోర్టు ఇచ్చినందుకు క్రైం బ్రాంచ్ విచారణను ఎదుర్కొంటున్నది. పిడబ్ల్యుసి కన్సల్టెన్సీ ద్వారానే ఆమె ఉద్యోగం పొందిందని కూడా వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలను పిడబ్ల్యుసి వ్యతిరేకించింది. మూడవ పార్టీకి అవసరమైన నైపుణ్యాలున్న వ్యక్తులు వారి నుండి వేతనాలు పొంది పనిచేస్తున్నారని, వారిని గురించి కన్సల్టెన్సీ సంస్థ ప్రాథమిక విచారణ జరుపుతుందని పిడబ్ల్యుసి పేర్కొంది. అనేక ఆరోపణలు, వివాదాలు ఇంకా ముగింపుకు రావలసే ఉన్నది.

సెబి ప్రధాన లక్ష్యం పెట్టుబడులు పెట్టేవారి ప్రయోజనాలను పరిరక్షించటం. భిన్న ప్రయోజనాలు పొందటాన్ని నివారించాలంటే ఎవరైతే క్రమబద్ధీకరణ యంత్రాంగానికి లోబడి వ్యవహరించాలో వారు క్రమబద్ధీకరణ యంత్రాంగంతో సంబంధాలు కలిగి ఉండటం లేదా భాగస్వాములుగా ఉండటానికి అనుమతించరాదు. పరీక్షలలో పాల్గొనేవారు సిలబస్‌ను నిర్ణయించటం, ప్రశ్నలు రూపొందించటం, పరీక్షా పత్రాలను దిద్దేవారిని నిర్ణయించకుండా చూడటం ఎంత అవసరమో ఇది కూడా అంతే అవసరం. ఈ నాలుగు బడా సంస్థలు ఆడిట్ వ్యవహారాలు చూడటం మాత్రమే కాక, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో లిస్టైవున్న వాటిలో 60-70 శాతం కంపెనీలకు కన్సల్టెన్సీ సర్వీసులను అందిస్తున్నాయి.

### బడా కంపెనీల తప్పుడు వాదనలు

ఈ నాలుగు బడాసంస్థలు తమ కన్సల్టెన్సీలు స్వతంత్రంగా పనిచేస్తాయని, తమ ఆడిట్ సంస్థలతో సంబంధం లేకుండా వాటికి ప్రత్యేకమైన నిబంధనలు ఉన్నాయని వాదిస్తున్నాయి. ఆ విధంగా వాటి మధ్య ఉన్న సంబంధాలను మరుగుపరచటానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ వాదనకు ఏ మాత్రం విలువ లేదు. ఈ సంస్థలన్నింటినీ సమన్వయం చేసే యంత్రాంగం ఒకటిగానే ఉంటుంది. ఈ అంశాన్ని దశాబ్దాల నుండి రెగ్యులేటర్లు పట్టించుకోవటం లేదు.

అకౌంటింగ్‌లో బడా సంస్థలైన పిడబ్ల్యుసి, ఇవై, కెపిఎంజిలు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రయోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్–డిపిఐఐటి–కి సహాయం అందించటానికి టెక్నికల్ ఎవాల్వింగ్ రౌండ్‌లో అర్హత సాధించాయి. కొత్తగా నెలకొల్పే కంపెనీలకు అవసరమైన సహకారం అందించటం కోసం ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లు నిర్వహించటం కోసం సెబి, ఇతర సంస్థలు వినియోగిస్తున్న మరొక బహుళజాతి సంస్థ గ్రాంట్ థోర్న్‌టన్ ఇండియా ఎల్ఎల్‌పి సాంకేతిక పరీక్షలో విఫలమైంది. అది ఎటువంటి పెద్ద కుంభకోణాలలో పాల్గొనలేదా?

### పౌర సమాజం సలహాలు

ఢిల్లీ హైకోర్టు మాజి న్యాయమూర్తి, లా కమిషన్ మాజి ఛైర్మన్ జస్టిస్ ఎ పి షా ఛైర్మన్‌గా ఏర్పడిన ది సిటిజెన్స్ విజిల్ బ్లోయర్ ఫోరం (సిడబ్ల్యుబిఎఫ్) పిడబ్ల్యుసి అనేక కుంభకోణాలలో ఉన్న దృష్ట్యా దానికి ఎటువంటి ప్రభుత్వ కాంట్రాక్టులు ఇవ్వరాదని 2017 నుండి ప్రధానికి, ఆర్థికమంత్రికి అనేకసార్లు విజ్ఞప్తి చేసింది. సిడబ్ల్యుబిఎఫ్‌లో మాజి నౌకాదళాధిపతి అడ్మిరల్ రాందాస్, భారత ప్రభుత్వ మాజీ ప్రభుత్వ కార్యదర్శి ఇఎఎస్ శర్మ, దేశ మొదటి చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ వజాహత్ హబీబుల్లా, మాజి ఐఎఎస్ అధికారి, సామాజిక కార్యకర్త అరుణారాయ్, న్యాయవాది, సామాజిక కార్యకర్త ప్రశాంత్‌భూషణ్, అహ్మదాబాద్ ఐఐఎం మాజి ప్రొఫెసర్ జగదీప్ చొక్కర్ తదితర గౌరవనీయ వ్యక్తులున్నారు. సిడబ్ల్యుబిఎఫ్ సూచనలు చట్టాన్ని సక్రమంగా అమలుచేయటానికి, భిన్న ప్రయోజనాలు పొందటాన్ని నివారించటానికి, స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి దోహదం చేస్తాయి. రెగ్యులేటర్‌కు, రెగ్యులేషన్‌కు లోబడి ఉండేవారి మధ్య చైనాగోడ లాంటి బలమైన విభజన ఉంటేనే ఇది సాధ్యమౌతుంది.

ఆడిట్, కన్సల్టెన్సీ సర్వీసులు అందిస్తున్న నాలుగు బహుళజాతి సంస్థలకు రెగ్యులేటర్‌తో సంబంధం ఉన్న ప్రభుత్వ కాంట్రాక్టులను ఇవ్వరాదు. కుంభకోణాలతో సంబంధం ఉన్న సంస్థలకు ప్రభుత్వ కాంట్రాక్టులను ఇవ్వటాన్ని ఆపివేయటం ద్వారానే సమాజానికి సరైన


epaper.prajasakti.com

# బహుళజాతి సంస్థలతో ఆత్మనిర్భర్ భారత్

సర్వేశ్ మాథుర్

పారిశ్రామిక ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు సక్రమంగా అమలు జరిగేలా పర్యవేక్షించటం కోసం సంస్థలను ఎంపిక చేయటానికి రూపొందించిన మొదటి జాబితా నుండి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా-సెబి- ఆరు సంస్థలను ఎంపిక చేసింది. ఈ సంస్థలు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తాయి. వీటిలో నాలుగు పెద్ద సంస్థలలోని మూడు అంతర్జాతీయ అకౌంటింగ్ సంస్థలు-ఇవై, కెఎంపిజి, పిడబ్ల్యుసి-ఉన్నాయి. దేశంలో వివిధ సందర్భాలలో జరిగిన కుంభకోణాలలో సెబి ఎంపిక చేసిన ఈ మూడూ బహుళజాతి సంస్థలకూ పాత్ర ఉన్నదని గతంలో జరిగిన విచారణలలో రుజువైంది. ఎంపికైన మిగతా మూడు సంస్థలు ఆర్ఎస్ఎం అస్ట్యూట్ కన్సల్టింగ్, బిడివో ఇండియా, ఎఎన్‌బి సొల్యూషన్స్ ఉన్నాయి. విధానపరమైన ప్రభుత్వ డాక్యుమెంట్లను సక్రమంగా ఉంచటం, స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసిడ్యూర్-ఎస్‌పివో-, ఇతర సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి చెందిన డాక్యుమెంట్లను పారిశ్రామిక ప్రమాణాలకు అనుగుణంగా ఉంచటం కోసం ఈ సంస్థలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ నెట్‌వర్క్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, సమాచార భద్రత, సమాచార సాంకేతిక పరిజ్ఞానం నిర్వహణ తదితరాలకు సంబంధించిన సామర్థ్యాన్ని పెంచటం, నిర్వహణ ఖర్చులను తగ్గించటం లక్ష్యంగా ఈ సంస్థలను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని తప్పు పట్టలేం. కాని ఇందుకోసం ఇవై, కెఎంపిజి, పిడబ్ల్యుసిలను ఎంపిక చేయటమే సందేహాలను రేకెత్తిస్తున్నది. ఈ సంస్థలకు భారీ కుంభకోణాలతో సంబంధం ఉన్నది. అందువలన మొదటి జాబితాలోనే ఈ సంస్థలను చేర్చకుండా ఉండాల్సింది. ఈ మూడు సంస్థలు పాల్పడిన అక్రమాలను గురించి సెబి, తీవ్రమైన నేరాలపై దర్యాప్తు చేసే సంస్థ-సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సి-, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్-ఇడి- వివిధ సందర్భాలలో దర్యాప్తు చేశాయి.

ఈ అంశానికి సంబంధించిన ఒక ముఖ్యమైన ప్రశ్నకు సమాధానం కావాలి. నాలుగు పెద్దసంస్థలలో ఒకటైన డెలాయిట్‌ను "ఆత్మనిర్భర్ భారత్"లో ఎందుకు భాగస్వామిగా చేయలేదు? ఈ నాలుగు పెద్దసంస్థలను సముద్రాంతర దేశాలలో ఉన్న వాటి మాతృసంస్థలు అదుపు చేస్తున్నాయని దశాబ్దాలుగా గుట్టలుగా సాక్ష్యాలు లభించాయి. ఇటువంటి చిన్న తరహా ప్రాజెక్టులను నిర్వహించటానికి అవసరమైన సామర్థ్యం భారతీయ సంస్థలకు లేదా? అందువలనే అటువంటి వాటిని నిర్వహించటం కోసం బహుళజాతి సంస్థలను ఆశ్రయిస్తున్నామా? అదే కనుక నిజమైతే మనమంతా సిగ్గుతో తలలు వంచుకోవాలి. "ప్రపంచస్థాయిలో ప్రచారం చేయండి, స్థానికంగా వ్యవహరించండి"-బి వోకల్, గో లోకల్- అని ప్రధాని ఇచ్చిన నినాదాన్ని అమలు చేసే పద్ధతి ఇదేనా అని మనం తీవ్రంగా ఆలోచించాలి. ఆ విధంగా దేశీయ సంస్థలను ప్రోత్సహిస్తేనే 2022 నాటికి ప్రపంచంలోని 8 పెద్ద చార్టర్డ్ ఎకౌంటెంట్ సంస్థలలో 4 భారతదేశానివి ఉండాలని 2017లో ప్రధాని చెప్పినది వాస్తవరూపం దాలుస్తుంది.

### ఎంపికకు అర్హతలేని సంస్థలు

మొత్తం జాబితా నుండి ప్రభుత్వం ఎంపిక చేసిన జాబితాలోని కొన్ని సంస్థల అర్హత లేమిని మరోసారి గుర్తు చేసుకుందాం.

**ఇవై**: ఈ మధ్యకాలంలో జర్మనీలో జరిగిన వైర్‌కార్డ్ కుంభకోణంలో భాగస్వామిగా ఉన్నది. ఇది అక్రమాలకు పాల్పడుతున్న ఇవై స్వభావాన్ని వెల్లడిస్తున్నది. కంపెనీ చూయిస్తున్న మొత్తంలో 1.9 బిలియన్ యూరోలు -17,000 కోట్ల రూపాయలు- ఎప్పుడూ లేవని సంస్థ ఇన్‌సాల్వెన్సి పిటీషన్ దాఖలు చేసింది. దాదాపు దశాబ్దకాలం నుండి వైర్‌కార్డ్ సంస్థకు ఇవై ఆడిటర్‌గా పనిచేస్తున్నది. ఆడిట్‌లో ప్రాథమిక అంశమైన వైర్‌కార్డ్ సంస్థ బ్యాంకు స్టేట్‌మెంట్లను ఇవై గత మూడు సంవత్సరాల నుండి తనిఖీ చేయటం లేదు. 2009లో సత్యం సంస్థలో జరిగిన కుంభకోణంతో వైర్‌కార్డ్ కుంభకోణానికి పోలికలున్నాయి. సత్యం కంపెనీ చూయించిన 5,000 కోట్ల రూపాయల బ్యాంకు నిల్వలు అబద్ధమని రుజువైంది. ఇతర దేశాలలో ఉన్న తన భాగస్వాముల నుండి వత్తిడి వస్తున్నప్పటికీ, కంపెనీకి ఆడిటర్లుగా ఉన్న ప్రైస్‌వాటర్ హౌస్‌కూపర్స్ -పిహెచ్‌సి- కంపెనీకి సంబంధించిన స్టేట్‌మెంట్లకు సంబంధించి బ్యాంకుల నుండి ధృవీకరణ పొందటంలో విఫలమైంది.

**కెపిఎంజి, డెలాయిటి:** ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ అండ్ లీజింగ్ సర్వీస్- ఐఎల్అండ్ ఎఫ్ఎస్-లో 2018లో జరిగిన 90,000 కోట్ల రూపాయల కుంభకోణంలో కెపిఎంజి అనుబంధ సంస్థ అయిన బిఎస్ఆర్ అండ్ అసోసియేట్స్ ఎల్ఎల్‌పి, డెలాయిటి హాస్కిన్స్ అండ్ సెల్స్(డెలాయిటి)లపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ-ఎంసిఎ- ఐదు సంవత్సరాల నిషేధం విధించమని కొద్దినెలల క్రితం ప్రతిపాదించింది. తన పరిశోధనా విభాగమైన సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ విచారణ జరిపి, రూపొందించిన 30,000 పేజీల నివేదిక ఆధారంగా ఎంసిఎ ఈ చర్య తీసుకున్నది. కెపిఎంజి, డెలాయిటి వృత్తిపరమైన అక్రమాలకు పాల్పడ్డారనేందుకు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారికంగా ప్రకటించింది. ఎంసిఎ తీసుకున్న చర్యలో లోపాలున్నాయని భావించిన బాంబే హైకోర్టు ఈ రెండు సంస్థల నిషేధానికి చేస్తున్న ప్రయత్నాలను నిలిపివేస్తూ ఏప్రిల్ 21, 2020న ఆదేశాలను జారీచేసింది. ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టులో ఉంది.


epaper.prajasakti.com

సందేశం చేరుతుంది. తగిన నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న దేశీయ కంపెనీలకు కాంట్రాక్టులు ఇవ్వటానికి అన్ని ప్రయత్నాలు చేయాలి. దేశంలో నైపుణ్యానికి కొదవలేదు. సెబి, డిఐపివి ప్రారంభించిన ప్రాజెక్టులను నిర్వహించగల సామర్థ్యం టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో తదితర సంస్థలకు ఉన్నది. కొన్ని చిన్న భారతీయ ఆడిట్ సంస్థలను తోడుచేసికొని ఈ కార్యక్రమాలను వారు నిర్వహించగలరు. సెబి మాజి అధికారులు, స్టాక్ మార్కెట్‌లోని మధ్యవర్తులు, పారిశ్రామికరంగంలో నైపుణ్యం ఉన్నవారిని కూడా వినియోగించుకోవాలి. అంతగా అవసరమైతే భిన్న ప్రయోజనాలు పొందటానికి అవకాశం లేని ఆక్సెంచర్, మెకెన్సి, బెయిన్ క్యాపిటల్, ఎ టి కెర్ని తదితర సంస్థలను వినియోగించుకోవాలి. చిల్లర వ్యాపారంలోకి వస్తున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు నిర్దిష్ట మొత్తం దేశీయ ఉత్పత్తులను వినియోగించాలని షరతు విధించాలి. ఇదే విధంగా ఈ

> **“ బహుళజాతి సంస్థలు నిర్దిష్ట మొత్తం ఆడిట్ కార్యకలాపాలను దేశీయ సంస్థలకు అవుట్‌సోర్సింగ్ ఇవ్వాలని డిమాండ్ చేయాలి. ఇది ఉభయులకూ ప్రయోజనకరంగా ఉంటుంది. భారతీయ సంస్థలు తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంచుకొనే కొద్ది బహుళజాతి సంస్థలు విధించే నిర్ణీత ఛార్జీలు తగ్గుతాయి. ”**

బహుళజాతి సంస్థలు నిర్దిష్ట మొత్తం ఆడిట్ కార్యకలాపాలను దేశీయ సంస్థలకు అవుట్‌సోర్సింగ్ ఇవ్వాలని డిమాండ్ చేయాలి. ఇది ఉభయులకూ ప్రయోజనకరంగా ఉంటుంది. భారతీయ సంస్థలు తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంచుకొనే కొద్ది బహుళజాతి సంస్థలు విధించే నిర్ణీత ఛార్జీలు తగ్గుతాయి. ఈ విధంగా వ్యవహరిస్తేనే 2022 నాటికి ప్రపంచంలోని ఎనిమిది పెద్ద ఆడిట్ సంస్థలలో నాలుగు భారతీయ సంస్థలను చూడాలన్న ప్రధాని కలలు వాస్తవం అవుతాయి. పారదర్శకత, బాధ్యత, మంచి పరిపాలన తదితరాలు వట్టి మాటలుగా మాత్రమే మిగలకుండా ఉండాలంటే పౌరసమాజం, వృత్తి నైపుణ్యం కలిగినవారు, వివిధ రంగాలలో నిపుణులు, మేధావులు చేసిన ఈ ప్రతిపాదనలను అందరూ బలపరచాలి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# తీవ్రమవుతున్న వైరుధ్యాలు

(7వ పేజీ తరువాయి)

కూడా రామమందిర నిర్మాణంలో భాగస్వాములమే అని ఆ పార్టీ చెప్పుకుంటున్నది. ఇటువంటి పరిస్థితుల్లో మనం రాష్ట్రాల వారీగా బిజెపి-ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా, ఆయా రాష్ట్రాల్లో పాలక పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలకు, బిజెపితో జతకట్టిన పార్టీలకూ వ్యతిరేకంగా ఎవరిని సమీకరించగలమో పరిశీలించాలి. విస్తృత ప్రాతిపదికపై సమస్యలపై మనతో కలిసి వచ్చేవారిని ఒకే వేదికమీదకు సమీకరించాలి. విభిన్న సమస్యలపై మనం విభిన్న శక్తులను సమీకరించే ప్రయత్నం చేయాలి. మనం ఐక్య ఉద్యమాలనూ, విస్తృత పోరాటాలనూ నిర్మించగలిగినప్పుడు మాత్రమే ప్రతిపక్షాల్లో మనం కొంత బలాన్ని, నమ్మకాన్ని కలిగించగలం. హిందుత్వ మతతత్వవాదం,నయా-ఉదారవాదాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడేవాళ్లం మనమే గనుక మనం ఈ శక్తులన్నిటినీ ఒక చోటకు సమీకరించడానికి ప్రయత్నించాలి. మొదట మనం స్వతంత్ర పని ద్వారా స్వతంత్ర బలాన్ని పెంచుకోవాలి, అన్ని శక్తులను సమీకరించడానికి ప్రయత్నించాలి. మనం ప్రజారోగ్యం, ప్రజల విద్యకు సంబంధించిన సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నాం. ఈ సమయంలో ప్రజలు ప్రజారోగ్య వ్యవస్థ ఆవశ్యకతను గుర్తిస్తారు. అందువల్ల ఇప్పుడు మనం ప్రజలకు కావలసిన వైద్య సదుపాయాల మీద, గ్రామ స్థాయిలో, బ్లాకు, తాలూకా స్థాయిలో ఉన్న సదుపాయాలను మెరుగుపరిచే విషయం మీద ఆందోళనలు చేయాలి. తాలూకా స్థాయి ఆసుపత్రులు, జిల్లా స్థాయి ఆసుపత్రులు మెరుగుపరచాలని, మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలని, వైద్యులను, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని ఆందోళనలు చేపట్టాలి.

మనం ఏ రకమైన ఆందోళనలు చేపట్టినా ప్రజలతో మన సంబంధాలను పెంచుకోవాలి. ఈ కష్ట కాలంలో ప్రజలతో ఉండాలి.

మనం కరోనా మహమ్మారి తరువాతి రోజులకు సిద్ధం కావాలి. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక మతతత్వ విధానాలనుండి వెనక్కు రాదు. ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడి చేస్తున్న వారు తరువాత కూడా దాన్ని కొనసాగిస్తారు. ప్రజలపై అనేక భారాలు వేస్తారు. ఆ పనిచేయకుండా ఆగరు, నిరంతరం కొనసాగిస్తూనే ఉంటారు. వీటికి వ్యతిరేకంగా పోరాడ్డానికి మనం సిద్ధంగా ఉండాలి. ప్రస్తుతం మనం పెద్ద పోరాటాలు చేయలేకపోవచ్చు. కానీ నిరంతరం రాజకీయంగా, నిర్మాణ పరంగా సిద్ధమై ఉంటే, ఇతర పార్టీల మాదిరిగా కాకుండా మహమ్మారి తరువాత మనం ప్రజల్లోకి పెద్ద ఎత్తున వెళ్ల గలుగుతాము. మన స్వతంత్ర కృషి, వామపక్షాలతో కలిసి చేసే పోరాటాలూ ఇతర లౌకిక, ప్రజాతంత్ర శక్తులను సమీకరించగలగాలి. రాన్ను రోజుల్లో ఈ కర్తవ్యాలను పూరిస్తారని నేను భావిస్తున్నాను. మన కామ్రేడ్స్ అంతా ఈ మహమ్మారి కాలంలో తగిన జాగ్రత్తలుతీసుకుంటారని భావిస్తున్నాను. ఒకవైపు జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రజలతో సంబంధాలను పెట్టుకోడానికీ, కొనసాగించడానికీ మార్గాలు వెదుకుతారని భావిస్తున్నాను.

చివరిగా చెప్పేదేమంటే, ప్రస్తుతం ఈ భూగోళం మీద కరోనా మహమ్మారి వివిధ శక్తుల మధ్య ఇప్పటికే ఉన్న ఘర్షణలను, వైరుధ్యాలను తీవ్రతరం చేస్తున్నది. ప్రస్తుతం మనం కష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ రానున్న పరిస్థితి మనకు అనేక అవకాశాలను, కొత్త అవకాశాలను కల్పి స్తుంది. ఈ అవకాశాలను అందిపుచ్చుకుంటే దేశంలో వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమం పెద్ద అంగలతో ముందుకు పురోగమించగలుగుతుంది.


**(అనువాదం: ఎస్.వెంకట్రావు)**



epaper.prajasakti.com

ఈ మాసం ప్రత్యేకం

# చైనా వ్యతిరేకత వల్ల అభివృద్ధికి విఘాతం



రచయిత పాత్రికేయుడు

**వి. శ్రీధర్**

చైనా వస్తువులను బహిష్కరించాలని మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మహమ్మారి బారిన పడిన భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. జాతీయంగా స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ఆ ప్రక్రియలో రాజ్యం కీలకపాత్ర పోషించాలి. చైనా నుంచి నేర్చుకున్న పాఠాలతో భారతదేశం మరిన్ని లాభాలు పొందవచ్చు.

అవేశపరులు తమ మెదడును పూర్తిగా వినియోగించలేరన్న పాత తమిళ సామెతకు చైనా వస్తువులను బహిష్కరించాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరిగ్గా సరిపోతుంది. గాల్వన్ లోయలో సంభవించిన విషాదకర పరిణామాల అనంతరం చైనాతో సాగిస్తున్న వ్యాపారం, పెట్టుబడులు తదితరాలపై ఆంక్షలు విధించాలని కేంద్రం, కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అధికారికంగా, అనధికారికంగా తమ అభిప్రాయాలను వెల్లడించాయి.

సర్వవ్యాప్తమైన చైనా వస్తువులు, భారత మార్కెట్‌లో అధికభాగం అమ్ముడవుతున్న మొబైల్ ఫోన్లు, చైనాలో తయారైన గణేష్ విగ్రహాలు ఈ బహిష్కరణలో ఉన్నాయి. వెర్రితో కూడిన ఆవేశంతో పక్కవాడి కంటే ఎక్కువ దేశభక్తి ప్రదర్శించాలనే తపన ప్రతి ఒక్కరిలో కనిపిస్తున్నది. ప్రత్యేకించి చైనా కంపెనీలు పెట్టిన పెట్టుబడులపైనే దృష్టి సారించారు. సైబర్‌స్పేస్‌లో వినియోగించే 59 చైనీస్ యాప్స్‌పై, చైనా కంపెనీలు ప్రస్తుతం అమలు చేస్తున్న సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టులపై నిషేధం విధించారు. భారత రేవుల్లో, విమానాశ్రయాల్లో వచ్చి చేరిన వస్తువులు అక్కడే నిలిచిపోయాయి. యుద్ధోన్మాదం పెరిగేకొద్దీ వర్తక, ఆర్థిక సంబంధాలు మరింతగా బిగుసుకుంటాయి. భారత-చైనా సంబంధాలు సాధారణ దశకు చేరడానికి తిరిగి నమ్మకం కలిగించే ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది.

కక్ష తీర్చుకునేందుకు ఆవేశపూరితంగా పిలుపులిస్తున్న పరిస్థితుల్లో జాతీయంగా స్వయం సమృద్ధి సాధించకుండా ముందుకు సాగడాన్ని ఈ సమయంలో ప్రశ్నించాల్సి వస్తున్నది. అన్నింటి కంటే ముఖ్యంగా జాతీయ స్వయం సమృద్ధిని సాధించడం ఎలా అనేది చైనా నుంచి నేర్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుహనా దేశభక్తుల విద్వేషపూరితమైన ఆగ్రహం కారణంగా ఆర్థిక విధానాలకు సానుకూల ప్రత్యామ్నాయాలు వెతకడం కష్టం. ఆర్థిక సరళీకరణ భారంతో భారతదేశం ఇతరుల దయపై ఆధారపడే స్థితి లేకుండా ఉండేందుకు ప్రశాంతచిత్తంతో యోచించాల్సిన తరుణమిది. మూడు దశాబ్దాల ఆర్థిక కార్యకలాపాల అనుభవంతో ప్రపంచ మార్కెట్లను చేజిక్కించుకునే సామర్థ్యం, అందుకు అవసరమైన జాతీయ స్వయంకృషి గురించి చైనా నుంచి నేర్చుకునేందుకు మనం సంసిద్ధులం కావాలి.

**విడిపోవడం మేలు చేస్తుందా?**

భారతదేశం గత రెండు దశాబ్దాలుగా చైనాపైనే కాకుండా అనేక ఇతర దేశాలపై ఆధారపడి ఎదుగుతున్నది. ఈ పరిస్థితుల్లో చైనాతో విడిపోవడం మేలు చేస్తుందా అని యోచించాలి. ఈ రెండు దశాబ్దాల కాలంలో భారత్ చైనాల మధ్య వ్యాపార సంబంధాలు బలపడ్డాయి. గడిచిన 20 ఏళ్ల కాలంలో ఎగుమతి, దిగుమతుల విలువ చాలా పెరిగింది. కేవలం కొన్ని బిలియన్ డాలర్ల వ్యాపారం సాగితే అందులో ఎగుమతులు కొంచెం ఎక్కువ వుంటే దిగుమతులు చాలా తక్కువగా ఉండేవి. 2009-10 నాటికి నాటకీయంగా దిగుమతులు పెరిగాయి. ఉదాహరణకు 2014 అనంతరం నాలుగు సంవత్సరాల కాలంలో 25 శాతం దిగుమతులు పెరిగితే ఎగుమతులు నిలకడగా ఉన్నాయి. చైనా ఇరవై ఏళ్ల కిందట 5 శాతం ఎగుమతులు చేస్తే ఇప్పుడది 15 శాతానికి పెరిగింది. అయినప్పటికీ 2019లో భారత ఆర్థికవ్యవస్థలో వెనకపట్టు పట్టడంతో దిగుమతులు తగ్గాయి.

చైనా నుంచి భారతదేశ దిగుమతులను పరిశీలిస్తే మనం అనేక కీలక అంశాల్లో వారిపై ఆధారపడ్డాం. ఉదాహరణకు చైనా విద్యుత్ పరికరాల ఉత్పత్తులు. ఇవి గత దశాబ్దకాలంలో భారత మార్కెట్‌లో ఆధిపత్యం సంపాదించాయి. చైనాలో కొనసాగుతున్న ఆర్థికప్రగతి కారణంగా ప్రపంచంలో ఎవరూ కలలో కూడా ఊహించనంత తక్కువ ధరలకు వస్తువులను తయారుచేసే విధంగా వారి ఆర్థికవ్యవస్థను రూపొందించుకున్నారు. గత దశాబ్దిలో ఐరోపా దేశాలు సరఫరా చేసే ఫార్మాస్యూటికల్స్‌కు అవసరమైనవి (ఎపిఐలు) చైనా ఉత్పత్తిదారులు సరఫరా చేయడమే కాక బల్క్‌డ్రగ్స్ ఉత్పత్తిలోకి కూడా ప్రవేశించారు.

**మందుల వ్యాపారం**

పశ్చిమ దేశాల బహుళజాతి కంపెనీలు మందుల తయారీకి అవసరమైన ముడి సరుకును ఎక్కువ లాభాలు చూసుకుని సరఫరా చేస్తున్నందువల్లనే చైనా కంపెనీలకు ముడిసరుకుల వ్యాపారంలో అడుగిడడం సులువైంది. విటమిన్ల తయారీకి సంబంధించి భారతదేశం భారీ ఎత్తున చైనా దిగుమతులపై ఆధారపడింది. విటమిన్లు, యాంటీబయాటిక్స్‌లో ఉపయోగించే ఎపిఐలు 90 శాతం చైనా నుంచే వస్తున్నాయి ఈ స్థాయిలో ఉన్న ఆధారిత స్థితి నుంచి హడావిడిగా ఎలా బయటపడగలం? వాస్తవానికి చైనా దిగుమతుల ఎలా వస్తున్నాయో ఖచ్చితంగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ఫార్మాస్యూటికల్ ఉత్పత్తుల దిగుమతులపై నిషేధాలు ఎల్‌జి, శాంసంగ్,


epaper.prajasakti.com

టయోటా, హెూండా లాంటి పెద్ద కంపెనీలకు ఉద్దేశించబడ్డాయి. ''చట్టవిరుద్ధంగా మాదకద్రవ్యాల సరఫరా జరుగుతుందనే '' హాస్యాస్పదమైన సమాచారం ఆధారంగా జూన్ 22న చెన్నయ్, విశాఖపట్నంలలో కస్టమ్స్ అధికారులు చైనా నుంచి వచ్చిన అన్ని ఉత్పత్తులను నిలిపివేశారు. "ముందుచేసి తరువాత ఆలోచించు'' అనే పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

**పరిశ్రమ స్వరాలు**

రసాయనాలు, ఎరువులు, యంత్రాల విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్‌తో పాటు పెద్దఎత్తున వినియోగ వస్తువులకు చైనాపై ఆధారపడి ఉన్నాం. ఇటీవల వెలువడిన ఒక మీడియా నివేదికను బట్టి భారతదేశం అధికశాతం చైనాపై ఆధారపడింది. చైనా నుంచి అసంఖ్యాకమైన వస్తువులలో 90 శాతం వ్యాపారం నడుస్తున్నట్లు తెలుస్తున్నది. భారత కంపెనీలు గత రెండు దశాబ్దాలుగా చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై భారీగా ఆధారపడి ఉన్నాయి. ఉదాహరణకు బజాజ్ ఆటో చైనా నుంచి 1,000 కోట్ల రూపాయల విలువగల వాహనాల యంత్ర పరికరాలను ప్రతియేటా దిగుమతి చేసుకుంటున్నది. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ మాట్లాడుతూ " దీనిని మార్చుకునేందుకు చాలాకాలం పడుతుంది, ఒక్కరాత్రిలో సాధ్యం కాదు'' అన్నారు. ఆటో పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం దేశీయంగా రవాణా ఖర్చులు, 10 శాతం డ్యూటీతో కలిపి చేసే ఉత్పత్తుల కంటే చైనా నుంచి తెప్పించుకోవడం 15 శాతం చవక అని, ఆ తేడా పరిశ్రమకు స్వల్పమైనదేమీ కాదని అంటున్నారు. మహమ్మారికి ముందునుంచే పరిశ్రమ సంక్షోభంలో ఉన్నది. దిగుమతులకు సంబంధించి పక్కన పెడితే ప్రపంచస్థాయికి ఎదగడానికి భారత కంపెనీలకు చైనా అనుభవాలు ఎంతగానో తోడ్పడతాయని రాజీవ్ బజాజ్ స్పష్టం చేస్తున్నారు. ఆయన ఒక బిజినెస్ డైలీతో మాట్లాడుతూ "తయారు చేస్తున్నామా, అమ్ముతున్నామా అని కాక ఒక ప్రపంచస్థాయి కంపెనీగా మా అవగాహనను మరింతగా పెంచుకునేందుకు వివిధ మార్కెట్ల అనుభవాలు అవసరమవుతాయి. ఇప్పటికిప్పుడు బజాజ్ ఆటో చైనా ఉత్పత్తుల నుంచి దూరంగా జరగలేదు." అన్నారు. ఇప్పటికే పరిశ్రమకు చెందిన అధికార ప్రతినిధులు భారతదేశం వనరుల కోసం ఒక్కదేశంపై ఆధారపడడం తగ్గించుకోవాలి అని అంగీకరిస్తూ, మహమ్మారి సమస్య దృష్ట్యా ఈ ప్రక్రియ దశలవారీగా సాగాలంటున్నారు.

చైనాపై మనం ఆధారపడే అవసరాన్ని గురించి మాట్లాడుకునేముందు మన లోపాలు ఏమున్నాయో పరిశీలించుకోవాలని యంత్ర పరికరాలను తయారు చేయడంలో ప్రత్యేకతలున్న మధ్యస్థాయి కంపెనీ ఏస్ మైక్రోమాటిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.కె.రమేష్ చెప్పారు. తన కంపెనీకి ఆధారం చైనాలో ఉన్నదని, చైనా చేస్తున్న మొత్తం వ్యాపారంతో చూస్తే భారతదేశంపై చైనా ఆధారపడింది చాలా స్వల్పమని చెప్పారు. రమేష్ క్రమం తప్పకుండా చైనా పర్యటిస్తారు. "ఆ దేశంలో దశల వారీగా జరిగిన మార్పులు ఆశ్చర్యం కలిగిస్తాయి, వారి నుంచి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉంది." అని రమేష్ చెప్పారు.

" రసాయనాలు, ఎరువులు, యంత్రాల విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్‌తో పాటు పెద్దఎత్తున వినియోగ వస్తువులకు చైనాపై ఆధారపడి ఉన్నాం. ఇటీవల వెలువడిన ఒక మీడియా నివేదికను బట్టి భారతదేశం అధికశాతం చైనాపై ఆధారపడింది. చైనా నుంచి అసంఖ్యాకమైన వస్తువులలో 90 శాతం వ్యాపారం నడుస్తున్నట్లు తెలుస్తున్నది. భారత కంపెనీలు గత రెండు దశాబ్దాలుగా చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై భారీగా ఆధారపడి ఉన్నాయి. "

మూడు దశాబ్దాల కాలంలో చైనా జిడిపి 40 రెట్లు పెరిగింది. త్వరితగతిన అభివృద్ధి సాధించినందుకు ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. టెలికమ్యూనికేషన్ల నెట్‌వర్క్ పరికరాల్లో హువాయి, సోషల్ మీడియాలో టెన్సెంట్, ఈ-కామర్స్, రిక్రియేషనల్ డ్రోన్లు డిజెఐలో అలీబాబా లాంటి బడా కంపెనీలు సాధించిన ఫలితాలివి. చైనా ఒక్కరాత్రిలో ప్రపంచ ఫ్యాక్టరీగా మారలేదు. దీర్ఘకాలిక వ్యూహంతో నూతన ఆవిష్కరణలు, ఉత్పత్తులు, సేవలను మొత్తం ప్రపంచానికి విస్తరించడం సాధ్యమైంది. అందుకు రెండు ఉదాహరణలను ప్రస్తావిస్తే సరిపోతుంది. మొట్టమొదటిది 5జి టెక్నాలజీలో గట్టిపోటీని తట్టుకుని హువాయి ప్రపంచ నాయకత్వస్థాయికి ఎదిగింది. అది డొనాల్డ్ ట్రంప్ పరిపాలనా వ్యవస్థ నుంచి అవిశ్రాంతంగా దాడులను ఎదుర్కొంటూనే ఉన్నది. రెండవది రైల్వే టెక్నాలజీలో చైనావారికున్న సామర్థ్యం మూడు దశాబ్దాల నుంచి పెరుగుతూనే ఉంది. ఫలితంగానే "బుల్లెట్" రైళ్ల రూపకల్పనలో ప్రపంచంలో తిరుగులేని స్థానాన్ని పొందింది. చైనా ప్రతి సందర్భంలోనూ విభిన్న రంగాలలో పెట్టుబడులు పెట్టి అంతకు మించిన విస్తృతమైన విలువను సమాజానికి తిరిగి ఇస్తోంది.

**హువాయి శకం**

టెలికమ్యూనికేషన్ల సామాగ్రిని అందించే ప్రపంచంలోని అతిపెద్ద సంస్థ హువాయి తన ప్రత్యర్థులైన నోకియా, ఎరిక్‌సన్, చైనాలోని ప్రత్యర్థి సంస్థ జెడ్‌టిఈ లాంటి వాటికన్నా చాలా ముందున్నది. 1980 దశకంలో లూసెంట్ టెక్నాలజీస్ సంస్థ కూలిపోయిన అనంతరం అమెరికాకు ఆ స్థాయిలో టెలికమ్యూనికేషన్ల సంస్థ లేదు. ట్రంప్ పాలనలోని అమెరికా చైనా కంపెనీ పట్ల ఉన్న అయిష్టంతో హువాయి పరికరాలు ఎంతమాత్రం సురక్షితమైనవి కాదని మిత్రులకు చెప్పే పనిలో ఉన్నది.

హువాయి ప్రపంచంలోని ఏ టెలికం సంస్థ పొందని రీతిలో 2019లో 123 బిలియన్ డాలర్ల లాభం సంపాదించింది. ప్రజా విముక్తి సైన్యంలో సీనియర్ అధికారిగా పనిచేసిన రెన్ ఝెంగ్‌యి 1987లో ఈ కంపెనీని స్థాపించారు. స్విచ్‌ల తయారీతో ఆరంభమైన ఈ కంపెనీ క్రమంగా స్వంత నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసుకుంది. అనంతరం ప్రపంచంలోని క్లయింట్లకు తన సేవలను విస్తరించింది. ఇటీవలనే వినియోగదారుల మార్కెట్‌లో ప్రవేశించి సొంత డివైజ్‌లను తయారుచేసింది. విజయవంతంగా నడుస్తున్న యాపిల్, శాంసంగ్ లాంటి సంస్థలతో పోటీపడి విజయం సాధించింది. ప్రపంచమంతటా ఈ సంస్థకు 1,94,000 సిబ్బంది ఉండగా వారిలో దాదాపు సగం మంది పరిశోధన, అభివృద్ధి విభాగాల్లో పనిచేస్తున్నారు.

హువాయి అమెరికాలో తన విభాగాన్ని 2001లో ఏర్పాటు చేసింది. తక్షణమే అమెరికాలోని ప్రైవేట్ టెలికం కంపెనీలు హువాయి తమను అధిగమిస్తుందనే భయంతో ప్రభుత్వం ద్వారా వత్తిడి తెచ్చే ప్రయత్నాలు ఆరంభించాయి. సిస్కో, మోటరోలా కంపెనీలు మేధోపరమైన ఆస్తులను దొంగిలించారని హువాయిపై 2001లో కేసు దాఖలు చేశారు. కానీ తరువాత ఆ అమెరికా కంపెనీలు కోర్టు బయటే వివాదాన్ని పరిష్కరించుకున్నాయి. దీన్ని



epaper.prajasakti.com

"చైనా ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు ఉండడం వల్లనే మిగిలిన పోటీదారుల కంటే తక్కువ ధరలకు ఇవ్వగలిగే సామర్థ్యం హువాయి కంపెనీకి ఉన్నదని అమెరికా ప్రభుత్వం, మీడియా ఆరోపణలు చేస్తున్నారు. అయితే నిష్పాక్షికంగా ఉండే పరిశీలకులు మాత్రం అందుకు భిన్నంగా చెబుతున్నారు. ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకును, సామర్థ్యాన్ని, సేవలను హువాయి సొంతంగా చేసుకుంటుంటే మిగిలిన కంపెనీలు ఇతరులపై ఆధారపడడం వల్ల చైనా కంపెనీ వస్తువులు చౌకగా లభిస్తున్నాయంటున్నారు."

బట్టి వారి వద్ద రుజువు చేసేందుకు తగిన ఆధారాలు లేవని అర్థమవుతున్నది. చైనా ప్రభుత్వంతో, సైన్యంతో హువాయికి "లోతైన సంబంధాలు" ఉన్నాయని 2005లో రాండ్ కార్పొరేషన్ ఆరోపించింది.

ఎవరెన్ని చెప్పినప్పటికీ హువాయి పూర్తిగా ప్రత్యేకమైనది, కార్పొరేట్ నిర్మాణం, ప్రతిష్టలో విభిన్నమైనది. హువాయి పూర్తిగా రెన్‌తో కలిపి 1,04,572 మంది కంపెనీ ఉద్యోగుల సొంతం. 3,000 మంది రిటైరైన ఉద్యోగులు కూడా కంపెనీ యజమానులే. ఉద్యోగులు కంపెనీలో భాగస్వాములు కావాలంటే కొన్ని అర్హతలను సంతృప్తి పరచాల్సి ఉంటుంది. ఇంత ప్రత్యేకమైన నిర్మాణాన్ని ఏర్పాటు చేయడంలో రెన్ "సమిష్టి సంస్కృతి" ని అనుసరించారు. ఒక్కరి కోసం అందరు, అందరి కోసం ఒక్కరు అనే సిద్ధాంతం ఆధారంగా ఈ కంపెనీ పనిచేస్తుంది. రెన్‌కు ఈ కంపెనీలో ఉన్న వాటా 0.94 శాతం. మిగిలిన 99.06 శాతం ఇతర వాటాదారులందరికీ చెందుతుంది. వాటాదారులందరూ డివిడెంట్లు పొందేందుకు అర్హులు. ఉద్యోగులు మాత్రం తమ సామర్థ్యానికి తగిన విధంగా షేర్లు పొందుతారు. ప్రపంచంలో పెట్టుబడిదారులెవరూ పెట్టనంత మొత్తం, 2019లో కంపెనీ తన ఆదాయంలో 15 శాతం పరిశోధన, అభివృద్ధి మీద ఖర్చు చేసింది. కనుకనే షెన్‌జెన్‌లో పుట్టిన ఈ కంపెనీకి 85,000 పేటెంట్లు ఉన్నాయి. మరొక ఆసక్తికరమైన అంశం ఏమిటంటే ఈ కంపెనీ ఛైర్మన్ పదవి రొటేషన్ పద్ధతిలో మారుతుంటుంది. కనుక ఏ సమయంలో చూసినప్పటికీ కంపెనీకి ముగ్గురు నాయకులు ఉంటారు.

ప్రత్యేకమైన ఈ నిర్మాణం ఫలితంగానే స్విచ్‌లు తయారుచేసే కంపెనీ కాలక్రమంలో 5జి టెక్నాలజీ నిర్వహించే ప్రపంచ నాయకత్వ స్థానానికి ఎదిగింది. హువాయిలోని భాగస్వాములు ఇతర కంపెనీల భాగస్వాముల్లా అధిక మొత్తం లాభాలు పంచమని కోరరు. వచ్చిన లాభాలను పంచే అవసరం లేనందువల్ల కంపెనీ ప్రపంచంలోని ఇతర మార్కెట్లపై దృష్టి సారించగలుగుతున్నది. హువాయి విదేశీ కంపెనీలతో వ్యాపారం చేయడంలో అనుసరించే పద్ధతి భిన్నమైనది. హువాయి వస్తువులు కొనాలనుకునే కంపెనీకి ముందుగా ఆ వస్తువులను ఉచితంగా వినియోగించేందుకు అనుమతిస్తారు, ఇది ఏ ప్రత్యర్థి కంపెనీ చేయలేదు.

చైనా ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు ఉండడం వల్లనే మిగిలిన పోటీదారుల కంటే తక్కువ ధరలకు ఇవ్వగలిగే సామర్థ్యం హువాయి కంపెనీకి ఉన్నదని అమెరికా ప్రభుత్వం, మీడియా ఆరోపణలు చేస్తున్నారు. అయితే నిష్పాక్షికంగా ఉండే పరిశీలకులు మాత్రం అందుకు భిన్నంగా చెబుతున్నారు. ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకును, సామర్థ్యాన్ని, సేవలను హువాయి సొంతంగా చేసుకుంటుంటే మిగిలిన కంపెనీలు ఇతరులపై ఆధారపడడం వల్ల చైనా కంపెనీ వస్తువులు చౌకగా లభిస్తున్నాయంటున్నారు. అమెరికా లేవనెత్తిన మరో అంశం రక్షణ. దీనికి సంబంధించి కంపెనీ తన కార్యకలాపాలు నిర్వహించే దేశాల్లో తన పరికరాలను పరీక్షించుకునే వీలు కల్పిస్తున్నది. బ్రిటన్‌లో అదే పని చేసింది. ఫలితంగానే మొబైల్ టెలిఫోన్ మార్కెట్‌లో చొచ్చుకొని పోగలుగుతున్నది. ఆఫ్రికాలోని పలు దేశాల్లో 5జి సర్వీసులతో సహా పెద్ద మార్కెట్లు హువాయి వైపు మళ్లుతున్నాయి. నూతన ఆవిష్కరణలతో పాటు కంపెనీల నిర్మాణ పద్ధతులలో మార్పుల ద్వారానే విజయం సాధ్యమని భారతదేశం, భారత సంస్థలకు హువాయి అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. అప్పుడే అలలకు ఎదురీదగలిగే సామర్థ్యం వస్తుంది.

### మౌలిక సదుపాయాల కల్పనే చోదకశక్తి

2008లో ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం తలెత్తినపుడు చైనా భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. 586 కోట్ల డాలర్లకు పైగా వెచ్చించి వివిధ ప్రాజెక్టులు ఆరంభించింది. గృహనిర్మాణంతో పాటు ఇతర ప్రధాన సదుపాయాల కల్పనకు సంబంధించి రైల్వేలు, ప్రధాన రోడ్డు మార్గాలు, విమానాశ్రయాలు నిర్మించింది. ఈ పెట్టుబడులు స్వదేశీ అవసరాల విస్తరణలో అతి ముఖ్యమైన పాత్ర పోషించాయి. ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థిక ప్రగతి సాధ్యమైంది. కొన్ని రంగాలు ప్రగతివైపు పయనించాయి. బ్యాంకులు అధిక సామర్థ్యంతో పనిచేశాయి. ఈ పెట్టుబడుల కారణంగా ఆర్థికవ్యవస్థ కూలిపోకుండా నిలదొక్కుకుంది. కోవిడ్-19 సంక్షోభ సమయంలో చైనా ప్రకటించిన ప్యాకేజీ ముందు మోడీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు మరుగుజ్జులా కనిపిస్తాయి. చైనా ప్రభుత్వం 4.9 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులను ప్రకటించింది. ఇక్కడ గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన తేడా ఈ పెట్టుబడులేవీ భారతదేశంలో మాదిరిగా రుణమాఫీకి, సహాయక చర్యలకు, పన్ను మినహాయింపునకు, పరిశ్రమలకు ఇచ్చే సబ్సిడీలకు ఉద్దేశించినవి కావు.

మౌలిక సదుపాయాల కల్పనకు చైనా చేసిన కృషితో 1990 దశకంలోని రైల్వే నెట్‌వర్క్‌ను సంపూర్ణంగా మార్చివేశారు. మోడీ ప్రభుత్వం మూడేళ్ల క్రితం దేశంలో తొలిసారిగా "బులెట్ రైలు" ప్రాజెక్టుకు ప్రయత్నించింది. కానీ ఇప్పుడు దాని గురించి మాట్లాడడం లేదు. చైనా మాత్రం పూర్తిగా భిన్నమైన ధోరణిని అనుసరించింది. అత్యధిక వేగంతో నడిచే రైళ్ల (హెచ్‌ఎస్‌ఆర్) నిర్మాణం కంటే మూడు దశాబ్దాల ముందే రైల్వే మౌలిక సదుపాయాల వ్యవస్థను మార్చివేయడం లక్ష్యంగా పెట్టుకుని పనిచేయటం ద్వారా దానిని సాధించారు. దశల వారీగా చేపట్టిన పనుల్లో భాగంగా చైనా ప్రయాణీకులకు తొలి ప్రాధాన్యం ఇస్తూ, సరుకుల రవాణాకు ప్రత్యేక మార్గాలను వేశారు. అదే సమయంలో అన్ని రైళ్ల వేగాన్ని పెంచారు. హెచ్‌ఎస్‌ఆర్ ప్రాజెక్టులను అనంతర కాలంలో చేపట్టినప్పటికీ పనులు 60 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ విస్తరణలో సాంకేతికతను కూడా అందిపుచ్చుకుని వాటిని వినియోగించడమే కాక పెద్దఎత్తున చేపట్టిన ఈ విస్తరణ పనుల్లో బహుళజాతి సంస్థలు తమ వంతు సాంకేతికతను కూడా అందించే పద్ధతిలో వారిని ఒప్పించి పనిచేయించారు. తొలిరోజుల్లో అడుగుపెట్టిన రైళ్ల ఉత్పత్తిదారులు మిట్సుబిషి, ఆల్టమ్ అండ్ సైమన్స్ కంపెనీలు ఈ షరతులకు అంగీకరిస్తేనే అనుమతులిచ్చారు. ప్రపంచ మార్కెట్ సంక్షోభంలో ఉన్న సమయంలో వారి సరుకులకు



epaper.prajasakti.com

ఎక్కడ అమ్ముకుంటారు?

### భారత సదుపాయాల కల్పనలో చైనా పాత్ర

తక్కువ కాలంలో చైనాతో విడిపోవడం సాధ్యమయ్యేపని కాదని జెఎన్‌యు ప్రొఫెసర్ బిస్వజిత్ ధర్ నమ్ముతారు. "భారతదేశం కొత్త వ్యూహంతో పనిచేయడం ఇప్పుడు ప్రారంభిస్తే అది పూర్తి కావడానికి కొన్నేళ్లు పడుతుంది." భారత విధానం ''నయా ఉదారవాద భావజాలానికి బానిసగా ఉండే రీతిలో ఉంది. స్వయం సమృద్ధిని సాధించడమంటే హడావిడి వ్యవహారం కాదు. దానికి వ్యూహం అవసరం. అందుకు తొలుత దేశీయ వనరులను సమీకరించడం ద్వారా దేశీయ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలి. అందుకు మనకొక పారిశ్రామిక విధానం అవసరం. దానితో పాటు వివిధ అంశాలు, సాంకేతిక సామర్థ్యం కూడా తప్పనిసరి" అని చెప్పారు.

అయితే భారతదేశం పూర్తిగా విదేశీయులపై ఆధారపడి వీటిని పూర్తి చేద్దామనుకున్నప్పటికీ దేశంలో అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన జరగాలి. ''అనేక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల్లో చైనా కంపెనీల ప్రమేయం ఉంది. కొన్ని వారాల క్రితం కొన్నింటిని రద్దు చేశారు. ఖండాల నడుమ మౌలిక సదుపాయల కల్పనకు చైనా కంపెనీలు ప్రయత్నిస్తుంటే భారత ప్రభుత్వం మొండిగా అంతర్జాతీయ ప్రాజెక్టు బిఆర్‌ఐ-బెల్టు అండ్ రోడ్ ఇనిషియేటివ్-ని తిరస్కరిస్తోంది. చైనా కంపెనీలు భారతదేశంలో మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు అమలు చేయడం లేదా? అని ధర్ ప్రశ్నించారు.

ప్రపంచీకరణలో చైనా ప్రమేయం ఆసక్తికరం. 2001లో ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యుటివో)లో చేరినప్పటి నుంచి ఎలాంటి కార్యకలాపాలు చేపట్టిందో చూద్దాం. ఒకసారి వెనక్కు తిరిగి చూస్తే డబ్ల్యుటివోలో చేరడానికి ముందు చేరిన తరువాత చైనా దశలవారీగా ఏం చేసిందో చూస్తే మనకు ఇక్కడేం చేయాలో తెలుస్తుంది. చైనా డబ్ల్యుటివో చేరడానికి వారు పెట్టిన ''దుస్సహమైన నిబంధనలు'' అంగీకరించింది. బలమైన ఉత్పత్తిరంగం అవసరమని సైద్ధాంతికంగా మనకు అవగాహన ఉండవచ్చు. కానీ చైనా అతి తక్కువ సమయంలో అది చేసి చూపించింది. చైనాలో అటువంటి 'చలనశీలత' ఉంది. వారు 2015లో ఒక పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు. 2049 నాటికి ప్రపంచంలో అగ్రగామి ఉత్పాదక దేశంగా ఉండాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఇక్కడ ఉన్న

**"భారతదేశంలో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉదారవాదం మనకున్న సామర్థ్యాలను, నైపుణ్యాన్ని దెబ్బతీసింది. ఉదాహరణకు ఫార్మాస్యూటికల్స్ సరఫరాల కోసం పూర్తిగా విదేశీ వనరులపై ఆధారపడడం ఉదారవాద విధానాల ఫలితమే."**



వీరదేశభక్తులు మాత్రం చైనా సరుకులను నిషేధించాలని, స్వయం సమృద్ధి సాధించాలని ప్రకటిస్తున్నారు.

### స్వయం సమృద్ధిని వదులుకొంటున్నారు

భారతదేశంలో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉదారవాదం మనకున్న సామర్థ్యాలను, నైపుణ్యాన్ని దెబ్బతీసింది. ఉదాహరణకు ఫార్మాస్యూటికల్స్ సరఫరాల కోసం పూర్తిగా విదేశీ వనరులపై ఆధారపడడం ఉదారవాద విధానాల ఫలితమే. "భారతదేశ అవసరాలను ఊహించగలగడం నాయకుని గొప్ప లక్షణం" జవహర్‌లాల్ నెహ్రూకు గల అలాంటి లక్షణం ఫలితంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయంతో అనేక ప్రభుత్వరంగ కంపెనీలను స్థాపించారు. ఫలితంగా స్వదేశీ బల్క్‌డ్రగ్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించగలిగాం. ఉదారవాద విధానాలతో ఈ సంస్థలన్నీ మూలనపడ్డాయి. భారత ఫార్మాస్యూటికల్ పరిశ్రమ ఒంటికాలిపై నిలిచివుంది. ప్రాథమికంగా దిగుమతులు ఐరోపా నుంచి వచ్చేవి, డబ్ల్యుటివోలో చేరడంతో చైనా దిగుమతులు ప్రవహించడం మొదలుపెట్టాయి. ఇది ''భారతదేశం దిగుమతులపై సుంకం భారీగా తగ్గించిన సమయం కూడా కాదు." ఇపుడు ఈ రంగంలో ఉన్న వారందరూ చైనా నుంచి వచ్చే దిగుమతులపైనే ఆధారపడుతున్నారు. నయా ఉదారవాదం ఫలితంగా దేశ స్వయం సమృద్ధిని త్యాగం చేయాల్సి వచ్చింది.

భారతదేశం పరులపై ఆధారపడడం, ఉదారవాదం పక్కపక్కనే కొనసాగాయి. సుంకాలు తగ్గించమని, స్వేచ్ఛా వాణిజ్యంలో జోక్యం చేసుకోవద్దని నయా ఉదారవాదులు ప్రభుత్వాలను కోరతారు. ధరెంతో తెలిస్తే ఇక ఇతర ప్రశ్నలు దేనికనేది వారి వాదన. ఎవరో ఎక్కడో తక్కువ ధరకు వస్తువులు తయారుచేస్తుంటే మనకెందుకు బాధ అని విధాన నిర్ణేతల వైఖరి. కానీ ప్రపంచంలో ఏ ఒక్క దేశం ఇలాంటి పద్ధతిని అనుసరించి విజయవంతం కాలేదు. స్వదేశీ సంస్థలను ఆదరించాలి. అందులో భారతదేశం దారుణంగా విఫలమైంది. మనం ఈ రోజు అందుకు మూల్యం చెల్లిస్తున్నాం.

అసమ పోటీ ఎదుర్కొన్న రంగాలలో మొదటిది విద్యుత్ పరికరాల రంగం. ఈ అసమ పోటీకి 1990ల్లోనే ఎన్‌రాన్ వైఫల్యం అతి పెద్ద ఉదాహరణగా నిలిచింది. దానివల్ల తీవ్రంగా ఇబ్బంది పడిన ప్రభుత్వరంగ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్‌ఈఎల్). ఈ కంపెనీ అనేక నూతన సాంకేతిక ఆవిష్కరణలు చేసింది. భారత విద్యుత్ పరిశ్రమలో బాయిలర్ల నుంచి వచ్చే బొగ్గు పొడిని ఎలా వినియోగించుకోవచ్చో కనుగొన్నప్పటికీ, చైనా నుంచి చేసుకుంటున్న దిగుమతులతో ఇది మరుగునపడిపోయింది.

భారతదేశంలోని ప్రతి రాష్ట్రంలో 1990ల


epaper.prajasakti.com

> **"భారతదేశం మినహా ప్రపంచంలోని అన్ని దేశాలు అంతర్గత పరిస్థితిని పరిశీలించుకొని, అంతర్గతంగా ఆర్థికశక్తులకు ఊతమిచ్చే విధానాలను అనుసరిస్తున్నాయి. 2008లో చైనా ప్రపంచ మార్కెట్‌లో ఏర్పడిన మాంద్యంతో ప్రపంచమార్కెట్ నుండి వెనక్కు తగ్గటానికి మారుగా అనేక దేశాలను, ముఖ్యంగా చుట్టు పట్ల ఉన్న దేశాలను భాగస్వాములుగా చేసుకొంటూ బిఆర్ఐ ప్రాజెక్టును ప్రారంభించి ముందుకు పోతుండగా భారతదేశం బయట ఉండి ప్రేక్షకపాత్రకు పరిమితమైంది."**

నాటికి ఎలక్ట్రానిక్ కంపెనీలు ప్రభుత్వరంగ సంస్థలుగా ఉండేవి. మనదేశంలో తొలిసారి టివిలను తయారుచేసిన కెల్ట్రాన్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఆ కోవలోకే వస్తాయి. ఈ కంపెనీలే తొలిసారి పుష్ బటన్ ఫోన్లను తయారుచేశాయి. 1996లో భారతదేశం డబ్ల్యుటివోతో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం అన్ని ఐటి ఉత్పత్తుల ధరలు పడిపోయాయి. దాంతో అప్పుడప్పుడే రెక్కలు తొడుక్కుంటున్న స్వదేశీ పరిశ్రమ అంతరించింది.

**అవధులు లేని ప్రపంచీకరణ**

ప్రపంచంలో వర్తకం, పెట్టుబడుల్లో మారుతున్న పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకోకుండా భారత ప్రభుత్వం ప్రపంచీకరణను అమలుచేస్తున్నది. వివిధ సందర్భాలలో వస్తున్న సంక్షోభాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థను కుదిపివేస్తున్నాయి. 1994లో మెక్సికన్ పెసో సంక్షోభం, 1997లో తూర్పు ఆసియా ఆర్థిక సంక్షోభం, 2001లో 9/11 సంక్షోభం, 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం, యూరోజోన్‌లో వచ్చిన సంక్షోభం, చిట్టచివరగా ఇప్పుడు మహమ్మారితో వచ్చిన సంక్షోభంతో ప్రపంచీకరణ సమస్యల నెదుర్కొంటున్నది. వాస్తవానికి 2008 ప్రపంచ సంక్షోభం అనంతరం ప్రపంచ మార్కెట్ కోసం ఉత్పత్తి చేయటం నుండి స్వదేశస్థాయికి మరలాలని అనేక దేశాల్లో పిలుపులివ్వటం ప్రారంభమైంది. ప్రతిదేశం అంతర్గత డిమాండ్ పెంచడంపై దృష్టి సారించాలని అనేకమంది ఆర్థికవేత్తలు వాదించారు. ఆ విషయంపై చైనా మాత్రమే దృష్టి సారించింది. "చైనా తరహా"లో ప్రపంచ మార్కెట్‌కు ఉత్పత్తి చేయడం గతం మాత్రమేనని భావించటం ప్రారంభించారు.

ప్రపంచ ఆర్థికవ్యవస్థ బలహీనమైన ఎదుగుదల, ప్రపంచ వాణిజ్యం కూడా చప్పగా సాగుతుంటే ఎగుమతుల ఆధారిత వ్యూహం ఎంతమాత్రం పరిష్కారం కాదని దేశాలు అనివార్యంగా గ్రహిస్తున్నాయి. 2008 తరువాత అనేక దేశాల్లో వాణిజ్యం జిడిపికి అనుగుణంగా కాక తగ్గుముఖం పడుతున్నది. ఒకటి దేశాలు వీలయినంత తక్కువగా ప్రపంచ వాణిజ్యంపై, ఆధారపడాలి. రెండోది దేశాలు దేశీయంగా డిమాండ్ పెంచుకోవటంపై దృష్టి సారించాలి. ఉదాహరణకు ఎలక్ట్రానిక్స్ రంగానికి సంబంధించి గత దశాబ్దంలో ఈ దిశగా గుర్తించదగిన మార్పులు కనిపిస్తున్నాయి.

చైనా కోవిడ్-19 బారిన పడిన వెంటనే మోడీ ప్రభుత్వంలోని కీలక అధికారులు ప్రపంచ ఉత్పత్తి స్థానం నుంచి చైనాను తప్పించి భారతదేశం చేరడం ఎలా అని రొద పెట్టడం మొదలుపెట్టారు గత దశాబ్దంలో ప్రపంచంలో వచ్చిన మార్పులపై భారతదేశం చేయాలనుకుంటున్న దానికి, ఇతర దేశాలు చేస్తున్నదానికి కూడా తేడా ఉంది. 1990ల తరువాత ప్రపంచీకరణ తీవ్రతరం కావడంతో ప్రతి అంతర్జాతీయ సంక్షోభంతో ప్రపంచీకరణ ప్రక్రియ భవిష్యత్తు, దాని ప్రభావం, గమనశీలత ఎలా ఉంటుందనే అనుమానాలను రేకెత్తిస్తున్నది.

ప్రపంచ మార్కెట్‌లో భారతదేశం నిలబడగలిగే స్థితి లేదు. గడిచిన దశాబ్దాలలో మన సొంత ఉత్పాదక శక్తిని పెంచుకోకుండా అంతర్జాతీయంగా వస్తున్న ఉత్పత్తులపై భారతదేశం ఆధారపడింది. ఇటీవల సంవత్సరాలలో అన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై (ఎఫ్‌టిఏ) సంతకాలు చేసింది. వాటి వల్ల భారత మార్కెట్లలోకి విదేశీ సరుకులు వచ్చాయి మినహా భారతదేశ సరుకులకు విదేశీ మార్కెట్లలో స్థానం దొరకలేదు. "మన సమస్య ఏమిటంటే పోటీని తట్టుకుని ఈ దేశాల్లో అమ్మేందుకు మన ఉత్పత్తులు ఏమీ లేవు." భారతదేశం ప్రాంతీయ హబ్‌గా ఎదగాలనుకోవడం కూడా విచిత్రమే. ఎఫ్‌టిఏ వలన లభించే పన్ను రాయితీలతో సంబంధం లేకుండానే చైనా ప్రపంచ మార్కెట్‌లో నిలబడింది. భారతదేశం ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సిఈపి)లో చేరితే మనకు మిగిలివున్న కొద్దిపాటి స్వతంత్ర ఉత్పత్తులకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది. ఆర్‌సిఈపిలో సభ్యత్వం పొందితే ఇటీవల భారతదేశంలో చైనా పెట్టుబడులపై విధించిన ఆంక్షలు అసంగతమవుతాయి. అందులో సభ్యత్వం పొందకపోతే ప్రాంతీయ ఆర్థికహబ్‌గా ఏర్పడాలనుకునే ఆశలతో పొసగని పరిస్థితి ఏర్పడుతుంది. ఏ ఒక్క దేశం తాను అనుకోవడం ద్వారా హబ్‌గా ఏర్పడలేదు. అందుకు అవసరమైన పరిస్థితులు ఉండాలి. ఈ విషయంలో కొన్ని ఇతరదేశాలలో ఉన్న పరిస్థితులు భారతదేశంలో లేవు.

భారతదేశం మినహా ప్రపంచంలోని అన్ని దేశాలు అంతర్గత పరిస్థితిని పరిశీలించుకొని, అంతర్గతంగా ఆర్థికశక్తులకు ఊతమిచ్చే విధానాలను అనుసరిస్తున్నాయి. 2008లో చైనా ప్రపంచ మార్కెట్‌లో ఏర్పడిన మాంద్యంతో తన అభివృద్ధి వ్యూహాన్ని సమతూకంగా ఉండే పద్ధతిలో అమలుచేసింది. ప్రపంచమార్కెట్ నుండి వెనక్కు తగ్గటానికి మారుగా అనేక దేశాలను, ముఖ్యంగా చుట్టు పట్ల ఉన్న దేశాలను భాగస్వాములుగా చేసుకొంటూ దశాబ్దాల కాలం సాగనున్న బిఆర్ఐ ప్రాజెక్టును ప్రారంభించి ముందుకు పోతుండగా భారతదేశం బయట ఉండి ప్రేక్షకపాత్రకు పరిమితమైంది.

మోడీ పాలనలో కొత్త "జాతీయవాదం", ప్రత్యేకించి చైనా వ్యతిరేకతతో ఉండడం సాధ్యం కానిది. "భారతదేశం ఇప్పుడున్న పరిస్థితుల్లో యధాతథస్థితిని కొనసాగించి, మహమ్మారి తీవ్రతరమవుతున్న దశలో మరింత ప్రమాదం సంభవించకుండా చూడాలి". దిగుమతులకు ప్రత్యామ్నాయం చూడాలని భావిస్తే అది మరింత తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. దీనికి అవసరమైన ఆర్థిక వనరులను ఎవరు సమకూరుస్తారు? ఒకవేళ విదేశీ పెట్టుబడులతో చేయవచ్చనుకుంటే అది మరింత ప్రశ్నార్థకమవుతుంది. ఉత్పాదక రంగంలో కేవలం 20 శాతం మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు లున్నాయి.

ఆర్భాటంతో కూడిన జాతీయోన్మాద గుర్రాన్ని ఎక్కిన స్థితిలో నేడు మోడీ పాలన ఉన్నది. నయా ఉదారవాదానికి తమ కట్టుబాటును, తాము ప్రచారం చేసుకుంటున్న స్వదేశీని కలిపి సాగించడం కుదరదు. ఈ ప్రక్రియలో ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తూ స్వదేశీ సామర్థ్యాన్ని పెంచుకొనేందుకు చర్యలు తీసుకోవటానికి వారి సైద్ధాంతిక కట్టుబాటు అడ్డం వస్తున్నది. అన్ని రకాల చైనా వస్తువులను నిషేధించడం చాలా తేలికైన చర్య. అనంతరం జరిగే పరిణామాలను ఎదుర్కొనడం తీవ్రమైన సమస్యలతో కూడుకొని ఉంటుంది.

**(అనువాదం: జి ఆంజనేయులు)**



epaper.prajasakti.com

# విద్యా రుణ సంక్షోభం

గిరీష్ ఖోండే

కోవిడ్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవ్యవస్థ దారుణంగా దెబ్బతిని నిరుద్యోగాన్ని కూడా పెంచింది. కాని భారతదేశంలో కోవిడ్ రాకముందే ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. 2019 సంవత్సరంలో నిరుద్యోగం 6.1 శాతంగా ఉంది. భారత ఆర్థికవ్యవస్థని పరిశీలించే సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి -సిఎంఐఇ- ప్రకారం 2020 మే నెలకే నిరుద్యోగ పెరుగుదల రేటు 27.11 శాతంకు చేరటంతో మొత్తంగా నిరుద్యోగం 8.74శాతానికి పెరిగింది.

ఈ పరిస్థితులలో మనం విద్యా ఋణాలు తీసుకున్న విద్యార్థుల పరిస్థితి పరిశీలిద్దాం. ప్రస్తుతం ఉన్న ఉపాధి పరిస్థితుల దృష్ట్యా వీరిలో చాలా మంది ఋణాలు చెల్లించే స్థితిలో లేరు. గత 6 సంవత్సరాలలో బ్యాంకులకి బకాయిలు పడ్డ పారిశ్రామికవేత్తల ఋణాలు సుమారు 7,77,800 కోట్ల రూపాయలు ప్రభుత్వం మాఫీ చేసింది. మరి ఋణగ్రస్తులైన విద్యార్థుల గురించి ప్రభుత్వం ఆలోచించాలి కదా!

విద్యకి, ఉపాధికి ఉన్న సంబంధం ఎప్పటి నుండో కొనసాగుతోంది. ఇందులో కొత్తది ఏమిటంటే ఋణాలు అనేవి ప్రైవేటు విద్యాలయాలలో ప్రవేశానికి ఉపయోగపడుతున్నాయి. కాని కొద్దిమంది కూడా విద్యార్థుల ఋణగ్రస్తత గురించి ఆలోచించట్లేదు. 2018-19 సంవత్సరాలలో ఉపాధి అవకాశాలు దొరక్క చనిపోయిన వారిలో రైతులు కన్నా విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నారు. మన దేశ విద్యా ఋణాల సంక్షోభం చాలా వరకు అమెరికాను పోలి ఉంది. ప్రస్తుతం విద్యా ఋణాల మార్కెట్ 130 బిలియన్ యు.ఎస్. డాలర్లు -10 లక్షల కోట్ల రూపాయలు-గా ఉంది. ప్రతి 15 మంది ఋణగ్రస్త విద్యార్థులలో ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారు.

భారతదేశంలో మొట్టమొదటి దేశవ్యాప్త విద్యాఋణం పథకం 1962లో ప్రారంభమైంది. కాని వడ్డీతో చెల్లించే విద్యా ఋణాల పథకం 1991లో ప్రారంభమైంది. (ఎల్.పి.జి విధానాలు) 2015-16 బడ్జెట్‌లో "విద్యా లక్ష్మి" అనే ఋణ సదుపాయాల పథకం, స్కాలర్‌షిప్స్ ప్రవేశపెట్టబడ్డాయి. ఎప్పుడైతే ప్రభుత్వాలు తమ బాధ్యత నుండి తప్పుకుంటున్నాయో, అట్టి పరిస్థితిలో మాత్రమే విద్యార్థులు గత్యంతరం లేక విద్యాఋణాల వైపు మళ్ళుతున్నారు. అయినప్పటికీ ప్రైవేటు విద్యాసంస్థలలో పెరుగుతున్న ఖర్చును నియంత్రించేందుకు ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేయటం లేదు. దీనికితోడు ప్రైవేటు విద్యాలయాలు, బ్యాంకులు విద్యార్థులను అప్పుల ఊబిలో బిగించివేయటం గమనార్హం. వీటి పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయనేది ఆందోళన కలిగించే అంశం. మొదటిగా విద్యా ఋణాలు అనేవి 100 శాతం ఉపాధి కల్పించే మార్గాలుగా విద్యాలయాలు ప్రచారం చేస్తున్నాయి. కాని అటువంటి అవకాశాలు దొరకకపోవటం లేదా దొరికినా వారి అర్హతకు తగిన ఉద్యోగాలు రాకపోవటం, తక్కువ వేతనాలు అందటం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. తాము మోసపోయామని ఆలస్యంగా గ్రహించిన విద్యార్థులు తమ కుటుంబాల ఆస్తులు అమ్ముకొని ఋణాలు చెల్లించే పరిస్థితి కూడా కనిపిస్తోంది.

విద్యారంగ ప్రైవేటీకరణ పెరిగే కొద్ది ఫీజుల భారాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. దీనితో విద్యా ఋణాలు తీసుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. కాని ఇటీవల కాలంలో ఆర్థిక సంక్షోభం పెరగటం వలన, ప్రజల ఆదాయ వనరులు కుంచించుకు పోతుండటం వలన విద్యా ఋణాలు తీసుకునే వారి సంఖ్య స్వల్పంగా తగ్గుదల చూపిస్తోంది. 2015 మార్చికి 3.34 లక్షల మంది విద్యార్థులకి ఋణాలు ఇవ్వగా ఆ సంఖ్య మార్చి 2019 కి 2.5 లక్షలకు తగ్గిపోయింది.గత 5 సంవత్సరాలలో విద్యా ఋణాలు చెల్లించలేని వారి సంఖ్య రెండింతలు అయ్యింది. దీని వలన ఋణాలివ్వటానికి బ్యాంకర్లు కూడా తక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. విద్యా ఋణాలు దాదాపు 25 శాతం తగ్గిపోయాయి. కాని చెల్లించలేని వారి సంఖ్య పెరుగుతూనే ఉంది.జాతీయ బ్యాంకుల అసోసియేషన్ చేసిన ఒక సర్వే ప్రకారం ఎన్.పి.ఎం శాతం మార్చి 2016కి 7.3 శాతం ఉండగా, 2017కి 7.67 శాతం, 2018కి 8.97 శాతానికి పెరిగిందని తెలిపింది.

అసలు ఈ ఋణాల పరిధి ఎలా ఉందో పరిశీలిద్దాం. 2000 సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఇచ్చిన ఋణాలు సుమారు రూ. 300 కోట్లు ఉండగా, 2017-18 సంవత్సరానికి అది రూ. 71,724 కోట్లకు చేరింది. ఈ ఋణాల మొత్తంలో 8.5 శాతం ఋణాలు నాలుగు లక్షల రూపాయలు మాత్రమే. దేశంలో సగటు ఋణాల పరిధి రూ. 9.6 లక్షలు, దాదాపు ఇదే పరిస్థితి 2020 సంవత్సరంలో కూడా ఉంది. విద్యా ఋణాలు తగ్గుదల 2017లో 3.3 శాతం, 2018లో 4.7 శాతం, 2019లో 5.6 శాతం ఉంది. బ్యాంకులలో నిరర్థక ఆస్తుల విలువ, ఋణ ఎగవేతదారులు ఎక్కువ అవటం వలన విద్యా ఋణాల ప్రమాణం కొద్దిగా తగ్గింది. కాని ఇప్పటికే అది ఏ స్థాయికి పెరిగిందో పైన పేర్కొన్న అంకెలే సాక్ష్యాధారాలు.

ఋణాలు చెల్లించలేని వారిసంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రైవేటు బ్యాంకుల వారికి విద్యా ఋణాలపై ఆసక్తి తగ్గిపోతున్నది. ఇతర ఋణాలలో వచ్చే లాభాల కన్నా ఇవి తక్కువ కావటంతో ఆసక్తి మరింత తగ్గింది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 91 శాతం విద్యార్థులు ప్రభుత్వరంగ బ్యాంకుల నుండే ఋణాలు పొందుతున్నారు. నిరర్థక ఆస్తులు గృహ ఋణాలలో 0.5 శాతం, టూ వీలర్స్‌లో 2 నుండి 3 శాతం, వ్యాపార వాహనాలలో 3 నుండి 4 శాతం ఉంది. విద్యా ఋణాలలో ఇది చాలా ఎక్కువ శాతంలో ఉంది. కొన్నిసార్లు ప్రభుత్వరంగ బ్యాంకులలో ఉన్న కఠిన నిబంధనల వలన విద్యార్థులు ఎక్కువ


epaper.prajasakti.com

# ఇంటి నుండి పని: మహిళల సమస్యలు

**అశ్వని దేశ్‌పాండే**



రచయిత్రి సోనేపట్‌లోని అశోకా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు

కోవిడ్ మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంటి నుండి పనిచేయడం చాలా రంగాలలో సర్వసాధారణం అయింది. అయితే దాని ప్రభావం మహిళలు, పురుషులపై సమానంగా ఉందా అనేది ఒక ప్రశ్న?అలాగే మహిళలలో వివిధ తరగతులపై దాని ప్రభావం ఎలాగుంది? పని ప్రదేశం, పని యొక్క అసంఘటిత స్థాయి వగైరాలపై ఏర్పడే పర్యవసానాలు ఎలాగుంటాయి?

కోవిడ్ మహమ్మారి ఆవరించడం, ఫలితంగా ఏర్పడ్డ లాక్‌డౌన్ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో పనిలో, జీవనంలోని అన్ని పార్శ్వాలను అతలాకుతలం చేసింది. ఈ చర్యలు మహమ్మారి ఉన్నంతవరకు లేదా సరైన వ్యాక్సిన్ కనుగొనే వరకు ఉంటాయి లేదా మహమ్మారి విజృంభించి నప్పుడల్లా ఇటువంటి పరిస్థితులు- పెరగగానే లాక్ డౌన్ విధించడం, కాస్త తగ్గిన తరువాత కొంత వెసులుబాటు కల్పించడం - మళ్ళీ మళ్ళీ ఏర్పడుతూనే ఉంటాయన్నది ఇప్పుడు స్పష్టంగా అర్థం అవుతున్నది.

కోవిడ్ వలన వచ్చిన మార్పులన్నిటిలో ఇంటి నుంచి పనిచేయడం అన్నది ప్రపంచ వ్యాప్తంగా అమలయింది. పనిచేసే వారిలో ఎక్కువమంది ఉద్యోగాలు వదులుకోవలసిన అవసరం లేకుండా జీతాలు తీసుకుంటూ ఇంటి నుండి పనిచేసే అవకాశం కలగడం అదృష్టం. అయితే ఇలా పనిచేయటంలో వచ్చిన మార్పు ప్రభావం మహిళలు, పురుషులపై సమానంగా ఉంటుందా అన్నదే ప్రశ్న. పని స్వభావంపైన, సంఘటిత రంగం, అసంఘటిత రంగం, పనిచేస్తున్న వర్గం తదితరాలపై ఆ తేడా ఎలా ఉంటుందో విశ్లేషించుకోవాలి. ప్రతిఫలం పొందుతూ ఇంటి బయట చేసేపని ఇప్పుడు ఇంటి లోపలికి వచ్చింది. ఆ పని ప్రతిఫలం లేని ఇంటి పని పై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుంది? నేను భారతదేశంలోని పరిస్థితుల ఆధారంగానే ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతాను. అయితే అంతర్జాతీయంగా వ్యక్తమౌతున్న అనుభవాలను కూడా ప్రస్తావిస్తాను.

అయితే ఈ సమస్యలపై చర్చ కేవలం మధ్య తరగతి ఉద్యోగులను దృష్టిలో పెట్టుకునే చేయడం లేదు. అన్నిరకాల వృత్తులలో ఉన్నవారిని దృష్టిలో పెట్టుకుని చేస్తున్నాను. మహిళల పనిలో ఉన్న అనేక పార్శ్వాలను గమనంలో ఉంచుకునే చేస్తున్నాను. తద్వారా మహిళలు చేస్తున్న 'ఇంటి నుండి పని' అంశంపై చర్చను విస్తృత పరచాలనుకుంటున్నాను. ఇదివరకే ఉన్న పరిస్థితులు, కోవిడ్ -19 వాటిపై ఏ విధమైన ప్రభావాన్ని చూపించింది అన్న అంశాన్ని మొదటిగా చర్చిస్తాను. ఆ తరువాత పని ప్రదేశం నుండి ఇంటికి పని మారడం గురించి చర్చిస్తాను. పరిహారం పొందే వృత్తి పని, పరిహారం లేని ఇంటి పనులు, పిల్లల పెంపకం ఇంట్లో కలగలసి పోవడం వలన ఆ రెంటికి మధ్య ఉన్న సంబంధాలలో వచ్చిన మార్పును ఒక సారి పరిశీలిద్దాం.

### పరిహారం లేని పని ఇంటి పని ఒకటేనా ?

అవును. కాదు కూడా. అభివృద్ధి చెందిన దేశాలలో పని అంటేనే ప్రతిఫలం చెల్లించేదని అర్థం. వంట ,అంట్లు తోమడం, బట్టలుతకడం, ఇల్లు సర్దుకోవడం, బజారు పని, పెద్దలను చూసుకోవడం, పిల్లల సంరక్షణ వగైరాలకు పరిహారాన్ని నిర్ణయించటం సాధ్యం కాకుండా ఉంది. ఎందుకంటే ఈ ఇంటిపనులు ప్రతి రోజూ చేయాల్సినవి. ఇందులో అధికభాగానికి ఏ రకమైన పరిహారం ఉండదు. పైగా ఈ పనులకు ద్రవ్యరూపంలో విలువ కట్టాలన్న సూచన అసాధ్యమైనదిగాను, అనవసరమైనదిగాను పరిగణించబడుతున్నది.

కానీ వాస్తవంలో ఈ పనుల వల్లనే( "పునరుత్పత్తి శక్తి అని ఫెమినిస్టులు దీనినే అంటుంటారు) మహిళలు అసమానతలలోకి నెట్టబడుతున్నారు. ఇంట్లో పురుషులు చేసే పనికి మహిళలు చేసే పనికి హస్తిమశకాంతం ఉంటుంది. ఈ ఇంట్లో పనుల మూలంగానే మహిళలకి బయట చేసే పనికి తక్కువ వేతనాలు చెల్లిస్తుంటారు. వేతనాలలో తేడాను మహిళల సమర్థతలో తేడాగా భావిస్తుంటారు. అదే పురుషులైతే ఆయా స్థాయిలలో తాము చేసిన పనికి ప్రతిఫలం పొందుతుంటారు. ఉదాహరణకి పెళ్లయిన మగవారు పెళ్లికాని మగవారి కన్నా ఎక్కువ జీతం పొందుతారు. పిల్లలున్న మగవారి జీతం మరికాస్త పెరుగుతుంది. అమ్మతనం పొందడానికి అమెరికా మహిళలు ఏడాదికి 16,000 డాలర్ల వేతన నష్టం భరించవలసి వస్తుందని అంచనా వేయబడింది. సమాజంలోని తరువాతి తరానికి అవసరమైన శ్రమశక్తిని తయారు చేయడం, వృద్ధి చేయడం కోసం మహిళలు పునరుత్పత్తి చేయవలసి వస్తున్నది. కానీ ఆ భారాన్ని వారు మాత్రమే భరించ వలసివస్తున్నదని మహిళల హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహిస్తున్న వారు వాదిస్తున్నారు. 2019 లో మహిళలు చేసే పరిహారం లేదా ఎటువంటి ప్రతిఫలం లేని పునరుత్పత్తి పని విలువ 10.9 లక్షల కోట్ల డాలర్లు ఉంటుందని అంచనా. అంటే 2018 లో అతి పెద్ద 50 కంపెనీలు సంపాదించినంత అన్నమాట. డబ్బురూపంలో ఇలా చూపడానికి కారణం సమాజంలో ఎంత విలువైన ప్రతిఫలం లేని పని జరుగుతున్నదో తెలియచేయటానికి మాత్రమే.

అభివృద్ధి చెందుతున్న దేశాలలోని మహిళలు పరిహారం లేని పునరుత్పత్తి పనికి తోడుగా 'ప్రతిఫలం' ఇవ్వని ఉత్పత్తి పనిని కూడా చేయవలసి వస్తున్నది. 'ఉత్పాదక' పని అంటే ఏమిటి? 'ఉత్పాదక పని' అంటే జాతీయ గణాంక వ్యవస్థలో ఉత్పాదక పని పరిధిలో ఉన్న పనులు. లేదా స్థూల జాతీయోత్పత్తిని లెక్క కట్టేందుకు తీసుకునే పనులు. ఇంకా సులభంగా చెప్పాలంటే 'పని' అంటే మగవారు చేసే పని. మహిళలు పరిహారం చెల్లించబడని ఉత్పాదక



epaper.prajasakti.com

> **"కోవిడ్-19 సంక్షోభంలో ప్రకటించిన ప్యాకేజిలో ప్రభుత్వం విద్యా ఋణాల గురించి ఎటువంటి ప్రస్తావన తేలేదు. సాధారణ ఋణాలను రిజర్వుబ్యాంకు కొన్నాళ్ళు వాయిదా వేసినా వడ్డీ బాదుడు కొనసాగుతుండటం వలన విద్యార్థులు దిక్కూ మొక్కూ లేని వారయ్యారు."**

వడ్డీ అయినా ప్రైవేటు బ్యాంకులలో ఋణం పొందుతున్నారు. 4 లక్షల వరకు పెద్దగా షరతులు లేవు కాబట్టి ఎక్కువ ఋణాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఏడున్నర లక్షలు దాటిన వాటికి షరతులు, తనఖాలు ఉంటాయి. సాధారణంగా ఋణం చెల్లించే కాలం 5 నుండి 7 సంవత్సరాల దాకా ఉంటుంది. కొన్ని సార్లు 15 సంవత్సరాలు వరకు పెంచుతారు. భారతీయ స్టేట్ బ్యాంక్ ఋణ చెల్లింపు కాలం 12 సంవత్సరాలు ఉంటుంది. వడ్డీరేటు 9.33 శాతం నుండి 11.50 శాతం వరకు ఉండగా, ప్రైవేటు బ్యాంకులలో 15 శాతం వరకు ఉంటున్నది.

ఇదిలా ఉంటే విదేశాలలో విద్యా ఋణాలు చాలా తక్కువ శాతం వడ్డీతో లభిస్తున్నాయి. స్వీడన్‌లో 0 శాతం, స్విట్జర్లాండ్ 0.75 శాతం, డెన్మార్క్ 0.60శాతం ప్రతికూల వడ్డీరేట్లు ఉండగా అమెరికాలో 2.75శాతంగా ఉంది. ఇటీవలనే ఒక ప్రకటనలో అమెరికా ప్రభుత్వం జూలై తరువాత వడ్డీ రేట్లు 2.75 శాతం ఉంటుందని, అలాగే 10 వేల డాలర్ల కన్నా తక్కువ ఉన్న ఋణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. అమెరికన్ విద్యాశాఖ విద్యా ఋణాల నెలసరి కిస్తీలను అక్టోబర్ వరకు వాయిదా వేయాలని, వడ్డీని రద్దు చేయాలని సూచించింది. ఇది కాక కొన్ని ఋణాలు ప్రభుత్వమే కడుతుందని ప్రకటించారు. అలాగే వచ్చే సంవత్సరం వరకు వారానికి 600 డాలర్లు నిరుద్యోగ భృతిగా ఇస్తామని తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్ కాలేజీలలో ఉన్న ఋణాలు అన్ని రద్దు చేస్తానని అమెరికా అధ్యక్ష ఎన్నికల అభ్యర్ధి జో బిడెన్ ప్రకటించారు. కానీ మనదేశంలో ఇంతవరకు ఎవరూ విద్యార్థుల ఋణాల రద్దును గురించి మాట్లాడిన వారు లేరు.

కోవిడ్-19 సంక్షోభంలో ప్రకటించిన ప్యాకేజిలో ప్రభుత్వం విద్యా ఋణాల గురించి ఎటువంటి ప్రస్తావన తేలేదు. సాధారణ ఋణాలను రిజర్వుబ్యాంకు కొన్నాళ్ళు వాయిదా వేసినా వడ్డీ బాదుడు కొనసాగుతుండటం వలన విద్యార్థులు దిక్కూ మొక్కూ లేని వారయ్యారు.

మన దేశంలో ఒక్క కేరళ రాష్ట్రంలోనే వార్షిక ఆదాయం 6 లక్షల రూపాయల కన్నా తక్కువ ఉన్న కుటుంబాలలో "విద్యా ఋణాల చెల్లింపు" పథకం ద్వారా విద్యా ఋణాలలో కొంత భాగం ప్రభుత్వమే జమ చేస్తోంది. ఢిల్లీ ఐఐటి సంస్థ విద్యా ఋణాలలో ఆస్ట్రేలియా మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవలసిందిగా కేంద్ర మానవ వనరుల శాఖను అభ్యర్ధించింది. **HELP** (హయ్యర్ ఎడ్యుకేషన్ ఋణ పథకం) ప్రకారం ఆస్ట్రేలియాలో విద్యార్థులు ఉపాధి సంపాదించుకున్నప్పటి నుండే ఋణ వాయిదాలు కట్టుకోవచ్చు.

విద్యా ఋణాల పథకాలు మనదేశంలో సాధారణ ప్రజానీకం ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయి. జాతీయ సర్వే ప్రకారం 2018-19లో కేవలం 26.3 శాతం మంది యువతే,3.74 కోట్లమంది ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. దేశంలో 993 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఇందులో 385 ప్రైవేటువి. మొత్తం 39,931 కాలేజీలలో 77.8 ప్రైవేటువి. యువత వాటిని అందుకోలేకపోతున్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 6 శాతం విద్యకోసం ఖర్చు పెట్టాలి అని విద్యావంతులు, మేధావులు కోరుతున్నారు. ఈ సంవత్సర కేటాయింపు కేవలం 3.1 శాతం అంటే రూ. 99,311 కోట్లు. ఇందులో ఉన్నత విద్యకు ఖర్చు చేసేది రూ. 39,311 కోట్లు మాత్రమే. ఇది ఎంతమాత్రం విద్యా ఋణాల సంక్షోభాన్ని నివారించలేదు. ఈ కేటాయింపులను రెండింతలు చేస్తే తప్ప మన దేశంలో యువత ఉన్నతవిద్యను అభ్యసించలేని దుర్భర పరిస్థితి నెలకొని ఉంది.

**(అనువాదం: ఎల్.ఎస్.భారవి)**

# పేదరికాన్ని పెంచుతున్న ప్రయివేటు వైద్యం

(11వ పేజీ తరువాయి)

అధికంగానే వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వరంగంలో జరిగే పరీక్షల కన్నా తమ దగ్గర నాణ్యతా ప్రమాణాలు ఎక్కువ ఉంటాయని వారు ప్రచారం చేస్తుంటారు. కాని వాస్తవమేమిటంటే నివాసయోగ్యమైన రూములు, బెడ్లు వంటి సౌకర్యాలలో నాణ్యత ఉంటుంది కాని, వైద్య ప్రమాణాల స్థాయిలో మాత్రం నాణ్యత తగినంతగా లేదని తెలుస్తోంది. అలాగే బీమా ద్వారా వైద్యం పొందే వారి శాతం 6.58 కి మించి లేదు. ఇది చాలా ఆందోళన కలిగించే అంశం. ఎందుకంటే పన్నుల ఆధారంగా నెలకొల్పబడిన వైద్య, ఆరోగ్య చికిత్సా విధానం నుంచి బీమా ఆధారిత చికిత్సా విధనం వైపు మళ్ళుతున్న దిశలో మన దేశం వెళుతోంది. పేద, అట్టడుగు వర్గాల ప్రజలకు బీమా పథకాలు అందుబాటులో ఉండవు. భారతదేశం ఆరోగ్య సేవల రంగంలో సంపూర్ణ మార్పులకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఆరోగ్య బడ్జెట్‌కి నిధుల కేటాయింపులు పెంచటం లేదు. దీనికి తోడు ప్రైవేటు రంగంలో అధికవ్యయంతో కూడిన వైద్యం, బీమా సౌకర్యం ఎక్కువ మందికి లేకపోవటం రానున్న కాలంలో పేద, మధ్య తరగతి ప్రజానీకానికి తీవ్రమైన నష్టం వాటిల్లనుంది.

ప్రపంచంలోని అన్ని దేశాలలో ప్రైవేటు రంగం, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నది. మన దేశం అందుకు అతీతం కాదు. ప్రభుత్వరంగ ఆరోగ్య సేవలలో ఉన్న లోపాలను సరిదిద్దటానికి తగిన కృషి చేయాలి. ప్రైవేటు సేవలలో కొన్నింటిని ప్యాకేజీలుగా ప్రభుత్వం కొనుగోలు చేసినా లేక సర్దుబాటు చేసినా, అంతిమంగా అది ప్రభుత్వ ఆరోగ్య బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. కాని ద్రవ్యలోటు ప్రభావంతో ఆరోగ్య బడ్జెట్‌పై ఉన్న ఒత్తిడుల వలన ప్రైవేటు రంగాన్ని పూర్తిగా విస్మరించలేరు. భౌగోళిక మార్పులు, వలసలు, వృద్ధులైన వారిసంఖ్య పెరుగుదల, వ్యాధుల తీవ్రత, చికిత్సా భారాలు పెరుగుదల నేపథ్యంలో రెగ్యులేటరీ పద్ధతులను ప్రవేశపెట్టి, ప్రైవేటు రంగ ఆరోగ్య సేవలను మొత్తం ప్రజలందరికి నాణ్యమైన రీతిలో, అందుబాటు ధరలలోకి వచ్చేలా నియంత్రించి ముందుకు సాగటమే దీనికి ఏకైక పరిష్కారం.

**(అనువాదం : ఎల్.ఎస్.భారవి)**



epaper.prajasakti.com

> **"కాబట్టి సంక్షోభం వచ్చినప్పుడు అది అందరిపై ఒకేలా ప్రభావం చూపదు. కోవిడ్ చాలా సమానత్వం పాటిస్తోంది అని చెప్పడం చాలా చెత్తవాదన. ఆకలితో వున్న వారిపై, కరువు పరిస్థితులకు దగ్గరగా ఉన్నవారిపై, అనారోగ్యంతో ఉన్న వారిపై, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులో లేనివారిపై, కనీస సదుపాయాలు అందు బాటులో లేనివారిపై కోవిడ్ తీవ్ర ప్రభావం చూపుతోంది."**

పనులు ( సాధారణమైన ఇంటిపని , సేవలు కాక చేసే పనులు) గృహ పరిశ్రమలు, పొలం పనులు, పశుపోషణ కోళ్ల పెంపకం, మార్కెట్లో అమ్మకానికి చిన్న చిన్న వస్తువులు తయారు చేయడం, కుటుంబం నడుపుతున్న కొట్లలో పనిచేయడం, కుటుంబానికి సంబంధించిన పండ్లతోటల్లో చేసే పని వగైరా. ఈ పనులన్నీ కుటుంబానికి ఆర్థికంగా ఆదాయాలు సమకూర్చి పెట్టేవే. ఈ పనులన్నీ మహిళలు చేస్తారు. కానీ వీటికి వారికేవిధమైన ప్రతిఫలం ముట్టదు సరికదా గుర్తింపు కూడా ఉండదు. ఇవే పనులు బయటి మనిషిని పెట్టుకుంటే ఎంత అవుతుందో అంచనా వేసుకుంటే మహిళలు చేసే పని విలువ అర్థం అవుతుంది.

### సంప్రదాయంగా ఇళ్లలో చేసే ప్రతిఫలం లేని పని

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో మహిళలు 'ఇంటి నుండి చేసే పని' ప్రతిఫలం లేని పనే. వారు సాధారణంగా గృహ పరిశ్రమలలో, ఇంట్లో పని చేస్తుంటారు. మహిళలు చేసే ఇంటిపనికి అదనంగా కుటుంబం నడిపే ఇతర ఉత్పాదక కార్యక్రమాలలో వారూ భాగస్వాములే. కానీ ఎవరినయినా 'మీరు ఏమయినా పనిచేస్తారా అని అడిగితే 'లేదనే' సమాధానం చెపుతారు. అందుకు కారణం సమాజం మహిళల శ్రమకు తక్కువ స్థానం ఇవ్వటమే.

నేను ఈ పనినంతటినీ 'గ్రే జోన్ 'గా పిలుస్తాను. ఈ పనులు చేసేవారిని ప్రభుత్వం గాని, విధాన నిర్ణేతలు గాని శ్రామికులుగా గుర్తించరు. వారు పనిచేసినా పనిచేసేవారిగా గుర్తించబడరు. ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలేవీ వీరికి వర్తించవు. (వేతన చట్టం, పరిహార చట్టం, పని గంటలు, ఇతర ప్రయోజనాలు, రక్షణ వలయాలు, బీమా , మాతృత్వ లేదా అనారోగ్య సెలవులు వగైరా ). ఇప్పుడొచ్చిన మహమ్మారి పోయినా ఈ పనులన్నీ ఇలాగే కొనసాగుతూనే ఉంటాయి.

### ప్రతిఫలంతో కూడిన ఇంటి నుండి పని చేసే కార్మికులు

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇంటి నుండి పనిచేయడం తరతరాలుగా అలవాటులో ఉన్నదే. అది కనిపించని ప్రతిఫలం చెల్లించని మరో రకం పని ఉంది. ప్రపంచవ్యాప్తంగా లేదా దేశమంతటా ఆ పని సరఫరా గొలుసులో అంతర్భాగంగా ఉంటుంది. వారే ఇంటి నుండి పని చేసే వారు. కొన్ని సంస్థలు వారిని సంప్రదిస్తాయి. (దేశీయ, లేదా విదేశీ), పీస్ రేటుకు బేరాలు కుదుర్చుకుంటారు. వస్త్ర పరిశ్రమ ఇందుకు ఉదాహరణ. అత్యంత తక్కువ చెల్లింపులు చేసేది ఈ పరిశ్రమే. బొత్తాలు కుట్టడం, చేతులు కుట్టడం, చేతిపని చేయడం, ఎంబ్రాయిడరీ చేయడం వగైరా. మరో గృహ పరిశ్రమ అప్పడాలు, పచ్చళ్ళ, బీడీలు, బొట్టు బిళ్ళలు, నేత వగైరా ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసరాలను తయారు చేయడం. ఇటువంటి పనులు చేసే మహిళలు 3.7 కోట్లమంది ఉంటారని అంచనా.

ఈ మహిళలందరూ ఇంటి నుండే పనిచేస్తారు. ఇంటి బాధ్యతలు చూసుకుంటూ ఇటువంటి పనులు చేయడం వారికి సులువుగా ఉంటుంది. ఆ పనులకు చెల్లింపులు తక్కువగా ఉన్నా, ఏ రకమైన రక్షణలు లేకపోయినా, గ్రామీణ ప్రాంతాలలో, చిన్న చిన్న పట్టణాలలో ఇటువంటి పనులే ఉంటాయి.

ఇటువంటి పనులు చేసే వారిపై ఈ మహమ్మారి ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుంది? ఆర్థిక కార్యకలాపాలు బాగా తగ్గిపోవడంతో ఈ రకమైన పనులు చేసేవారికి ఆ కాస్త పనులు కూడా దొరకని పరిస్థితులు ఏర్పడ్డాయి. వారి ఆదాయాలు పడిపోతాయి. ఇప్పటికే పెద్ద నోట్లరద్దు, జి ఎస్ టి వలన స్థూల జాతీయోత్పత్తి తగ్గి, గిరాకీ తగ్గడం వలన వారిపై వాటి ప్రభావం తీవ్రంగా ఉంది. ఇప్పుడీ మహమ్మారి తెచ్చిపెట్టిన మాంద్యంతో పనులు దొరకడం మరింత కష్టమవుతుంది. ముఖ్యంగా వారు పని చేసి పెడుతున్న పరిశ్రమలు నష్టాలలో కూరుకు పోతే పరిస్థితి మరింత విషమిస్తుంది.

### కొత్తగా ఇంటి నుండి పని చేయడం మొదలు పెట్టినవారు

మహమ్మారి రావడం, తద్వారా లాక్‌డౌన్ ప్రభావానికి గురైన పనివారి గురించి ఇప్పుడు మనం చర్చించుకుందాం. వీరంతా నియత ఉద్యోగులే. కార్పొరేట్ లేదా ప్రభుత్వ సంస్థలలోనో పనిచేస్తున్నవారు. విద్య సంస్థలలో, చిల్లర వ్యాపారాలలో, రవాణాలో, ఆర్థికరంగం వగైరా రంగాలలో పనిచేస్తున్న వారు.

ఇంటి నుండి పని చేయవలసి రావడంతో భారతదేశంలో లింగ ఆధారంగా జరిగే అణచివేత ఏ విధంగా మార్పు చెందిందో అధ్య యనం చేయవలసి ఉంది. దక్షిణ ఆసియాలో, ముఖ్యంగా భారతదేశం, పాకిస్థాన్‌లలో ఇంటి పనులు చేయడం మగవారికి అలవాటే లేదు. ఇంటి పనులలో మగవారు పాలు పంచుకోవడం చాలా తక్కువ. ఇప్పుడీ లాక్‌డౌన్‌లో పనివారు లేనికారణంగా మధ్య తరగతిలో నయినా ,ఇంటి నుంచి పని చేయవలసి రావడంతో ఇంతకు ముందు ఇంటిపని చేయని మగవారు కొంత అదనంగా ఇంటిపని బాధ్యతను తీసుకుంటారో లేదో చూడాల్సి ఉంది.

భారతదేశంలో ఇందుకు సంబంధించిన గణాంకాలు రాలేదు. కాని అమెరికాలోనివి అందుబాటులో ఉన్నాయి. 2020 ఏప్రిల్ 9–10 తేదీల మధ్య అమెరికాలో ఒక సర్వే చేయబడింది. ఇందులో 2,200 మంది పాల్గొన్నారు. తల్లితండ్రులిద్దరు ఇంటి నుండే పని చేస్తున్నప్పటికీ ఇంటిపని బాధ్యత సమానంగా పంచుకోడం జరగలేదని ఈ సర్వేలో తేలింది. 70 శాతం మంది మహిళలు ఇంటి బాధ్యత అంతా తమదే అని చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగించింది. 66 శాతం పిల్లల పెంపకంలో ప్రధాన బాధ్యత తమదే అన్నారు. ఇవి సాధారణ పరిస్థితులలో ఉండే అభిప్రాయాలే. అంటే ఇంటి పని, పిల్లల పెంపకం అనే మహిళల అదనపు బాధ్యతలు నేటికీ కొనసాగుతున్నాయన్నమాట. తండ్రి కూడా ఇంటి నుండే పనిచేస్తున్నందు వలన తల్లి పనులేవీ తగ్గలేదు.

ఇంటి నుండే స్కూల్ నడపడం వలన తల్లిపై పిల్లల చదువు బాధ్యత అదనంగా పడింది. 80 శాతం మహిళలు తమ భర్తల కన్నా తామే పిల్లల చదువుకు ఎక్కువ సమయం కేటాయించవలసి వస్తుందని చెప్పారు. 46 శాతం మగవారు తాము అదనపు బాధ్యతలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కానీ 3 శాతం మంది మహిళలే ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. పురుషులు, స్త్రీలలో ఎవరెక్కువ ఇంటిపని చేస్తున్నారన్న విషయంలో ఒకరి అభిప్రాయ


epaper.prajasakti.com

లతో మరొకరివి సాధారణంగా కలవడం లేదు. కానీ మగవారు తాము చేసే పనిని ఎక్కువ చేసి చూపుతున్నారని పరిశోధనలు తెలియచేస్తు న్నాయి. కానీ వాస్తవానికి మహిళలు చేసే పనే ఎక్కువ.

ఈ మహమ్మారి కారణంగా ఏర్పడ్డ మరో ముఖ్యమైన పరిస్థితి భౌతిక దూరం పాటించడం. దీని వలన ఇప్పటి వరకు పిల్లలు పక్కింటి వారు, ఆయాలు, బేబీ సిట్టర్లు, ఇరుగు పొరుగు పిల్లలతో లేదా అమ్మమ్మ, తాతయ్యల దగ్గరో గడప గలిగే వారు. ఇప్పుడా విధంగా గడిపే అవకాశం లేదు. ఇంక అటువంటి పరిస్థితిలో తల్లిదండ్రులపై ఆ ఒత్తిడి బాగా ఉంటుంది. ఈ ఒత్తిడి ఇంటి పనిని స్త్రీ పురుషులిద్దరూ సమానంగా పంచుకునే సామాజిక వ్యవస్థకు దారి తీస్తోందా ? సందేహమే మరి.

చాలా సమాజాలలో మహిళలు పిల్లల పెంపకానికి, సంరక్షణకు ప్రధాన బాధ్యత తీసుకుంటారు. ఇదివరకు వచ్చిన మహమ్మారుల కాలంలో బడులు మూసివేయడం వలన ఆ ప్రభావం స్త్రీ పురుషుల మీద వేరువేరుగా ఉంటుందని గమనించాము. పిల్లల బాధ్యత పెరగగానే ఉత్పత్తిలో వారి భాగస్వామ్యం తగ్గిపోతుంటుంది. చేసే పని గంటలు తగ్గుతాయి. లేదా ఆదాయాలు పొందే పని నుండి వైదొలగుతారు. మహమ్మారిని నియంత్రించే కాలంలో బడులు మూత పడడం వలన ఆ ప్రభావం మహిళలపై తీవ్రంగా ఉంటుంది. భారతదేశంలో ఆరోగ్యశాఖలో మహిళలే ఎక్కువగా ఉంటారు. బడులు మూత పడడం వలన వారు గనక ఇంట్లో పిల్లలను చూసుకోడానికి సెలవులు తీసుకుంటే, ఎంతో అవసరమైన పరిస్థితులలో వారి సేవలు అందుబాటులో ఉండకపోవడం వలన ఆ ప్రభావం మొత్తం ఆరోగ్య వ్యవస్థపై పడుతుంది. లాక్‌డౌన్ అంటే చాలామంది కార్మికులకు పని ఉండకపోవడం వలన వేతనం కూడా ఉండదు

మహిళలైనా , పురుషులైనా ఆర్థికవ్యవస్థ మూత పడితే చాలామంది కార్మికులకు ఆదాయాలు ఉండవు. మొత్తం అసంఘటితరంగం లోని పనులు- ప్రత్యక్షంగా అసంఘటిత రంగంలోనివి లేదా సంఘటితరంగంలో ఉన్న అనియత పనులు – లాకౌడౌన్ అనగానే మూత పడతాయి. దీని ప్రభావం స్త్రీలపైన, పురుషుల పైన ఎలా ఉంటుందో తెలుసుకునే ఆధారాలు ఏమయినా ఉన్నాయా?

మాంద్యం ప్రభావం ఉద్యోగాలపై ఉంటుంది. ఇది సర్వ సాధారణంగా వివక్షతో కూడి ఉంటుంది. అయితే అది ఒకే రకంగా ఉండదు. ఉదాహరణకి అమెరికాలో సంభవించిన మాంద్యంలో మహిళలకన్నా పురుషులే

> ❝ తెలంగాణ, హర్యానా, పంజాబ్ లాంటి రాష్ట్రాలలో రైతులను తిరిగి వాణిజ్య పంటలు వేయాల్సిందిగా ప్రభుత్వాలు తప్పడు సలహాలు ఇస్తున్నాయి. ఇది ఆత్మహత్యా సదృశ్య మే అని నేను చెప్పదలచుకున్నాను. ఇది చాలా ప్రమాదకరం. మనం ప్రతి ఒక్కరినీ ఆహార ధాన్యాలే పండించమని చెప్పాలి. కనీసం కొంత భాగమైనా వారి కుటుంబ అవసరాల కోసం, వ్యవసాయ కూలీల కోసమైనా పండించాలని చెప్పాలి.❞



ఎక్కువ ఉద్యోగాలు కోల్పోయారు. కానీ ఈ సారి మాత్రం మహిళలే ఎక్కువగా ఉపాధి కోల్పోయే అవకాశాలు ఉన్నాయి. ఈ సారి మూతబడుతున్న వ్యాపారాల స్వభావం వలన అలా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పైగా లాక్‌డౌన్ ఎప్పటికప్పుడు కొనసాగుతూనే ఉంటుంది. దీని కారణంగా కొన్ని సంస్థలు పూర్తిగా మూసివేయబడే అవకాశాలు ఉన్నాయి. రెస్టారెంట్లు , హోటళ్లు, మాల్స్ లాంటి పెద్ద పెద్ద వ్యాపారాలు, ఇతర చిల్లర కొట్లు , వినోదాన్నందించే సంస్థలు మూతపడుతున్నాయి. ఇళ్లలో పనిచేసేవారిని, ఆయాలను ,ఇల్లు శుభ్రపరిచేవారిని మాన్పిస్తున్నారు. ఈ అన్ని రంగాలలో ఎక్కువగా పనిచేస్తున్నది మహిళలే.

## భారతదేశంలో మహిళల పని

ఈ మహమ్మారి రాక మునుపు కూడా భారతదేశంలో మహిళా శ్రమశక్తి వినియోగం క్షీణించడం చూశాం. సరఫరా వైపు నుండి వస్తున్న సమస్యలను పరిశోధించవలసిన అవసరం ఉన్నా నా ఉద్దేశంలో గిరాకీ వైపు నుండి ఎదురౌతున్న సమస్యలను తెలుసుకోవలసిన అవసరం ఎక్కువగా ఉంది. దిగజారుతున్న మహిళల పరిస్థితులను ఈ మహమ్మారి మరింత దిగజార్చింది. భారతదేశంలో ఆరోగ్య రంగంలో ప్రధానంగా పనిచేసేది మహిళలే. ఆషా వర్కర్లు, అంగన్‌వాడీలకు వేతనాలు తగినంతగా ఉండవు. విపరీతమైన దోపిడీకి గురవుతుంటారు. వారికి స్వయం రక్షణ పరికరాలు కూడా లేవు. వైరస్ వ్యాప్తిని గుర్తించటం కోసం సర్వే జరపడానికి వెళ్ళేటప్పుడు వారిపై దాడులు జరుగుతున్నాయి. ఈ పని అత్యంత ప్రమాదకరమైన పని. పైగా దీనికి ఏ రకమైన పరిహారం కూడా లేదు.

మొత్తంగా చూస్తే మధ్యతరగతి ఉద్యోగులయినా, కింది తరగతి ఉద్యోగులయినా మహమ్మారి వ్యాప్తి వలన మహిళలు ఎక్కువగా నష్టపోతున్నారన్నది స్పష్టం. ఈ సంక్షోభాన్ని అధిగమించేటప్పుడు ప్రస్తుతం ఉన్న మహిళల పని పరిస్థితులు సమూలంగా మార్పుచెందాలి. శ్రామికశక్తిలో వారి భాగస్వామ్యం పెరగాలి. అదే సమయంలో వారు పనికి తగిన ప్రతిఫలం పొందగలగాలి. ప్రతిఫలం లేని ఇంటిచాకిరీ స్త్రీ పురుషులు సమానంగా పంచుకొనే పరిస్థితులు రావాలి. ముఖ్యంగా మహిళలు పనిచేసుకునేందుకు తగిన అవకాశాలు కల్పించబడాలి. చైతన్యవంతమైన, వివక్ష లేని విధానాలు రూపొందించబడాలి. ఇటువంటి మార్పులు వస్తే ఇంటి పనులలో కూడా మరింత సమానత్వం వైపుకు మారే అవకాశాలు ఏర్పడతాయని ఆశిద్దాం.


(అనువాదం: కె ఉషారాణి)



epaper.prajasakti.com

# ఉత్తరప్రదేశ్‌లో ఆటవిక పాలన

ఎ కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

యుపిలో యోగి ఆధిత్యనాథ్ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆటవిక పాలన సాగిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం పౌర సత్వ చట్టానికి సవరణలు చేసిన తర్వాత చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలలో పాల్గొంటున్న వారిపై దాడులు తీవ్రమైనాయి. ఒకవైపు ప్రభుత్వం అన్ని చట్టాలను ఉల్లంఘిస్తూ, మరోవైపు తన విధానాలను వ్యతిరేకిస్తున్న వారిపై చట్టవ్యతిరేకులని ముద్ర వేస్తున్నది. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న వారిని భయపెట్టటం కోసం ప్రజలకు నోటీసులు అందించటానికి, ఆస్తులు మొత్తం కోల్పోతారని వారిని బెదిరించటానికి పోలీసులు ఇల్లిల్లూ తిరుగుతున్నారు. ఈ నిరసనలలో పాల్గొన్నందుకుగానూ పోలీసులు ఒక రిక్షా డ్రైవర్‌కు విధించిన జరిమానాను అతను చెల్లించకపోవటంతో అతడిని జైలుకు పంపించారు.

రాష్ట్రంలో నేరాలను అణచేశామని యోగి ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలోని డొల్లతనాన్ని వికాస్‌దూబే ఘటన వెల్లడిస్తోంది. ఆ కరడుగట్టిన నేరస్తుడు అన్ని సాక్ష్యాలూ ఉన్నా ఇంతకాలం స్వేచ్ఛగా తిరగటంతో పాటు, ఎనిమిది మంది పోలీసులను కాల్చిచంపాడు. పోలీసులను హత్య చేసిన తర్వాత దూబే, అతని అనుచరులు కొందరు ఈ మధ్య జరిగిన ఎదురుకాల్పులలో మరణించారు. ఇన్ని కేసులున్న వికాస్‌దూబె బెయిల్‌పై బయటతిరగటంపైనా, దూబె, అతని అనుచరుల ఎన్‌కౌంటర్‌పైనా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలోని కమిషన్‌తో విచారణ జరిపించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో చట్టబద్ధ పాలన సాగటం లేదని, రాష్ట్రం నేరస్తులకు నిలయంగా మారిందని, ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులు నేరస్తులతో చెట్టపట్టాలు వేసుకొని తిరుగుతున్నారని ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

### వలస కార్మికుల పట్ల అమానవీయంగా వ్యవహరించిన ప్రభుత్వం

లాక్‌డౌన్ విధించిన తర్వాత ప్రభుత్వం వలస కార్మికుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరించింది. ఉదాహరణకు లాక్‌డౌన్ వలన వివిధ ప్రాంతాలలో చిక్కుకుపోయిన కార్మికులను వారి స్వంత గ్రామాలకు తరలించటానికి 1000 బస్సులు ఏర్పాటు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. బస్సుల జాబితా ఇవ్వమని ప్రభుత్వం కాంగ్రెస్‌ను అడిగింది. కాంగ్రెస్ ఇచ్చిన జాబితాలో అన్నీ బస్సులే లేవు. కొన్ని కార్లు, ఆటోలు తదితరాలు కూడా ఉన్నాయి. దానితో బస్సుల సంఖ్యపై తప్పుడు సమాచారం ఇచ్చారనే ఆరోపణ చేస్తూ కాంగ్రెస్ నాయకుడు అజయ్‌కుమార్ లల్లూను ప్రభుత్వం జైలుకు పంపింది. వలస కార్మికులను తరలించటానికి 90 వేల బస్సులున్నాయని తర్వాత యోగి ఆదిత్యనాథ్ ప్రకటించాడు. ప్రభుత్వం అన్ని బస్సులను సిద్ధం చేసినపుడు కాంగ్రెస్‌ను బస్సులను గురించిన వివరాలు అడగవలసిన అవసరం ఏముంది?

వలస కార్మికులకు ఆహారధాన్యాలు, వారి ఎకౌంట్లలో డబ్బును జమచేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. కాని ఉన్నావోలో జరిపిన ఒకసర్వేలో అక్కడకు తిరిగి వచ్చిన వలస కార్మికులు 89 మంది, సితాపూర్‌లో ఉన్న 36 మందిలో ఒక్కరు మాత్రమే తన బ్యాంకు ఎకౌంట్‌లో 1000 రూపాయల చొప్పున రెండుసార్లు జమ అయినట్లు చెప్పాడు. ముగ్గురు మాత్రమే ప్రభుత్వం ఇస్తున్న రేషన్ పొందినట్లు చెప్పారు. రైళ్ళలోనూ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రభుత్వ బస్సులలోనూ రానందున వారు ప్రభుత్వం ఇస్తున్న మొత్తాన్ని పొందటానికి అర్హులు కాదని అధికారులు చెప్పారు. రైళ్ళు, బస్సులు తిరగని పరిస్థితులలో వారు వాటిలో రావటం ఎలా సాధ్యమౌతుందని కూడా అధికారులు ఆలోచించలేదు. రాష్ట్రంలో ఉపాధి హామిచట్టం ప్రకారం పని కావాలని అడిగిన వారిలో మూడోవంతు మందికి కూడా ప్రభుత్వం పనులు కల్పించటం లేదు. పనులు చేసినవారిలో మూడోవంతు మందికి కూడా వేతనాలు చెల్లించలేదు.

### సిఎఎ వ్యతిరేక ఆందోళనకారులపై క్రూర నిర్బంధకాండ

సిఎఎ, ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మహిళల పట్ల దారుణంగా వ్యవహరించారు. వారిని పొట్టలో తన్నటం, చెప్పరాని చోట్ల కొట్టారు. అరెస్టు చేసి జైళ్ళలో పెట్టిన మహిళల పట్ల కనీస మానవత్వం కూడా చూయించలేదు. జైళ్ళలో మహిళలను కొట్టారు. వారి నైతికతను గురించి ప్రశ్నించటం ద్వారా అవమానించారు. వారు నేరస్తులని కోర్టులో రుజువు చేయకుండానే వారి ఆస్తులను జప్తు చేస్తామని నోటీసులిచ్చారు. మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టకుండానే నేరస్తులని ముద్రవేసి జ్యుడిషియల్ కస్టడీకి పంపించారు. కొట్టిన తర్వాత జైలులో ఒక మహిళకు విపరీతంగా రక్తం కారుతుంటే తుడుచుకోవటానికి ఒక కాగితం ముక్కను మాత్రమే ఇచ్చారంటే ఆందోళనకారుల పట్ల ఎంతక్రూరంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు. జైలులో మహిళల ముందే మగ ఖైదీలు బట్టలు మార్చుకుంటున్నా వారించలేదు. జైలులో వైద్యం, ఇతర సదుపాయాలు కల్పించలేదు. పోలీసులు, ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని జైళ్ళలోని మహిళల పట్ల ప్రవర్తించిన తీరు స్పష్టం చేస్తున్నది. మీడియా ప్రచారం ద్వారా ఆందోళనలలో పాల్గొంటున్న మహిళలను రాళ్ళు విసిరేవారు, గొడవలు సృష్టించేవారంటూ ముద్రవేశారు. సిసిటివి కెమెరాలను పగులగొట్టి పోలీసులు షాపులను లూఠీ చేశారు. ఈ చర్యలను ఫోటోలు తీస్తున్న విలేకరులపై దాడులు చేశారు. పోలీసులలోనూ, అధికారులలోనూ కొందరు ఈ హింసాకాండను వ్యతిరేకించేవారు ఉన్నప్పటికీ తమపై ఉన్న తీవ్రమైన వత్తిడి రీత్యా వారేమీ చేయలేక పోయారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నవారిలో రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారాలు చేసుకొనేవారు, ప్రజాఉద్యమాలలో, పౌరసం ఘాల కార్యక్రమాలలో



epaper.prajasakti.com

పాల్గొనేవారు ఉన్నారు. ఆందోళనలలో పాల్గొన్నందుకుగానూ తనకు విధించిన జరిమానాను చెల్లించకుండా టీ దుకాణం ప్రారంభించిన రిక్షా కార్మికుని తిరిగి అరెస్టు చేసి జైలుకు పంపారు. నేరం రుజువు కాకుండానే ఒకరిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళనలలో పాల్గొంటున్న వారిని శారీరకంగా, మానసికంగా, నైతికంగా దెబ్బతీయటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది.

**ముస్లింల పట్ల వివక్ష**

మౌ నగరంలో ఉన్న 22 లక్షల మందిలో 5 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. అక్కడి ప్రజలు కూడా సిఎఎ, ఎన్‌ఆర్‌సి వ్యతిరేక ఆందోళనలలో భాగస్వాములయారు. ఆందోళనలు శాంతియుతంగా జరిగినప్పటికీ పోలీసులు లాఠీఛార్జి చేసి, 252 మందిపై కేసులు పెట్టారు. మొత్తం 6 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ఒక్కో ఎఫ్‌ఐఆర్‌లో 24 సెక్షన్ల కింద నేరారోపణలు చేశారు. మతోన్మాద ప్రచారాన్ని వ్యతిరేకిస్తూ సోషల్‌మీడియాలో సాధారణ మెసేజ్‌లను పెట్టినందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని అరెస్టు చేసి కేసులు పెడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నప్పటికీ ముస్లిం ప్రజానీకం తమ సమస్యలపై ఆందోళనలు చేయకూడదన్న విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. తబ్లిగ్ జమాతి సమావేశంలో పాల్గొన్నవారిలో 152 మందిని అరెస్టు చేసి, 269, 270 సెక్షన్ల కింద కేసులు పెట్టారు. హత్యా ప్రయత్నం చేశారనే ఆరోపణలతో వారిలో 42 మందిపై 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు. క్వారంటైన్‌కు తీసుకెళ్ళిన వారిని 50 రోజుల వరకు బయటకు రానివ్వలేదు. వారిలో ఇద్దరు మైనర్లు కూడా ఉన్నారు. అక్కడ అధ్వాన్నంగా ఉన్న పరిస్థితులను గురించి వెల్లడించిన వారిపై తిరిగి కేసులు నమోదు చేశారు. ఈ విధంగా ప్రభుత్వం, పోలీసులు ప్రజలను బెదిరించటానికి ప్రయత్నిస్తుండగా, ప్రజలకు జైళ్ళంటే క్రమంగా భయం తగ్గిపోతున్నది.

**గిరిజన ప్రాంతాలలోనూ హింసాకాండ**

లాక్‌డౌన్‌ను ఉపయోగించుకొని పోలీసులు గిరిజనులను అడవుల నుండి బయటికి తరమటానికి ప్రయత్నిస్తున్నారు. గిరిజనులు దీనిని తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఈ మధ్య కాలంలోనే లఖింపూర్‌ఖేరి, దుధ్వ నేషనల్ పార్క్‌లలో ఫారెస్టు సిబ్బంది, పోలీసులు గిరిజనులపై దాడులు చేశారు. చరిత్రలో మొట్ట మొదటిసారిగా పోలీసులు, ఫారెస్టు సిబ్బందిపై గిరిజన మహిళలు కేసు నమోదు చేయించారు.

**"లాక్‌డౌన్‌ను ఉపయోగించుకొని పోలీసులు గిరిజనులను అడవుల నుండి బయటికి తరమటానికి ప్రయత్నిస్తున్నారు. గిరిజనులు దీనిని తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఈ మధ్య కాలంలోనే లఖింపూర్‌ఖేరి, దుధ్వ నేషనల్ పార్క్‌లలో ఫారెస్టు సిబ్బంది, పోలీసులు గిరిజనులపై దాడులు చేశారు. చరిత్రలో మొట్ట మొదటిసారిగా పోలీసులు, ఫారెస్టు సిబ్బందిపై గిరిజన మహిళలు కేసు నమోదు చేయించారు."**




గిరిజనులు తమ ఆందోళనను వ్యక్తం చేయటానికి అటవీ హక్కుల చట్టం మంచి అవకాశం కల్పించింది. అంతకు ముందు అడవులలో నివసిస్తున్న వారినందరిని మావోయిస్టులని ప్రభుత్వం, పోలీసులు ముద్రవేశారు. ఉపాధి, విద్య, వైద్యం తదితరాల కోసం ప్రజాస్వామిక పద్ధతులలో చర్చను, రాజకీయ కార్యక్రమాలను ప్రారంభించాలని, భూమి, ఉపాధి తదితర సమస్యలపై భారీ ఉద్యమాలను నిర్వహించటం ద్వారా ఇటువంటి విధానాలను ఎదుర్కోవాలని భావిస్తున్నారు. సామాజిక అడవులను పెంచటం ద్వారా కొద్దిస్థాయిలో అయినా స్వయం ఉపాధిని కల్పించటంలో గిరిజన మహిళలు మార్గం చూయించారు. సహకార ఉద్యమాన్ని నిర్మించి, ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఇబ్బందులలో ఉన్నవారికి సహాయం అందించటానికి పూనుకోవాలని వివిధ సంస్థలు భావిస్తున్నాయి.

ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ కార్పొరేట్ ఫాసిజాన్ని అమలుచేస్తున్నది. లాక్‌డౌన్ కాలంలో కార్మికచట్టాల్ని మార్చి, వారి హక్కుల్ని హరించటంలో అగ్రస్థానంలో ఉంది. పని గంటలను పెంచటం, పని పరిస్థితులలో మార్పులు చేయటం, వేతనాలను తగ్గించటం ద్వారా వారిని బానిసల స్థితికి దిగజారుస్తున్నది. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితి ఎమర్జెన్సి నాటికన్నా అధ్వాన్నంగా ఉంది. లాక్‌డౌన్‌ను ఉపయోగించుకొని ప్రజలకు ఉపయోగపడే చట్టాలను వారికి వ్యతిరేకంగా వినియోగించే విధంగా మార్చటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

చేనేత కార్మికులు కూడా తీవ్రమైన దారిద్ర్యంలో ఉన్నారు. విద్యుత్ ఛార్జీలు ఇతర రాష్ట్రాలలో యూనిట్‌కు 2-3 రూపాయల మధ్య ఉండగా ఉత్తరప్రదేశ్‌లో 7.35 రూపాయలుంది. పవర్‌లూమ్ రంగానికి ఇస్తున్న రేట్లకన్నా రెండురెట్లు ఎక్కువగా చేనేత రంగం నుండి కరెంటు ఛార్జీలను వసూలు చేస్తున్నారు. వారి సమస్యలను ప్రభుత్వానికి వివరించినా ఎటువంటి స్పందన లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సహాయం అందించకపోవటంతో ఈ పరిశ్రమ కుప్పకూలిపోయే పరిస్థితి ఉంది. ప్రస్తుతం చేనేత కార్మికులు రోజుకు 300 రూపాయలు కూడా పొందలేకపోతున్నారు. ప్రభుత్వ విధానాలను వినియోగించుకొని, కార్పొరేట్ సంస్థలు ఈ రంగాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని, చేనేత కార్మికులను కట్టుబానిసత్వంలోకి నెట్టటానికి ప్రయత్నం చేస్తున్నాయి.

మహమ్మారి వ్యాప్తి గురించి తెలుసుకోవటానికి ఢిల్లీ ప్రభుత్వం చేయిస్తున్న పరీక్షలలో ఒక్కశాతం కూడా ఉత్తరప్రదేశ్‌లో


epaper.prajasakti.com

**"యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వతంత్రంగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులపై దాడులు పెరిగాయి. ఇసుక మాఫియా, ఇతర అక్రమ వ్యాపారాలు చేస్తున్నవారు, కాంట్రాక్టర్లు తదితరులు జర్నలిస్టులను బెదిరించం, తమ మాట వినని వారిని హత్యలు చేస్తున్నారు. తాజాగా జర్నలిస్టు విక్రంజోషిని ఆయన కుమార్తెల ముందే బహిరంగంగా కాల్చిచంపారు."**

చేయటం లేదు. ఆ విధంగా చేస్తే కేసుల సంఖ్య పెరుగుతుందని, కేసుల సంఖ్యను తక్కువగా చూయించటం కోసం పరీక్షల సంఖ్యను తక్కువగా చేస్తున్నారు. ఈ విధంగా తక్కువగా చూయించాలని ప్రయత్నిస్తున్నప్పటికీ రాష్ట్రంలో కేసుల సంఖ్య పెరుగుతున్నది. మరోవైపున చేస్తున్న పరీక్షలను గురించి పొసగని విధంగా అసత్య ప్రచారం చేస్తున్నారు. 10 లక్షల మందికి పరీక్షలు చేశామని ఒకరోజు ప్రభుత్వం ప్రకటించింది. మరికొద్ది రోజుల తర్వాత 90 లక్షల మందికి పరీక్షలు నిర్వహించామని ముఖ్యమంత్రి ప్రకటించాడు. రాష్ట్రంలో పరీక్షలు నిర్వహించటానికి ఉన్న సామర్ధ్యాన్ని పరిగణనలోకి తీసుకొంటే ఇదెలా సాధ్యం?

### జర్నలిస్టులపై పెరిగిన దాడులు

యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వతంత్రంగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులపై దాడులు పెరిగాయి. ఇసుక మాఫియా, ఇతర అక్రమ వ్యాపారాలు చేస్తున్నవారు, కాంట్రాక్టర్లు తదితరులు జర్నలిస్టులను బెదిరించం, తమ మాట వినని వారిని హత్యలు చేస్తున్నారు. తాజాగా జర్నలిస్టు విక్రంజోషిని ఆయన కుమార్తెల ముందే బహిరంగంగా కాల్చిచంపారు. తన మేనకోడలిని వేధిస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయటమే ఆయన చేసిన నేరం. ఫిర్యాదు చేసినప్పటికీ అల్లరికి పాల్పడిన వారిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పోలీసుల అలసత్వాన్ని అలుసుగా తీసుకున్న అల్లరిమూకలు ఆయనను హత్య చేశారు. హత్యకేసులో అరెస్టు చేసిన తొమ్మిది మంది సంఘ వ్యతిరేకశక్తులు. చట్టాలను లెక్కచేయకుండా తమ చట్టాలను అక్కడ అమలుచేస్తుంటారు. కాన్పూర్‌లోని ఒక ప్రైవేటు ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సంజీవ్‌గౌడ్‌ను కొందరు వ్యక్తులు గతనెలలో కిడ్నాప్ చేసి, డబ్బు డిమాండ్ చేశారు. వారికి డబ్బు అందకపోవటంతో ఆయనను చంపివేశారు. ఇప్పటికీ ఆయన శవం దొరకలేదు. ఆయన కుటుంబం పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేసిన తర్వాత ప్రభుత్వం విచారణకు ఆదేశించి, ఎస్‌పితో సహా నలుగురు పోలీసులను సస్పెండ్ చేసింది. యుపిలో అరాచకానికి, పెరుగుతున్న హత్యాకాండకు, నేరస్తులు స్వేచ్ఛగా వ్యవహరిస్తున్న తీరుకు, పోలీసులకు సంఘ వ్యతిరేక శక్తులతో ఉన్న సంబంధాలకు ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ ఫాసిస్టు ఎజెండాను ప్రధానంగా ప్రచారం చేస్తున్న కార్పొరేట్ మీడియా బిజెపి ఐటి విభాగం లాగా పనిచేస్తున్నది. ఉదాహరణకు మార్చి 22వ తేదీన లాక్‌డౌన్ విధించిన తర్వాత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాముని విగ్రహాలను రామ మందిరం నిర్మించబోయే ప్రాంతంలోకి తరలించటం కోసం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రముఖ పాత్రికేయుడు సిద్దార్ధ వరదరాజన్ దీనిని ప్రశ్నించినందుకు ఆయనకు నోటీసు జారీ చేశారు. ముసాహర్ తరగతికి చెందిన పిల్లలు గడ్డితింటూ కనిపించిన సన్నివేశాలను ఫోటోలు తీసి పత్రికలలో ప్రచురించటం రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను ప్రజలు అర్థం చేసుకోవటానికి దోహదం చేసింది. మరుచటి రోజు ప్రభుత్వానికి చెందిన ముఖ్యులు ఒకరు ఫోటోలు నకిలీవంటూ ప్రకటన విడుదల చేయటంతో పాటు విలేకరిపై కేసు నమోదు చేశారు. సోనెభద్రలో ఒక పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పిల్లలకు చపాతి, ఉప్పు మాత్రమే పెట్టటంతో ఆ సంఘటనపై ఒక విలేకరి వార్త పంపాడు. వెంటనే ఆ విలేకరిని పట్టుకొని జైలులో పెట్టారు. కార్పొరేట్ మీడియాలో లేకుండా ఉండి, స్వతంత్రంగా వ్యవహరిస్తున్న విలేకరులు నిరంతరం దాడులకు గురవుతున్నారు. ప్రజలను మరింగా దరిద్రం, నిరుద్యోగంలోకి నెడుతున్న ప్రభుత్వం వారిని భయాందోళనలకు గురిచేయటం ద్వారా తన విధానాలను అమలుచేయటానికి ప్రయత్నిస్తున్నది.

యుపిలో ఎన్‌కౌంటర్ రాజ్ నడుస్తోంది. 2019 డిసెంబరులో పోలీసు అధికారులు 2017 నుండి 5,178 ఎన్‌కౌంటర్లు చేశామని, వీటిలో 103 మంది నేరస్తులు మరణించారని, 1859 మంది గాయపడ్డారని ప్రకటించారు. రోజుకు మూడుకు పైగా ఎన్‌కౌంటర్లకు పోలీసులు పాల్పడ్డారు.

### మహిళలపై పెరిగిన దాడులు

నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో లెక్కలననుసరించి 2017లో దేశంల మహిళలపై 3,59,849 నేరాలు జరగగా, వాటిలో 59,445 నేరాలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నది. ఉన్నావోలో బిజెపి శాసనసభ్యుడు సెంగార్ మహిళను మానభంగం చేసి, కుటుంబాన్నంతా హింసించాడు. పోలీసులు పెట్టిన హింసకు ఆమెతండ్రి పోలీస్‌స్టేషన్‌లో చనిపోయాడు. తర్వాత యాక్సిడెంట్ చేసి బాధితురాలిని చంపటానికి చేసిన ప్రయత్నంలో మరొకరు మరణించారు. యోగికి అత్యంత సన్నిహితుడైన మాజి కేంద్రమంత్రి స్వామి చిన్మయానంద తన కాలేజిలో చదువుతున్న విద్యార్థినిని మానభంగం చేసి వేధించాడు. బిజెపి నాయకులకు సంబంధం ఉన్న ఇటువంటి అత్యాచార సంఘటనలు యోగి పాలనలో అనేకం జరుగుతున్నాయి. లాక్‌డౌన్ సమయంలో వలసలు వెళ్ళినవారిలో గర్భవతులైన మహిళలు కూడా వారి స్వగ్రామాలకు చేరటానికి వేలాది కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చింది. వారికి వైద్యం అందించటానికి కూడా ప్రభుత్వం శ్రద్ధ తీసుకోలేదు.

### నిరంకుశ చట్టాల అమలు

గూండాచట్టం, జాతీయ భద్రతాచట్టం, గ్యాంగ్‌స్టర్ చట్టాలను ప్రయోగించటం ద్వారా ప్రభుత్వం ప్రజలను అణచివేస్తున్నది. 2017లో సహరాన్‌పూర్ జిల్లాలోని షబ్బీర్‌పూర్‌లో జరిగిన హింసాకాండ, 2018లో జరిగిన భారత్‌బంద్ సందర్భంగా జాతీయ భద్రతాచట్టం కింద దళితులపై కేసులు పెట్టారు. ఎక్కడైనా దళితులు, ముస్లింలపైన మాత్రమే జాతీయ భద్రతాచట్టం కింద కేసులు పెడుతున్నారు. వారిని దేశానికి ప్రమాదకరమైవారుగా ప్రభుత్వం పరిగణిస్తున్నది. లక్నోలో 68 మందిపై గూండా వ్యతిరేక చట్టం కింద కేసులు పెట్టారు. 2019లో ఉత్తరప్రదేశ్‌లో సుమారుగా 16,000 మందిపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద, 19,000 మందిపై గూండా వ్యతిరేక చట్టం కింద కేసులు నమోదు చేశారు. ❋


epaper.prajasakti.com

# సుర్మా లోయలో రైతాంగ పోరాటాలు

(2వ పేజీ తరువాయి)

అణచివేయుటానికి తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించారు. కానీ ఆ ప్రాంతంలోని రైతులందరూ జమీందారుల అణచివేతకు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మరింత పట్టుదలతో ముందుకొచ్చారు. దీనితో సుర్మాలోయలో పోరాటం చివరి దశకు చేరింది. అస్సాం అంతటా కౌలు రైతుల రక్షణ కోసం, న్యాయమైన కౌలుకోసం చట్టం తేవాలని జమిందారీ పద్ధతి అమలులో ఉన్న ప్రాంతమంతా ఉద్యమం విస్తరించింది.

1930లలో అస్సాంలో రైతాంగ ఉద్యమం ప్రధానంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాగింది. ఉద్యమం ధనిక రైతుల నాయకత్వంలో ఉండడం వలన పేద రైతుల డిమాండ్లనుగాని, భూమిలేని రైతుల డిమాండ్లను గాని లేవనెత్తేవారు కాదు. పంటలో భాగం పొందే (షేర్ క్రాపర్స్) కౌలురైతుల, వ్యవసాయ కూలీల డిమాండ్లను పట్టించుకునేవారు కాదు. దీనితో 1940ల తరువాత రైతుల మద్దతు కొరవడడంతో ఈ సంఘాల కార్యకలాపాలు ఆగిపోయాయి.

1938 నుండి కమ్యూనిస్టుపార్టీ అస్సాంలోని వేర్వేరు ప్రాంతాలలో వ్యక్తులుగా గాని సమూహంగా గాని రైతాంగంలో పనిచేస్తూనే ఉన్నది. అయితే 1943లో అస్సాంలోయ కమిటీ (ఆ తరువాత కాలంలో అస్సాం ప్రాంతీయ సంఘ కమిటీగా రూపొందింది) ప్రారంభించిన తరువాత మాత్రమే ఏ ఐ కె ఎస్ ప్రారంభించడానికి ఏర్పాట్లు జరిగాయి. ఆ పేరుతో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అంతకు ముందు 1940లో కమ్యూనిస్టు లీగ్ ఆధ్వర్యంలో అస్సాం కిసాన్‌సభ (రైతు కూలీల సంఘం) ఏర్పడింది. ఇది స్వతంత్రంగా పనిచేసేది. కాంగ్రెస్ విధానాలను వ్యతిరేకించేది. ఈ సంఘం కామరూప్, సిబ్‌సాగర్, దిబ్రుఘర్ జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో చురుకుగా పనిచేసేది.

1943లో హవోరార్ప్‌లో కిసాన్‌సభ మొదటి మహాసభ నిర్వహించబడింది. అందులో అధికధరలకు, నల్లబజారులో అమ్మకాలకు, సరుకులను దాచిపెట్టడానికి వ్యతిరేకంగా, వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని, వరి విత్తనాలు అందించాలని, జమీందారుల, జోతేదారుల, వడ్డీ వ్యాపారుల అణచివేత చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేయడం జరిగింది. 1944లో జరిపిన గోల్‌పారా మహాకుమా కిసాన్ మహాసభలో జమిందారీ వ్యవస్థను రద్దు చేయాలని తీర్మానించడం జరిగింది.

గిరిజన రైతులను సంఘటితం చేసి గిరిజన సంఘాన్ని పునర్నిర్మించడానికి కమ్యూనిస్టులు చొరవ తీసుకున్నారు. ఆ బ్యానర్ కింద ఆర్థిక సమస్యలను కూడా తీసుకోవడం మొదలు పెట్టారు. దీని ప్రభావంతో బంగ్లబారి, బిజిని దుఆరా టీ తోటలలోని యజమాని తమకిచ్చే కౌలు డబ్బురూపంలో కాక ధాన్యం రూపంలో ఇవ్వాలని, యాజమాని బంగళా ముందు నుండి వెళ్ళేటప్పుడు గొడుగు పట్టుకోకూడదని, బూట్లు వేసుకోకూడదని వగైరా వేధింపులకి వ్యతిరేకంగా ఉద్యమించడానికి ఒక సమావేశం ఏర్పాటుచేశారు. మేనేజర్ల అణచివేత చర్యలను నిరసిస్తూ ఎర్రజెండాలతో పెద్ద ప్రదర్శన నిర్వహించారు. ఆ ప్రదర్శన తరువాత మేనేజర్‌ల బంగళాల ముందు నుండి వెళ్ళడానికి ఎటువంటి నియమ నిబంధనలు పాటించవలసిన అవసరం లేకుండా పోయింది.

యుద్ధం ముగిసిన తరువాతి కాలంలో ఎగసిపడ్డ సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో ఈశాన్య ప్రాంతంలో అత్యధికంగా దోపిడీకి గురవుతున్న అర్ధ బానిస విధానమైన నాంకేర్ వ్యవస్థకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. జమిందారులకు వ్యతిరేకంగా సుర్మాలోయలో జరుగుతున్న నాంకేర్‌ల ఉద్యమానికి, జమిందారులకు వ్యతిరేకంగా పోరాడుతున్న కౌలురైతుల నుండి మంచి మద్దతు లభించింది. ఈ సంఘం 1946లో ప్రారంభమై దేశం విభజించబడిన తరువాత పెద్ద ఉద్యమంగా ఎదిగింది.

1946లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భూస్వాములతో కుమ్మక్కయి పెద్ద ఎత్తున అణచివేతకు పాల్పడింది. దేశ విభజన జరిగిన తరువాత సిల్హెట్ బాంగ్లాదేశ్‌లో కలిసిపోయింది. కానీ నాంకేర్‌లు మాత్రం ఎర్రజెండా కింద పోరాడుతూనే ఉన్నారు – కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత స్థానాన్ని ముస్లింలీగ్ ప్రభుత్వం తీసుకోవడం ఒక్కటే తేడా. ఈ పోరాటం తరువాత లీగ్ ప్రభుత్వం నాంకేర్ల డిమాండ్లు కొన్నింటిని అంగీకరించింది.

1944 నుండి కిసాన్‌సభ తన ప్రజా పునాదిని పెంచుకుంటూనే ఉంది. ప్రజలపై జరుగుతున్న అనేక రకాల దాడులను వ్యతిరేకించింది. కరువు పరిస్థితులకు, అధిక ధరలకు, నల్లబజారుకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించింది. మణిపూర్ కమ్యూనిస్టు నాయకుడు, ఆ ప్రాంతంలో స్వాతంత్రోద్యమ నిర్మాతలలో ఆద్యుడు అయిన కామ్రేడ్ ఐరావత్ సింగ్ నాయకత్వంలో కచార్‌లో కిసాన్‌సభ కార్యకలాపాలు బలపడ్డాయి. సిల్హెట్ జైలులో బంధించబడినప్పుడు కమ్యూనిస్టులతో ఏర్పడిన పరిచయాలు ఆయనను కమ్యూనిస్టుగా మార్చాయి. విడుదల అయిన తరువాత మణిపూర్‌లోకి ప్రవేశం నిరాకరించబడి నందువలన ఆయన సిల్చారులోనే ఉండవలసి వచ్చింది. అందువలన అక్కడ కిసాన్‌సభను పటిష్టపరిచారు. బెంగాల్‌లో తెభాగా పోరాట అనుభవాల ప్రభావంతో 1946లో కచార్‌లో కూడా అటువంటి డిమాండ్లను లేవనెత్తడం,పోరాటాలకు పిలుపులు ఇవ్వడం జరిగింది. ఈ డిమాండ్లు వెను వెంటనే వేలాదిమంది కౌలు, పేద రైతులలో, వ్యవసాయ కూలీలలో మంచి ఆదరణ పొందాయి. ఈ పోరాటాలను పాశవికంగా అణచివేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం తనకు చేతనయిన అన్ని రకాల సాధనాలను ఉపయోగించింది. అయితే రైతులు తమ పోరాటాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లి తమ క్రమశిక్షణను, ధైర్యాన్ని మరోమారు చాటుకున్నారు.

పోలీసులు సన్నకారు రైతులపై దాడులు చేసి వెళ్లగొడుతుంటే శ్రామిక మహిళలు పోలీసులతో తగువు పడి, పోరాడి వారిని వెనక్కు నెట్టారు. ఆ మహిళా నాయకుల పేర్లు ఇంటింటా మారుమోగాయి. 1949లో సన్నకారు రైతుల పంటను రక్షించుకునే క్రమంలో ఇమాచౌ దేవి అనే మణిపురి మహిళ, మరో నలుగురు వ్యవసాయ కూలీలు అస్సాం రైఫిల్స్ చేతులలో హతులయ్యారు. చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నిస్తుండగా వారిపైన పోలీసులు దారుణమైన దౌర్జన్యకాండను సాగించారు. మరోవైపు జమిందారులకు రైతుల పంటను దోచుకునేందుకు సహకరించారు. కొంతమందిని చంపివేశారు కూడా.

ఈ పోరాటం తరువాత కిసాన్ సభ అస్సాంలోని బ్రహ్మపుత్ర లోయ జిల్లాలో 'ప్రాణాన్నైనా ఇస్తాం, పంటను మాత్రం ఇవ్వం' అనే నినాదంతో 1948-50 మధ్యకాలంలో మరో పోరాటం చేసింది. ఈ పోరాటాలు చిన్న సన్నకారుల రైతుల హక్కులను కాపాడుతూ చట్టాన్ని తేవాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానికి కల్పించాయి. వారి డిమాండ్లను చాలా వరకు ఒపుకునేటట్టు కూడా చేశాయి. ఈ చేదు అనుభవాలు కాంగ్రెస్ ప్రభుత్వం భూస్వాముల తరపునే ఉంటుంది గాని తమతో కాదని రైతులు అర్థం చేసుకొనేటట్లు చేశాయి. ❋



epaper.prajasakti.com

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-08-2020 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20



# ఎవరి యుద్ధమిది?



**- జాన్ రీడ్**

.....యుద్ధం అంటే ఏమిటో నాకు తెలుసు. ఒక్కటి మినహా చాలా సైన్యాలతో నేను పనిచేశాను. మనుషులు చనిపోవడం చూశాను. పిచ్చెత్తిపోవడం, ఆసుపత్రిలో నరకం అనుభవించడం చూశాను. కాని వీటన్నిటికన్నా ఘోరాతిఘోరమైన విషయం మరోటి ఉంది. యుద్ధం అంటే వికృతమైన సామూహిక-మానసిక వైకల్యం. నిజాలు చెప్పేవారిని నిలువునా శిలువ వేయడం. కళాకారుల చేతులు నరికివేయడం. సంస్కరణలనూ, విప్లవాలనూ, సామాజిక శక్తులనూ పక్కదోవపట్టించడం. యూరప్ యుద్ధంలో అమెరికా పాల్గొనకూడదని చెబుతున్న వారిని ఇప్పటికే "దేశ ద్రోహులు" అని అమెరికాలో ముద్ర వేస్తున్నారు. ఇప్పటికే అడుగంటిపోయిన మన భావప్రకటనా స్వేచ్ఛను మరింత అణగదొక్కడాన్ని వ్యతిరేకించేవారిని "ప్రమాదకరమైన ఉన్మాదులు"గా పేర్కొంటున్నారు. పత్రికా సెన్సార్‌షిప్ కూడా పెడతారన్న వార్తలు వస్తున్నాయి....పత్రికలు కూడా యుద్ధ నాదాలు చేస్తున్నాయి. చర్చి యుద్ధం కోసం కాలుదువ్వుతోంది. లాయర్లు, రాజకీయ నాయకులు, స్టాక్ బ్రోకర్లు, సామాజిక గ్రూపుల నాయకులు...అంతా రణన్నినాదాలు చేస్తున్నారు....

. ...కాని ఈ యుద్ధం ఎవరిది? నాది కాదు. మహాగొప్ప ఫైనాన్షియల్ "దేశభక్తుల" వద్ద పనిచేస్తున్న లక్షలాదిమంది అమెరికన్ కార్మికులకు కనీసజీవనం సాగించడానికి ఉపయోగపడే వేతనాలు ఇవ్వడం లేదన్న విషయం నాకు తెలుసు. పేద ప్రజలను కనీసం విచారణ కూడా లేకుండా దీర్ఘకాలం పాటు జైళ్లలో పెట్టిన వైనం చూశాను. శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులనూ, వారి భార్యలనూ, పిల్లలనూ ప్రయివేటు డిటెక్టివ్‌లూ, సైనికులూ కాల్చి చంపడం, అగ్ని మంటల్లో వేసి కాల్చడం చూశాను. యుద్ధంలో ధనికులు మరింత ధనికులయ్యారు. జీవన వ్యయం పెరిగింది. కార్మికులు మరింత పేదలైనారు. ఈ శ్రామికులు యుద్ధాన్ని కోరుకోవడం లేదు. చివరికి అంతర్యుద్ధాన్ని కూడా కోరుకోవడం లేదు. కాని జర్మనీ, ఇంగ్లాండ్‌లో మాదిరిగానే ఇక్కడ కూడా స్పెక్యులేటర్లు, యజమానులు, ధనికులూ యుద్ధాన్ని కోరుకుంటున్నారు. అబద్ధాలు, అభూత కల్పనలతో వారు మన రక్తాన్ని మరిగించి మనల్ని నరరూప రాక్షసులుగా మారుస్తారు. అప్పుడుగాని మనం వారికోసం యుద్ధం చేసి, వారికోసం చావం....

**(రచయిత రష్యాలోని అక్టోబర్ మహావిప్లవం, మెక్సికో అంతర్యుద్ధంతో సహా అనేక చారిత్రక ఘటనలను గ్రంథస్థం చేసిన ప్రముఖ అమెరికన్ జర్నలిస్టు. 1917 ఏప్రిల్‌లో ఆయన మొదటి ప్రపంచ యుద్ధం గురించి "ఎవరి యుద్ధం" అనే పేరుతో రాసిన వ్యాసం నుండి.)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.3. Published on August 1, 2020



epaper.prajasakti.com